




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002



# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 03.02.2025 | సంపుటి : 11 సంచిక : 205 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## ఈనెల 15లోపే

## పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

### మంత్రి పొంగులేటి వెల్లడి

**ఖమ్మం(జనంసాక్షి):** ఫిబ్రవరి 15లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన ఎన్నికలు వస్తున్నాయ్.. జాగ్రత్త అంటూ కార్యకర్తలకు సూచించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వేపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చింది. ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నామంటూ పంచాయతీరాజ్, ఎన్నికల సంఘం అధికారులు తెలిపినట్లు సమాచారం. కులగణన నివేదిక కేబినెట్ సబ్‌కమిటీకి ఆదివారం అందింది. దీనిపై కేబినెట్‌లో చర్చించాక.. 5న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి... కేంద్ర ప్రభుత్వానికి పంపించే వీలుంది. కేంద్రం స్పందన ఎలా ఉన్నా... రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు వెళ్లాలనే కార్యాచరణతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.



## అమ్మాయిలు అదరగొట్టారు

### అండర్ 19 టీ20 వరల్డ్ కప్ విజేతగా టీమ్‌ఇండియా

డిఫెండింగ్ ఛాంపియన్‌గా భారత్ ఫైనల్‌లో అడుగు పెట్టిన భారత్ అక్కడా అదరగొట్టింది. రెండోసారి విజేతగా నిలిచింది. దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. అండర్ 19 టీ20 వరల్డ్ కప్ విజేతగా టీమ్‌ఇండియా నిలిచింది. తుది పోరులో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 83 పరుగుల టార్గెట్‌ను ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 11.2 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్ గొంగడి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. భారత్ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది. తెలంగాణ క్రీడాకారిణి గొంగడి త్రిష టోర్నీ ఆసాంతం బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటింది.



## త్రిష తెలంగాణకు గర్వకారణం

### క్రీడాకారిణికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు

### టీమిండియా జట్టుకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు



**హైదరాబాద్(జనంసాక్షి):** వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందించారు. ఫైనల్ మ్యాచ్ లో అద్భుతమైన ఆటతో టీమిండియా అమ్మాయిల జట్టు

మిగతా 2లో..

# కులగణనతో సామాజిక విప్లవం

### వెనకబడ్డ వర్గాలకు సామాజిక న్యాయం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్(జనంసాక్షి):** వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సామాజిక-ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయలతో పాటు 50 రోజుల వ్యవధిలో సమగ్రమైన కుల గణన నిర్వహించిన తెలంగాణా రాష్ట్రం అద్భుతమైన రికార్డును నమోదు చేసుకుందని పేర్కొన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రజలకిచ్చిన హామీని తూ. చ తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు రావడం చరిత్రాత్మక సందర్భంగా ఆయన అభివర్ణించారు. ప్లానింగ్ శాఖా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సర్వే వివరాలను పుస్తకం రూపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్లానింగ్ సందీప్ సుల్తానీయ,రాష్ట్ర నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆదివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని మంత్రివర్గ

మిగతా 2లో..

### ముస్లింలు,బీసీలు కలిపితే మెజారిటీ 56.33 శాతం

- బలహీనవర్గాల అభ్యున్నతికై వివరాల కోసమే కార్యక్రమం
- 4 న క్యాబినెట్ ముందుకు.. అదే రోజు అసెంబ్లీలో చర్చకు
- ఎన్నికల సమయంలో రాహుల్ వాగ్దానం నెరవేర్చాం
- స్వాతంత్ర్యం తరువాత నిర్వహించిన సర్వేలలో అతిపెద్దది ఇదే
- కులగణన, సామాజిక సర్వేలో వివరాలిచ్చిన 3.50 కోట్ల మంది
- 16లక్షల మంది వివిధ కారణాల వల్ల సర్వేకు సహకరించలేదు
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

### 3,54,77,554 వ్యక్తుల సర్వే వివరాలు

బీసీలు : 1,64,09,179 (46.25%),

ముస్లింలు : 44,57,012 (12.56%)

ఎస్సీలు : 61,84,319 (17.43%),

ఎస్టీలు : 37,05,929 (10.45%),

ఓసీలు : 44,21,115 (13.31%),

ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే వివరాలను మంత్రివర్గ ఉపసంఘానికి అందించిన అధికారుల బృందం

## రేపు మంత్రివర్గ సమావేశం

- అసెంబ్లీ ప్రత్యేక సమావేశం
- నేడు ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై నివేదికను సమర్పించనున్న ఏకసభ్య న్యాయ కమిషన్

**హైదరాబాద్(జనంసాక్షి):** రేపు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. అనంతరం అసెంబ్లీ ప్రత్యేక సమావేశంకూడా నిర్వహించనున్నారు. కాగా ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలోని కేబినెట్ సబ్ కమిటీకి ప్రణాళిక విభాగం సమగ్ర ఇంటింటి కులగణన సర్వే నివేదికను సమర్పించింది.

మిగతా 2లో..

# వేటుపడింది

### ట్రంప్ సంచలన నిర్ణయం



### కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాల ఉత్తర్వులపై సంతకం చేసిన అమెరికా అధ్యక్షుడు

### చట్టవిరుద్ధ వలసలను, మాదక ద్రవ్యాలు అమెరికా సరిహద్దుల్లోకి రాకుండా చేస్తానని హెచ్చరిక

**న్యూయార్క్(జనంసాక్షి):** రెండో సారి అధికారం చేపట్టిన ట్రంప్ తన పాలనలో దూకుడు పెంచారు. ముఖ్యంగా సుంకాల విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా కెనడా, మెక్సికో దిగుమతులతో పాటు చైనాపై సుంకాలు విధిస్తానంటూ పలుమార్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ హెచ్చరికలను నిజం చేశారు. ఆయా సుంకాలు విధించే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు.'నేడు కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాల అమలుకు సంతకం చేశాను. ఫెంటనిల్‌తో సహా మా దేశ పౌరులను చంపే చట్టవిరుద్ధమైన, ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాల ముప్పు కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. మాకు అమెరికన్లను రక్షించాల్సిన అవసరం ఉంది. అందరికీ భద్రత కల్పించడం అధ్యక్షుడిగా నా బాధ్యత. చట్టవిరుద్ధ వలసదారులను, మాదక ద్రవ్యాలు మా సరిహద్దుల్లోకి రాకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో మాటిచ్చాను. ఆ మాటకు కట్టుబడి ఉన్నా' అని తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. కాగా వినియోగదారుల ఆర్థిక రక్షణ బ్యూరో డైరెక్టర్‌గా బైడెన్ హయాంలో నియమితుడైన భారత సంతతి అధికారి రోహిత్ చోప్రాపై అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో..

### ట్రంప్ నిర్ణయంపై కెనడా, మెక్సికో ప్రతీకార చర్యలు



**(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకం విధించే ఆర్డర్లపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ప్రతీకార చర్యలు

మిగతా 2లో..

### డబ్ల్యూటీవోలో తేల్చుకుంటాం: చైనా



**బీజింగ్(జనంసాక్షి):** చైనాపై సుంకాలు విధించాలన్న అమెరికా అధ్యక్షుడి ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మండిపడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)

మిగతా 2లో..

## మోదీ సర్కారు వైఖరి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

### కేంద్రంపె ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు సాధించాలి: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. " నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంపై పోరాటానికి భారాస కూడా కలిసి రావాలి" అని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు నిరసనలో పాల్గొన్నారు.



## భాజపా గుండాగిరి

### మా కార్యకర్తలపై దాడులకు తెబడుతున్నారు:కేజ్రీవాల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో దిల్లీలో రాజకీయం వేడెక్కింది. పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ భాజపా గూండాయిజం చేస్తోందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కమలం పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'దిల్లీలో జరిగే ఎన్నికల్లో

మిగతా 2లో..

## రామ్‌దేవ్ బాబాపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్

### పతంజలి సంస్థ ఎండి ఆచార్య బాలకృష్ణకూ..

### తప్పుడు ప్రచారాల వివాదంలో జారీ చేసిన కేరళ హైకోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యోగా గురువు, పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణకు కేరళ హైకోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పతంజలికి చెందిన దివ్య ఫార్మసీ వైద్య విధానాలపై ప్రజలను

మిగతా 2లో..



### అయోధ్యలో యువతి అత్యాచారం.. హత్య

### కన్నీటి పర్యంతమవుతూ

## రాజీనామాకు సిద్ధమైన ఎంపీ

**అయోధ్య(జనంసాక్షి):** అయోధ్య (ఫైజాబాద్) ఎంపీ అవధేష్ ప్రసాద్ మీడియా ముందు కన్నీటి పర్యంతమయ్యారు. ఇటీవల కనిపించకుండా పోయిన అయోధ్యకు చెందిన యువతి మృతదేహం అత్యంత దారుణ స్థితిలో దొరకడంతో ఎంపీ

మిగతా 2లో..



## దేశ చరిత్రలోనే అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్

### మధ్యతరగతి ప్రజలు హర్షిస్తున్నారు

### ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ చరిత్రలోనే అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్ ఇదేనని మధ్యతరగతి ప్రజలు చెబుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి.. రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఇంత ఉపశమనం ఎప్పుడూ లభించలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన ప్రచార సభలో తాజా బడ్జెట్‌ను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ ఈమేరకు ప్రసంగించారు. ఆప్‌ను దిల్లీకి ఆపదగా పేర్కొం టూ.. 'ఆప్-ద' ప్రభుత్వం 11 ఏళ్లు వృథా చేసిందని విమర్శించారు."నెహ్రూ కాలంలో ఎవరికైనా రూ.12 లక్షల జీతం ఉంటే.. అందులో పావువంతు పన్నుకే వెళ్లేది. ఒకవేళ నేడు ఇందిరా గాంధీ పాలన ఉంటే.. అదే జీతానికి రూ.10 లక్షలు పన్ను చెల్లించాల్సి వచ్చేది. 12 ఏళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో కూడా ఆ మొత్తానికి రూ.2.60 లక్షలు ట్యాక్స్‌గా పోయేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు"

మిగతా 2లో..



# యమపాశంగా రుణభారం

### పదేళ్లలో రూ.62 లక్షల కోట్ల నుంచి రూ.181 లక్షల కోట్లకు పెరిగిన అప్పు

### ఇందులో రూ.190,14,852 కోట్లు దేశీయ, రూ.6,63,920 కోట్లు విదేశీ రుణం.. మొత్తం 192 శాతం పెరుగుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంపై అప్పుల భారం 2026 మార్చి 31 నాటికి రూ.196,78,772.62 కోట్లకు చేరుతుందని కేంద్ర ప్రభుత్వం అంచనావేసింది. ఇందులో రూ.190,14,852 కోట్లు దేశీయ, రూ.6,63,920 కోట్లు విదేశీ రుణం.2025 మార్చి 31 నాటికి ఇది రూ.181,74,284.36 కోట్లు కానుంది. 2015 మార్చి 31 నాటికి దేశ రుణం రూ.62,22,357.55 కోట్లమేర ఉంది. పదేళ్లలో అప్పుల భారం 192% పెరిగింది. అయితే ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కేంద్ర ప్రభుత్వ అప్పులు ఏటా తగ్గుముఖం పడుతున్నట్లు తెలిపారు. జీడీపీలో రుణ నిష్పత్తి తగ్గుతూ పోతోందన్నారు. ఈ ఏడాది ఆర్థికలోటు 4.8%కి తగ్గిందని, 2025-26లో దాన్ని 4.4%కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.రుణ భారాన్ని తీర్చడం అభివృద్ధి ద్వారానే సాధ్యం. ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచినప్పుడు ప్రభుత్వానికి ఆదాయం పెరిగి రుణాలను తీర్చివేసే స్తోమత లభిస్తుంది. అందుకే అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేయాలి. అలాకాకుండా ఉచిత వరాల కోసం అదేపనిగా అప్పులు చేస్తూ అభివృద్ధిని అలక్ష్యం చేస్తే రుణ ఊబి నుంచి బయటపడలేని దుస్థితి నెలకొంటుంది. దాంతో ప్రజలపై అధిక పన్నులు వేసి ఆదాయాన్ని పెంచుకోవడం ప్రభుత్వానికి అనివార్యంగా మారుతుంది. కాబట్టి ప్రభుత్వ రుణ భారం గురించి లోతుగా విశ్లేషించి దాన్ని అధిగమించడం గురించి ఆలోచన చేయవలసి ఉంది. రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న స్వదేశీ, విదేశీ రుణాలను కలిపి ప్రభుత్వ రుణ భారంగా పరిగణిస్తారు. పాత రుణాలపై వడ్డీ, అసలు చెల్లింపులు కూడా దీనిలో భాగమే. ఇంకా భవిష్య నిధి, చిన్న పొదుపు మొత్తాల చెల్లింపులు, భారత ఆహార సంస్థ, చమురు కంపెనీలు జారీ చేసిన ప్రత్యేక సెక్యూరిటీలకు జరపాల్సిన చెల్లింపులు కూడా ప్రభుత్వ రుణ భారంలో అంతర్భాగమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతమేరకు




మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
03.02.2025

# కర్ణాటక చివరి మావోయిస్టు లొంగుబాటు



ఉడిపి(జనంసాక్షి):కర్ణాటక మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో చివరి మావోయిస్టుగా భావిస్తోన్న లక్ష్మి.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉడుపి పోలీసు ఉన్నతాధికారుల ముందు సరెండరైన ఆమె.. ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.లక్ష్మి స్వగ్రామం కుందపుర తాలుకాలోని మచ్చట్టు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం కుటుంబాన్ని విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. అనంతరం నక్సలైట్ అజెండాతో పనిచేయడం ప్రారంభించింది. సమీప ప్రాంతాల్లో మావోయిస్టు సాహిత్యం ప్రచారం చేయడంతోపాటు పోలీసులపై దాడి ఘటనలతో ఆమెపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయి. చాలా ఏళ్లుగా ఏపీలో తలదాచుకున్నట్లు సమాచారం. ఇటీవల లొంగిపోవాలని నిర్ణయించుకున్న లక్ష్మి.. సరెండర్ కమిటీ సభ్యుడు, గతంలో లొంగిపోయిన ఆమె భర్త సలీంతో కలిసి ఉడుపి పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యారు.రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సరెండర్ కమిటీ ఏర్పాటు చేసింది. దీంతో లొంగిపోయే వారికి మార్గం సుగమం కావడంతో ఇటీవల అనేక మంది మావోలు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. రెండురోజుల క్రితమే శృంగేరి తాలూకా కిగ్గా గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకుడు రవీంద్ర నెమ్మార్ చిక్కమగళూరులో అధికారుల ముందు లొంగిపోయాడు. రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా మార్చేందుకు కృషి చేసిన 22 మంది పోలీసు అధికారుల బృందానికి చీఫ్ మినిస్టర్ మెడల్ ఇవ్వనున్నట్లు సీఎం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

# భాజపా గుండాగిరి

ఆప్ విజయం దిశగా పయనిస్తోంది. ఇది భాజపా నాయకులను.. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను అయోమయానికి, నిరాశకు గురిచేస్తోంది. అందుకే ఆ పార్టీ నేతలు ఆప్ కార్యకర్తలపై బెదిరింపులు, దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు మేము భయపడం. ఆ పార్టీకి దిల్లీ అభివృద్ధిపై అజెండా లేదు. సీఎం అభ్యర్థి కూడా లేడు. వారికి కేవలం గూండాయిజం మాత్రమే తెలుసు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దిల్లీ ప్రజలంతా ఎన్నికల్లో భాజపాను ఓడించి బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.అంతకు ముందు కేజ్రీవాల్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు లేఖ రాశారు. తమ పార్టీ కార్యకర్తలపై కమలం పార్టీతో పాటు పోలీసులు పదే పదే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు న్యూ దిల్లీ నియోజకవర్గానికి స్వతంత్ర ఎన్నికల పరిశీలకులను నియమించాలని అభ్యర్థించారు. ఆప్ వాలంటీర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా.. ఫిబ్రవరి 5న దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# రక్షణ వ్యయాల్లో వెనక్కుతగ్గేదిలేదు

– ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ రక్షణ వ్యయాల్లో కోత విధించలేదని.. అదే సమయంలో పింఛన్లు, కొనుగోళ్లను కూడా తగ్గించలేదని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొన్నారు. బడ్జెట్ అనంతరం ఆమె ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలను వెల్లడించారు. "మేము వారిపై చాలా శ్రద్ధ చూపించాం. ఈ సారి కూడా డిఫెన్స్ బడ్జెట్‌తో ఎటువంటి సమస్య లేదు. దాని విశిష్టతను మీరు అర్థం చేసుకోవాలి. మనం ఏదైనా ఆర్డర్ ఇస్తే దానికి ఇన్‌స్టాల్ మెంట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇది సుదీర్ఘ కాలం కొనసాగుతుంది. రక్షణ కొనుగోళ్లలో దాదాపు 60 శాతం భారత్‌లో తయారైనవే అన్న విషయాన్ని మనం గుర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశీయ అవసరాల కోసమే కాదు.. ఎగుమతుల కోసం కూడా పరికరాలను తయారు చేస్తున్నాం. ఎక్స్‌పోర్టుల ద్వారా రూ.25 వేల కోట్లు సంపాదించాము" అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.రక్షణ బడ్జెట్ కింద రూ.6,81,210 కోట్లను ప్రతిపాదించారు. 2024-25 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఇది 9.53 శాతం అధికం. సవరించిన అంచనాల (రూ.6.41 లక్షల కోట్ల)తో పోలిస్తే 6.2 శాతం ఎక్కువ. తాజా కేటాయింపుల్లో కొత్త ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు పెద్దపీట వేశారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో రక్షణ కేటాయింపులు 1.91 శాతంగా ఉన్నాయి. మూలధన వ్యయం కింద రూ.1.8లక్షల కోట్లను కేంద్రం కేటాయించింది. కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక హార్డ్‌వేర్ కొనుగోలుకు ఈ సొమ్మును వెచ్చిస్తారు.బడ్జెట్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రజల కోసం, ప్రజలచేత తీసుకొచ్చిన బడ్జెట్ అని ఆమె అభివర్ణించారు. బడ్జెట్‌లో వేతనజీవులకు ఊరట కల్పిస్తూ పన్ను తగ్గింపు ఆలోచన వెనక ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని తెలిపారు.బడ్జెట్ తర్వాత మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. నిజాయితీగా పన్ను చెల్లింపుదారులుగా ఉన్నప్పటికీ తమ ఆకాంక్షలు నెరవేరలేదని ఫిర్యాదు చేస్తున్న మధ్య తరగతి ప్రజల గొంతుక తాము విన్నామని తెలిపారు. 'నేను ఎక్కడికి వెళ్లినా వెంటనే వినిపించే పదం పన్ను చెల్లింపులు. 'మేం నిజాయితీగా పన్ను చెల్లిస్తున్నాం. నిజాయితీగా ఉంటూ దేశానికి సేవ చేయాలనుకుంటున్నాం. మీరు మా కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' అని ప్రశ్నిస్తుంటారు' ఈ విషయంపై నేను ప్రధాని మోదీజీతో చర్చలు జరిపా. ఆయన మార్గనిర్దేశంతో ముందుకు వచ్చాం" అని సీతారామన్ తెలిపారు.ప్రధాని మోదీ అన్ని రంగాలకు చెందిన వ్యక్తులు, పరిశ్రమల వర్గాల వాణిని విన్నారని తెలిపారు. అందరిని కలిసి సంభాషిస్తారని.. వారి నుంచి సలహాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి పూర్తి బడ్జెట్‌లో వేతనజీవులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఊరట కల్పించారు.

# కులగణనతో సామాజిక విప్లవం



ఉప సంఘం సభ్యులు రాష్ట్ర మంత్రులు దలసరి అనసూయఏసితక్క,దామోదర రాజ నరసింహం,పొన్నం ప్రభాకర్ లకు అంద జేసిందిఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహచర మంత్రులు దామోదర్ రాజ నరసింహం,సితక్క,పొన్నం ప్రభాకర్ లతో కలిసి మాట్లాడారుఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి వేస్తున్న పెద్ద పీట అని ఈ సర్వేను ఫిబ్రవరి 4 న రాష్ట్ర మంత్రివర్గం ముందుంచి ఆమోదం తీసుకుని అదే రోజు అసెంబ్లీలో చర్చకు పెట్టనున్నట్లు ఆయన తెలిపారుఇది 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రధాన వాగ్దానాన్ని నెరవేర్చే దిశగా కీలకమైన అడుగని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సమకాలీన సామాజిక-ఆర్థిక డేటా ఆధారంగా సంక్షేమ విధానాల కోసం పునాది వేసినట్లయిందన్నారుఈ సమగ్ర సర్వే, స్వాతంత్ర్యం తర్వాత అతిపెద్దది, 94,863 గణకులు, 9,628 సూపర్వైజర్లు, 94,261 గణన బ్లాక్స్‌తో 96.9% తెలంగాణ కుటుంబాలను కేవలం 50 రోజుల్లో కవర్ చేసిందన్నారు.76,000 డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల్లో సమాచారాన్ని డిజిటలైజ్ చేశారన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాఫల్యంగా అమలు కోసం డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిందని ఆయన చెప్పారు. నవంబర్ 9, 2024న, తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ తొలి స్పందనకర్తగా పాల్గొని అధికారికంగా సర్వే ప్రారంభించిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.3,54,77,554 వ్యక్తులను కవర్ చేసిన ఈ సర్వే ముఖ్యమైన జనాభా డేటాతో వెల్లడయిందని బీసీలు 1,64,09,179 (46.25%), ఎస్సీలు 61,84,319 (17.43%), ఎస్టీలు 37,05,929 (10.45%), మొత్తం ముస్లిం జనాభా 44,57,012 (12.56%), ఇందులో 35,76,588 (10.08%) బీసీ ముస్లిలు, 8,80,424 (2.48%) ఓసీ ముస్లింలతో పాటు ఇతర ఓసీలు 44,21,115 (13.31%), మొత్తం ఓసీ జనాభా 15.79% ఈ సర్వేలో వివరాలు వచ్చాయన్నారు.ఈ డేటాను తెలంగాణ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా పునర్నిర్మాణం చేయడానికి ఉపయోగిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సర్వేకు ఎదురైన సవాళ్లలో తప్పుడు ప్రచారాలు, హైకోర్టులో పిల్‌లు దాఖలు కావడం వంటి అంశాలుఎదురు అయ్యాయని ఆయన తెలిపారు. కానీ, న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వడంతో సర్వే సమగ్రంగా కొనసాగిందన్నారు. 1.03 లక్షల ఇళ్లు తలుపులు వేసి ఉండటం, 1.68 లక్షల కుటుంబాలు మొదట్లో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇళ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలు ఎదురయ్యాయన్నారు.అయినా ప్రభుత్వం ప్రజల్లో అవగాహనపెంపొందించేలా చేసి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు.బిహార్ కుల గణనకు ఆరు నెలల వ్యవధి పట్టడంతో పాటు రూ. 500 కోట్లు ఖర్చు కాగా, తెలంగాణ కేవలం 50 రోజుల్లో తక్కువ ఖర్చుతో పూర్తి చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇది సమర్థవంతమైన ప్రణాళిక, వికేంద్రీకృత అమలు, మరియు కఠినమైన మానిటరింగ్ కారణమని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి రోజువారీ పురోగతిని పర్యవేక్షించారని ఆయన చెప్పారు"తెలంగాణ డేటా ఆధారిత పరిపాలనలో ముందంజలో ఉందని ఈ సర్వే నిరూపించిందన్నారు. ఇది కేవలం డేటా సేకరణ ప్రక్రియ మాత్రమే కాకుండా, సామాజిక న్యాయ విప్లవం," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సర్వేను విజయవంతంగా అమలు చేసిన రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు."తెలంగాణ పెద్ద స్థాయి డేటా సేకరణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఈ సర్వే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది," అని మంత్రి అన్నారు.బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ సర్వే తెలంగాణ చరిత్రలో ఓ స్వర్ణాధ్యాయం అని, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకాన్ని ప్రదర్శిస్తూ సర్వేలో పాలు పంచుకున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మంత్రి దామోదర్ రాజా నరసింహా మాట్లాడుతూ ఈ సర్వే సామాజిక న్యాయాన్ని నిర్ధారించడంలో నిబద్ధతతో కూడిన ప్రయత్నమని వ్యాఖ్యానించారు. గిరిజన సంక్షేమ మంత్రి ది. సీతక్క మాట్లాడుతూ ఇలాంటి సర్వేలు దేశవ్యాప్తంగా నిర్వహించాలని సిఫారసు చేశారు.కాగా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందజేశారు.కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామన్నారు."స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోంది. అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించింది. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టాం. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు.ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగింది. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాం. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతాం. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది" అని మంత్రి ఉత్తమ్ వివరించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# త్రిష తెలంగాణకు గర్వకారణం

విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష కు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అదరగొట్టే ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు మన రాష్ట్రానికి గర్వ కారణమని ముఖ్య మంత్రి అభిప్రాయపడ్డారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

## రేపు మంత్రివర్గ సమావేశం

అలాగే నేడు ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏక సభ్య న్యాయ కమిషన్ తమ నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి అందించనున్నారు.

**అయోధ్యలో యువతి అత్యాచారం.. హత్య**

## కన్నీటి పర్యంతమవుతూ రాజీనామాకు సిద్ధమైన ఎంపీ

ఆవేదనకు లోనయ్యారు.యువతి కనపడకుండా పోయి మూడు రోజులు అవుతున్నా ఆమెను కాపాడలేకపోయామని..చివరికి దారుణంగా హత్యాచారానికి గురయినట్లు పేర్కొంటూ విలపించారు. ఈ విషయంపై దిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని..యువతి ప్రాణాలు కాపాడలేనందున పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. దీంతో పార్టీ నేతలు ఆయనను సముదాయించారు. మృతురాలి కుటుంబసభ్యులకు న్యాయం చేయడానికి పోరాడాలని సూచించారు. అయోధ్య ప్రాంతానికి చెందిన ఓ యువతి(22) గురువారం రాత్రి కనిపించకుండా పోవడంతో ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా వివస్త్రగా ఉన్న యువతి మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులు వారి గ్రామానికి కొంత దూరంలో ఉన్న కాలువలో గుర్తించారు. కాళ్లు, చేతులు తాళ్లతో కట్టివేసి ఉన్నాయని, అమానుషంగా హత్య చేశారని పేర్కొన్నారు. శరీరంలోని వివిధ భాగాలపై లోతైన గాయాలున్నట్లు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామన్నారు. కాగా పోలీసులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.

**దేశ చరిత్రలోనే**

## అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్

అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారతకు మోదీ ఇచ్చిన గ్యారంటీలను ఈ బడ్జెట్ నెరవేరుస్తుందన్నారు.ఆప్ నేతలు పార్టీని వీడుతున్నారని, ప్రజల్లో పార్టీపై ఎంత ఆగ్రహం ఉందో వారు గ్రహించారని పేర్కొన్నారు. ఈసారి దేశ రాజధానిలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపాపై కేజ్రీవాల్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తాము మురికివాడలను కూల్చేయబోమని, పథకాలను నిలిపివేయబోమని తెలిపారు. ఈనెల 8న కాషాయ పార్టీ విజయం సాధిస్తుందని, వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు రూ.2500 పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు.

## రామ్‌దేవ్ బాబాపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్

తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు ప్రచారాల నేపథ్యంలో కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. దీనిపై పాలక్కాడ్ జిల్లా కోర్టు విచారణ చేపట్టింది.ఈ కేసులో విచారణకు ఫిబ్రవరి 1న హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించగా వారు హజరుకాకపోవడంతో.. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలపై కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఫిబ్రవరి 15న తిరిగి విచారణ చేపట్టనున్నట్లు పేర్కొంది. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వాణిజ్య ప్రకటనల నేపథ్యంలో ఇప్పటికే పతంజలికి చెందిన 10 దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దయిన విషయం తెలిసిందే.

## జనగణన ఆలస్యమెందుకు?

– భారాస ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్(జనంసాక్షి):** జనగణన ఇంకెప్పుడు చేస్తారని భారాస ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్' వేదికగా కేంద్రాన్ని నిలదీశారు.జనగణనను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుందని అడిగారు. ప్రగతిశీల విధానాలకు ఆ వివరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

# వేటుపడింది



డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు.క్రెడిట్ రిపోర్టుల నుంచి వైద్య రుణాలను తొలగించడం లాంటి సంస్కరణలను డెమోక్రటిక్ ప్రభుత్వంలో చోప్రా హయాంలో తీసుకొచ్చారు. ఇంతకాలం తమ ఆలోచనలు, అనుభవాలు పంచుకున్న వారందరికీ రోహిత్ చోప్రా తన సామాజిక మాధ్యమ పోస్టులో ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడైనప్పుడు చోప్రాను ఫెడరల్ ట్రేడ్ కమిషన్ డెమోక్రటిక్ సభ్యుడిగా ఎంచుకున్నారు. తాజాగా ట్రంప్ విధానాలకు అనుగుణంగా పని చేసేందుకూ చోప్రా నేతృత్వంలోని బ్యూరో సిద్ధమైనా.. అంతలోనే ఆయన్ను తొలగిస్తున్నట్లు ఈమెయిల్ అందింది.

## డబ్ల్యూటీవోలో తేల్చుకుంటాం

లో వాషింగ్టన్ నిర్ణయాన్ని సవాలు చేస్తామని ఆ శాఖ ఆదివారం ప్రకటించింది.కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ శనివారం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి.దీనిపై చైనా స్పందిస్తూ అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. దేశ ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. "అమెరికా తప్పుడు పద్ధతులు అనుసరిస్తోంది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ చర్యలతో అమెరికా సమస్యలు తీరకపోగా.. సాధారణ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సహకారాలు దెబ్బతింటాయి. ఈ విషయాన్ని సహేతుక దృష్టితో వాషింగ్టన్ చూడాలి. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారి బెదిరించకుండా.. తన దేశంలో ఫెంటనిల్ వంటి సమస్యలను సొంతగా పరిష్కరించుకోవాలి. తప్పుడు పద్ధతులను సరిచేసుకోవాలని అమెరికాను కోరుతున్నాం" అని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో కోరింది.అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రధాన ప్రచారాస్త్రాల్లో ఫెంటనిల్ అంశం ఒకటి. ఈ డ్రగ్‌ను తమ దేశంలోకి డంప్ చేస్తోందన్న ఒక్క కారణంతోనే చైనాపై 25శాతం అదనపు టారిఫ్‌ను విధిస్తానని నాడే ఆయన హెచ్చరించారు. కేంద్ర నాడీ వ్యవస్థపై పనిచేసే ఈ నొప్పి నివారిణి.. హెరాయిన్ కంటే 50 రెట్లు శక్తిమంతమైందని నిపుణులు చెబుతున్నారు. రెండు మిల్లీ గ్రాముల డోసు కూడా ప్రాణాంతకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి బానిసలుగా మారిన వారు తప్పుడు చీటీలతో ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. దీనిని ఇతర మాదక ద్రవ్యాలతో కలిపి కూడా వాడుతున్నట్లు తెలుస్తోంది.2022 సంవత్సరంలో ఫెంటనిల్ అధిక డోస్ కారణంగా 1,07,941 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా సీడీసీ పేర్కొంది. అంటే సగటున రోజుకు 295 మంది దీని కారణంగా చనిపోతున్నారు. 2023లో ఈ సంఖ్య 1,10,640 ఉండొచ్చని అంచనా వేస్తోంది. 2019లో కొందరు అమెరికా అధికారులు ఈ డ్రగ్‌ను సామూహిక విధ్వంసక ఆయుధంగా వర్గీకరించాలని కోరినట్లు న్యూయార్క్ పోస్టు కొన్ని నెలల కిందట ప్రచురించిన కథనంలో పేర్కొంది.

## ట్రంప్ నిర్ణయంపై కెనడా, మెక్సికో ప్రతీకార చర్యలు

తీసుకునేందుకు కెనడా , మెక్సికో దేశాలు సిద్ధమయ్యాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తునట్లు ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో సైతం ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది.'155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది కెనడా ప్రతిస్పందన. ఇందులో 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం మంగళవారం నుంచి అమల్లోకి వస్తుంది. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని అధ్యక్షుడు ట్రంప్ అనుకుంటే.. మాతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలి. అదే వారికి మంచిది' అని ట్రూడో పేర్కొన్నారు. మరోవైపు.. మెక్సికో సైతం కెనడా బాటలోనే నడిచింది. తాము కూడా అమెరికా దిగుమతులపై టారిఫ్‌లు విధిస్తామని ఆ దేశ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ పేర్కొన్నారు. 'డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో తమ ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాం. మా ప్రభుత్వం నాలుగు నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. పదివేల మందిని అరెస్టు చేశాం. మెక్సికో పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుంది తప్ప.. ఘర్షణ కాదు. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే.. అందుకు కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. టారిఫ్‌లు విధిస్తే సమస్యలు పరిష్కారం కావు. మెక్సికన్ల ప్రయోజనాలకు అనుగుణంగా మేము చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.



# యమపాశంగా రుణభారం

రుణాలు తీసుకోవచ్చో నిర్దేశించే ద్రవ్యపరమైన బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టాన్ని 2003లో ప్రభు త్వం తెచ్చింది.కొవిడ్ కాలంలో ప్రభుత్వానికి పన్ను ఆదా యం తగ్గిపోవడంతో ప్రభుత్వాలు కొత్త రుణాలు తీసుకో వలసి వచ్చింది. అందుకే 2018-19 జీడీపీలో 48.1 శాతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణభారం 2019-20లో 50.7 శాతానికి, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 60.8 శాతానికి పెరిగి పోయింది. 2022-23లో అది స్వల్పంగా 55.9 శాతానికి తగ్గినా 2023-24లో మళ్ళీ 56.9 శాతానికి పెరిగింది. 2024-25లో రుణ భారం జీడీపీలో 56 శాతంగా ఉంటుందని అంచనా. దీన్ని యుద్ధ ప్రాతిపదికపై తగ్గించాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వ రుణాన్ని జీడీపీలో నిర్దిష్ట శాతంగా లెక్కిస్తున్నారు. రుణాన్ని నేరుగా తగ్గించడం ఒక పద్ధతి అయితే, జీడీపీని పెంచడం మరో పద్ధతి. వ్యయంకన్నా ఆదాయం ఎక్కువగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. జీడీపీ పెరిగినప్పుడు జీడీపీ-రుణ నిష్పత్తిలో సానుకూలమైన మార్పు వస్తుంది. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. ఈ వాస్తవాన్ని కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలూ గుర్తించాలి. ఎన్నికల్లో లబ్ధి కోసం ఎడాపెడా అప్పులు చేయడం మానాలి. ఉత్పత్తి కార్యకలాపాల కోసమే రుణాలు తెచ్చి, పెట్టుబడులను పెంచి అభివృద్ధి సాధించడం ద్వారా వాటిని తీర్చివేయాలి. ఇలా ఆచితూచి ఖర్చు చేస్తూ పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షించినప్పుడు రాష్ట్రాలు ఆర్థికంగా పురోగమించగలుగుతాయి. మౌలిక వసతుల అభివృద్ధి, నిపుణ మానవ వనరుల సృష్టి, హరిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి చేసే ఖర్చు నాణ్యమైనది అవుతుంది. దానివల్ల ప్రభుత్వాలకు ఆదాయం పెరిగి అప్పుల తిప్పలు తప్పుతాయి. సామాజిక రంగంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ద్వారా కూడా ప్రభుత్వాలు భారం తగ్గించుకోవచ్చు.కేంద్రం, రాష్ట్రాలు అనుత్పాదక వ్యయాన్ని తగ్గించి అదనపు పన్ను వసూళ్లను సాధించడం ద్వారా రుణ భారాన్ని తగ్గించగలుగుతాయి. లేదా జీడీపీని పెంచడం ద్వారా రుణాల స్థాయిని అదుపులో ఉంచగలుగుతాయి. ఈ రెండు మార్గాలను వేర్వేరుగా లేదా కలగలిపిగాని అవలంబించడం ద్వారా కేంద్రం, రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేసుకోవాలి. అదే జరిగినప్పుడు స్వదేశీ, విదేశీ పెట్టుబడులు తరలి వస్తాయి. అభివృద్ధి, దానితోపాటే ఆదాయాలూ పెరుగుతాయి. రుణాలపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుంది. దీర్ఘకాలంలో సుస్థిర ప్రగతి సుసాధ్యమవుతుంది. ప్రజలకు ఉపాధి, వ్యాపార అవకాశాలు తద్వారా ఆదాయాలు పెరిగినప్పుడు వారు ఉచిత వరాల మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు. స్వశక్తితో వృద్ధి చెందగలుగుతారు. అది కుటుంబాలతో పాటు ప్రభుత్వ రుణభారాన్ని కూడా తగ్గిస్తుంది. రేపు ఎన్నికలు ముగిసి కొత్త కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడగానే రుణాలకు పగ్గాలు వేయడంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ఉచిత వరాల మీద కాకుండా అభివృద్ధి ఫలాలను పంచడం ద్వారా స్థిరమైన పురోగతి సాధించడం సముచితం. భారత్ ప్రగతి పథంలో పరుగులు తీయాలంటే రుణభారాన్ని తగ్గించి అభివృద్ధి సాధనకు ఎక్కువ నిధులు వెచ్చించడం అనివార్యం ఆదాయ వ్యయాలు, రుణాల మధ్య సమతూకం ఉండేలా కుటుంబాలు, ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వాలు జాగ్రత్త పడాలి. దీనికి సరైన ఆర్థిక నిర్వహణ చట్టాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వాలు అనుత్పాదక వ్యయాన్ని తగ్గించుకొని అదనపు పన్నుల ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా రుణ భారాన్ని తగ్గించాలి. పన్ను వసూళ్లు సక్రమంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలి. ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి జీఎస్టీ, ఆదాయ పన్ను చెల్లింపుల్లో తేడాలను అరికట్టాలి. తద్వారా పన్ను ఎగవేతలను నివారించాలి. ఇలా ఆదాయం పెంచుకుంటూ అప్పుల మీద ఆధారపడాల్సిన అగత్యాన్ని తగ్గించాలి.

# బీసీల ఓట్లు బీసీలకే వేయాలి

- ఏ ఎన్నికైనా బీసీలే గెలవాలి
- బీసీ రాజ్యాధికారాన్ని సాధిద్దాం
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్లో బీసీ రాజకీయ యుద్ధభేరి విజయవంతం
- హాజరైన పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు వివిధ కుల సంఘాల నేతలు





**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 02 (జనం సాక్షి) :** బీసీల ఓట్లు బీసీలకే వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మాజీ కూడా చైర్మన్ సంఘ సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన బీసీ రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీల లెక్కలు చెప్పడానికి ప్రభుత్వాలకు 90 సంవత్సరాలు పట్టిందని అన్నారు.ఇప్పుడు మేమే రాబోవు నాలుగు సంవత్సరాలలో లెక్క తేలుస్తామన్నారు.రాష్ట్రంలో రెండు కోట్ల మంది బీసీలు ఉన్నారన్నారు వీరి ద్వారా ఏడాదికి లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలు ఖజానాకు ముట్ట చెబుతున్నారని గుర్తు చేశారు 2028లో బీసీలే రాజ్యాధికారం కు వచ్చి బీసీల ముఖ్యమంత్రి అవుతారని తీన్మార్ మల్లన్న చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి చివరి ఓసి సీఎం అని అన్నారు.అన్ని రంగాలలో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.తెలంగాణ జాతిపితగా ప్రొఫెసర్ జయశంకర్ నే గుర్తు చేసుకోవాలన్నారు.రాబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులు ఎంతమంది ఉన్నా వాళ్ళందర్నీ గెలిపించాలని అందుకు బీసీలకే ఓటు వేయాలని అభ్యర్థించారు.అంతకుముందు ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండాలని కోరారు.రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యమం మన బతుకులను మార్చే ఉద్యమం అని అన్నారు.బీసీలంతా వేరువేరు కాదని బీసీలంతా ఒకే కులం అని బీసీ కులం అని అన్నారు.మనమంతా రాజ్యాధికారం వైపు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభ సమావేశంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, తమిళనాడు డిఎంకె ఎంపీ విల్సన్, సూరజ్ మండల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఈగ మల్లేశం, వి.కృష్ణమూర్తి,,శంకరమ్మ తోపాటు బీసీలకు చెందిన 134 కులాలకు సంబంధించిన కుల పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.అదేవిధంగా వివిధ కళాకారులు వరంగల్ శ్రీనివాస్ మిట్టపల్లి సురేందర్ ఏపూరి సోమన్న తోపాటు పలువురు తమ ధూమ్ ద కళా ప్రదర్శనల ద్వారా ఆహుతులను ఆకట్టుకున్నారు.మొత్తం మీద భారీ సంఖ్యలో హాజరైన ఈ సభ విజయవంతం అయింది.

## ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌కు గుండెపోటు

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో విషాదం అలుముకుంది. హెడ్ కానిస్టేబుల్ పోలోజు సోమేశ్వర్ (51) గుండెపోటుతో మృతి చెందారు. పూర్తి వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి ఆయన ఠాణాలో విధుల్లో ఉన్న క్రమంలో ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలారు. పోలీస్ సిబ్బంది హుటాహుటిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ పోలోజు సోమేశ్వర్ స్వస్థలం దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామం. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమేశ్వర్ మృతదేహాన్ని స్వగ్రామమైన పెద్దముప్పారం తీసుకొచ్చారు. సోమేశ్వర్ పార్థివ దేహానికి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబా నికి అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## విలేకరుల ముసుగులో వసూళ్లు

- రూ.5 లక్షలు ఇవ్వాలంటూ సీఐకి డిమాండ్
- పోలీసుల అదుపులో ముఠా కీలక సభ్యుడు

**నల్గొండ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడలో కొంతకాలంగా పోలీసులే లక్ష్యంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్న నకిలీ విలేకరుల ముఠాలోని ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీ అక్రమాలు బయటపెడతామంటూ ఓ సీఐ స్థాయి అధికారిని బెదిరించి 5 లక్షలు డిమాండ్ చేశారు నకిలీ విలేకరులు. వారి ఆగడాలు తట్టుకోలేక సదరు సీఐ తన మిత్రుడి ద్వారా లక్షా 10 వేల రూపాయలు ఇచ్చినట్లు సమాచారం. ఐనప్పటికీ ఆగకుండా మిగతా 4 లక్షలు ఇవ్వాలంటూ తన కుటుంబాన్ని వేధించడంతో సీఐ ఉన్నతాధికారులను ఆశ్రయించారు. బాధిత అధికారి ఫిర్యాదుతో నకిలీ విలేకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని మరికొందరు ముఠా సభ్యుల కోసం గాలించారు. ఈ ముఠాపై గతంలోనూ కేసులున్నట్లు గుర్తించిన పోలీసులు మిర్యాలగూడ రూరల్ స్టేషన్‌లో 4 కేసులు నమోదు చేశారు. నకిలీ విలేకరి అరెస్టు విషయం బయటకు పొక్కడంతో వారి బాధితులు మరికొంతమంది బయటకు వస్తున్నట్లు సమాచారం.

## అసభ్యంగా తిట్టాడని అంతమొందించారు

- నిందితులను పట్టించిన వాట్సప్ స్టేటస్



**మేడ్చల్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఆటో మరమ్మతులు చేసే విషయంలో స్నేహితుల మధ్య జరిగిన వివాదంలో ఒకరిని మరో నలుగురు మిత్రులు పథకం ప్రకారం హత్య చేశారు. మృతదేహాన్ని ఓ ఫ్యాక్టరీ పక్కన రహదారి వద్ద పడేశారు. ఈ కేసులో పోలీసులు మృతుడి వాట్సాప్ స్టేటస్ ఆధారంగా నిందితులను గుర్తించారు. అనంతరం నిందితులను కటకటాల్లోకి పంపించారు. మేడ్చల్ జిల్లా షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదనపు డీసీపీ ఎస్‌వోటీ విశ్వ ప్రసాద్, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజుతో కలిసి డీసీపీ కె.సురేశ్ కుమార్ వివరాలు వెల్లడించారు. జగద్గిరిగుట్ట అంబేద్కర్ నగర్‌కు చెందిన కృష్ణగౌడ్ అలియాస్ కిట్టు (39) ఆటో నడుపుతూ కుటుంబంతో జీవనం సాగించేవాడు. అతడికి గాజులరామారానికి చెందిన ఆకుల కృష్ణ ముదిరాజ్, సనత్‌నగర్‌కు చెందిన గుర్రం నరేశ్, మాదరబోయిన రవి, గంబు శంకర్‌గౌడ్‌లు మిత్రులు. ఇటీవల ఆటో మరమ్మతుల విషయంలో కృష్ణ ముదిరాజ్‌తో కృష్ణగౌడ్‌కు రూ.500 విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఆ టైంలో కృష్ణగౌడ్ అసభ్య పదజాలంతో తిట్టాడు. అంతకుముందు కూడా మద్యం మత్తులో ఉన్న టైంలో స్నేహితులను దూషించాడు. అందరూ ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్నారు. హత్య చేయాలని పథకం వేశారు. జనవరి 29న దావత్ ఇస్తామని ఆటోలో మెదక్ జిల్లాలోని ఏడుపాయల ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగారు. అదే రోజు రాత్రి 10.30కు తిరిగి హైదరాబాద్? నగరానికి బయల్దేరారు. దారి మధ్యలో ఆటోలోనే అందరూ కలిసి విచక్షణా రహితంగా కృష్ణగౌడ్‌ను కొట్టారు. దీంతో కృష్ణగౌడ్ అక్కడే మృతి చెందాడు.

అర్ధరాత్రి బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖైతాన్ ఫ్యాక్టరీ పక్కన రహదారి వద్ద కృష్ణగౌడ్ మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. జనవరి 30న మృతదేహాన్ని గమనించిన ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. మిత్రులతో కలిసి తన భర్త ఏడుపాయల ఆలయానికి వెళ్లినట్లు వాట్సాప్ స్టేటస్ ఉందని మృతుడి భార్య పోలీసులకు వివరించింది. అలాగే ఆ ఫొటోను వారికి చూపించింది. దీంతో పోలీసులు విచారణ జరిపి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అక్షింతలకు ఓట్లు వేద్దామా.. అభివృద్ధికి ఓటు వేద్దామా

- మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** నిధుల కేటాయింపులో తెలంగాణను తీవ్ర నిర్లక్ష్యం చేశారు అని మంత్రి సీతక్క అన్నారు. కేంద్ర మంత్రులు, ప్రధాని వద్దకు ఎన్ని సార్లు వెళ్ళినా చివరకు మొండి చేయి చూపారన్నారు. తెలంగాణ నుంచి కేంద్రం కి వెళ్తున్న పన్నులను దృష్టిలో పెట్టుకొని నిధులు కేటాయించాలని, కేంద్ర బడ్జెట్.. ఎన్నికల బడ్జెట్.. తప్ప కేంద్ర బడ్జెట్ కాదని, బీజేపీ బడ్జెట్ స్వార్థ బడ్జెట్ అని, తెలంగాణ అంటే బీజేపీకి పిచ్చి విద్వేషమని, ప్రజలు ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ ఉన్న నిధులతో అభివృద్ధి సంక్షేమం అందిస్తోంది. బీజేపీ వాళ్ళు కేవలం అయోధ్య నుంచి అక్షింతలు పంచడం తప్ప అభివృద్ధి కి నిధులు ఇవ్వడం లేదన్నారు. విభజన చట్టం లోని హామీలు మూడు సార్లు అధికారం లోని వచ్చిన అమలు చేయలేదన్నారు. తాముచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు. అక్షింతలకు ఓట్లు వేద్దామా.. అభివృద్ధికి ఓటు వేద్దామ ప్రజలు ఆలోచించాలని, తెలంగాణకు ఇప్పటికైనా నిధులు కేటాయించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేసారు.

## ఇంగ్లీష్‌తో ఉజ్వల భవిష్యత్తు

- సింగరేణి సీఎండీ బలరాం




**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఇంగ్లీష్ భాషను అందరూ కష్టపడి నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని చెప్పారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడం ద్వారా ఆయా రంగాల్లో రాణించేందుకు సులువవుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ద్వారా గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ఆదివారం ముగిసింది. విద్యార్థులకు ఓయూలో నెలరోజుల పాటు వసతి కల్పించి, శిక్షణ అందించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యాభివృద్ధికి, లైబ్రేరీల ఏర్పాటుకు సింగరేణి తరపున ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలకు కూడా విద్యాభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తామన్నారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని అన్నారు. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఈఎల్‌టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, కార్యక్రమ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ సవిన్ సౌద, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశిం, ప్రొఫెసర్ పరిమళ కులకర్ణి, డాక్టర్ మాధవి, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ భవన్‌కు రండి





- జనారెడ్డికి పీసీసీ చైర్మెన్ మహేష్‌కుమార్ గౌడ్ ఫోన్ కాల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** జానారెడ్డికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్లీజ్ ఒక్కసారి గాంధీ భవన్ కు రండి.. అంటూ జానారెడ్డికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిక్వెస్ట్ చేస్తూ జానారెడ్డికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో చివరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుల పీసీసీ చీఫ్ ఫోన్ చేసి బతిమలాడే పరిస్థితులు వచ్చాయంటూ గూలాబీ పార్టీ సోషల్ మీడియా కామెంట్స్ చేస్తోంది. ఇది కాంగ్రెస్ పాలనా అంటే.. అని నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. ఇక అటు 10 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు రహస్యంగా భేటీ అయినట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

## కానిస్టేబుల్ పై దాడి..

- విచక్షణ మరిచి ఓ మందుబాబు ఘాతుకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** మద్యం మైకం తలకెత్తిన ఓ మందుబాబు విచక్షణ మరచి విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..మధురానగర్ కు చెందిన ఓంసింగ్(23) మద్యం మత్తులో తన తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. దాంతో అతని తండ్రి సంజయ్ సింగ్ డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న మధురానగర్ గస్తీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గొడవ చేస్తున్న ఓంసింగ్ ను కానిస్టేబుల్ సవీన్ గౌడ్ తన ట్యాబ్ లో వీడియో చిత్రీకరించసాగారు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన ఓం సింగ్ ఆవేశానికి లోనై విధుల్లో ఉన్న కానిస్టేబుల్ నవీన్ గౌడ్ వద్ద ఉన్న ట్యాబ్ ను లాక్కుని విసిరేశాడు. కానిస్టేబుల్ నవీన్ గౌడ్ పై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కానిస్టేబుల్ కంటి వద్ద గాయమైంది. నిందితుడు ఓంసింగ్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

## అమెరికాలో ఉద్యోగం పేరుతో మోసం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎండీ.అజారుద్దీన్ అనే యువకుడికి టోలీచౌకికి చెందిన అజీజ్ అనే వ్యక్తి జాఫర్ ఖాన్ రిజ్వీ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి వచ్చానని, తనకు అనేకమందితో పరిచయాలు ఉన్నాయని రిజ్వీతో పాటు అతడి భార్య అఫ్రా ఫాతిమాను నమ్మబలికాడు. అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించడంతో పాటు రెండు దఫాలుగా రూ.1.10 లక్షలు ఇచ్చాడు.టెక్సాస్‌లోని ఓ హోటల్‌లో ఉద్యోగం ఖరారు అయిందని త్వరలోనే వీసా వస్తుందని గత కొన్ని నెలల నుంచి సాగదీస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో ముఖం చాటేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు అజారుద్దీన్ ఆదివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్‌ఎస్ 318(2), 318(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆప్ నేతలు అవినీతికి ఆనవాళ్లు

- అవినీతిలో కూరుకుపోయిన ఆప్ ను కూకటివేళ్లతో పెకిలిద్దాం
- బీజేపీ గెలిస్తే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500లు ఇస్తాం
- ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీని కూకటి వేళ్లతో పెకిలించి వేయాల్సిన సమయం వచ్చిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో రూ.28 వేల400 కోట్ల జల్ బోర్డ్ కుంభకోణం, రూ.4,500 కోట్ల బస్సుల కొనుగోలు కుంభకోణం, బస్సుల్లో సదుపాయాల పేరుతో రూ.500 కోట్ల దుర్వినియోగం, నకిలీ హెల్త్ టెస్టుల ద్వారా కోట్ల రూపాయల అక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు...ఢిల్లీ సమగ్ర అభివృద్ధికి మలుపు కాబోతోందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈరోజు (ఆదివారం) ఉదయం బీజేపీ తెలంగాణ కోశాధికారి భండారి శాంతికుమార్, పార్టీ ఢిల్లీ ప్రతినిధి నూనె బాలరాజుతో కలిసి ఈస్ట్ ఢిల్లీ, షాద్రా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో బనియా, బ్రాహ్మణ, వాల్మీకి సామాజికవర్గ ప్రజలు అధికంగా నివాసముండే ప్రాంతాల్లో బండి సంజయ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బీజేపీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... ఆడంబరాలకు, అవినీతికి దూరంగా ఉంటూ పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వచ్చిన ఆప్ నేతలు విలాసవంతమైన జీవితాలను గడుపుతూ ప్రజా ధనాన్ని దోచుకుతిన్నారని మండిపడ్డారు. ప్రజలను మాత్రం బిచ్చగాళ్లలో మార్చారని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సాదాసాదీ జీవితం గడిపిన ఆప్ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చాక అనూహ్యంగా ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం స్కాం తెలంగాణకు విస్తరించిందని, ఈ స్కాం ఢిల్లీ ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు. ఈ కుంభకోణంలో ప్రధాన ముద్దాయిలుగా కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, బీఆర్‌ఎస్ నేత కవిత ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అవినీతి కేసుతో జైలుకు వెళ్లిన కేజ్రీవాల్ కోర్టు ఒత్తిడి చేస్తే బలవంతంగా రాజీనామా చేయకపోవడం ఆయన స్వార్థపూరిత రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తుందని మండిపడ్డారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతల అబద్ధపు, మోసపూరిత రాజకీయాలతో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారన్నారు. మార్పు కోసం, ఢిల్లీ అభివృద్ధి కోసం బీజేపీవైపు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బంపర్ మెజారిటీతో గెలిచి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 'మహిళా సమృద్ధి యోజన' పథకం కింద అర్హులైన పేద మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ.500 లకే ఉచిత గ్యాస్ సిలిండర్, ముఖ్యమంత్రి మాతృత్వ భద్రతా పథకం కింద గర్భిణీ స్త్రీలకు రూ. 21,000తోపాటు 6 పోషకాహార కిట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తాము, దీని ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. దీంతోపాటు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
3 ఫిబ్రవరి 2025
తెలంగాణ

# అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి దీపిక





కళ కళ కోసం కాదు సామాజిక ప్రయోజనమే లక్ష్యం అన్న సిద్ధాంతంతో కాల్పనిక వాదంపై తిరుగుబాటుగా వచ్చిన సాహిత్యం అభ్యుదయవాదం. వ్యక్తి వాద సాహిత్య సృజన పెల్లుబుకుతున్న తరుణంలో సమష్టివాద దృక్పథం, సామాజి క స్పృహ వెరసి అభ్యుదయ సాహిత్య సృజనకు కారణమ య్యాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలు అన్న సిద్ధాంతం, వాస్తవికత, సుందరత, తాత్వికత అనేవి దీనికి పునాదులు. ఈ నేపథ్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు గారి సంఘసంస్కరణ ఉద్యమం, గిడుగు రామమూర్తి గారి వ్యవహార భాష ఉద్యమం, వాటికి లక్ష్యప్రాయంగా సాగిన గురజాడ అప్పారావు గారి సాహిత్యం అభ్యుదయ సాహిత్యం ప్రేరణగా నిలిచాయి. అంతర్జాతీయంగా, జాతీయంగా వచ్చిన సాహిత్య పరిణామాలు తెలుగు నాట అభ్యుదయ సాహిత్య ఉద్యమాన్ని బలోపేతం చేశాయి. ఈ నేపథ్యంలో అరసంలో కీలకపాత్ర వహిస్తూ పలు రచనలు చేసిన పెనుగొండ లక్ష్మీనారాయణగారు వెలువరించిన 256 పుటల అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి "దీపిక" కు ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఇది తెలుగు సాహిత్య విమర్శకు, అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవంగా చెప్పవచ్చు. అందుకు కారకులైన పెనుగొండ లక్ష్మీనారాయణ గారికి అభినందనలు.ఇందులో అభ్యుదయ పథం, స్మరణ, శ్రద్ధాంజలి, శతజయంతి నివాళి, సాహిత్య చరిత్ర ,మంచి మాటలు, విమర్శ,ప్రేమ పత్రాలు, విద్యార్థి సాహితీ కర్తవ్యం శీర్షికన మొత్తం 36 వ్యాసాలు రాశారు. మొదటి అధ్యాయంలో అభ్యుదయ కవిత్వం సజీవ ప్రవంతిగా కొనసాగుతుందని నాటి ప్రజాకవి వేమన నిరసించిన విగ్రహారాధనను, ధనస్వామ్య వ్యవస్థను ఈసడిం చారు. అలాగే ఎల్ల లోకము ఒక్క ఇల్లై వర్ణభేదములెల్ల కల్లై మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును అని శాస్త్రీయ దృష్టిని కలిగిన గురజాడను అలాగే అభ్యుదయ కవితకే పతాక అనదగిన శ్రీశ్రీ మనుష్యుడే నా సంగీతం మానవుడైన సందేశం అన్న మాటల్ని, భూమి కోసం పరితపించే పేదల్ని బెదిరించే భూస్వాముల వైఖరిని ఎండగడుతూ ఆచార్య ఎన్. గోపి రాసిన భూమి మాది ఆకాశము మాదే మధ్యలో వేలాడే గబ్బిలానివి నువ్వు అన్న కవితల్ని ఉటంకిస్తూ కష్టజీవికి రెండు వైపులా ఉండేది అభ్యుదయ కవిత్వం అన్నాడు. అలాగే ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు ప్రయోగములు అనే తన సిద్ధాం త గ్రంథంలో సినారె గురజాడ రాయప్రోలు ఇరువురిని యుగకర్తల అనటాన్ని అకడమిక్ కుట్రగా పలువురు పేర్కొనటాన్ని సమర్థించారు. అరసం అగ్రశ్రేణుల్లోఒకరైన రాంభట్ల కృష్ణమూర్తి గారిని గురించి చెబుతూ ఆయన మాట్లాడుతుంటే వినటానికి, ఆయన రాసింది చదవటానికి ఒక స్థాయి కావాలి. ఆయన మాటలు జ్ఞాన బోధలు. రాతలు విజ్ఞాన ఖనులు అన్నారు. తిరుమల రామచంద్ర గారికి మన లిపి పుట్టు పూర్వోత్తరాలను సరి చేసుకోవడానికి తోడ్పడ్డ భాషా శాస్త్రవేత్త రాంభట్ల అని అభివర్ణించారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించింది. మృత్యుంజయులు, సింహ గర్జన, ఓనమాలు, సంఘం, ప్రజల మనిషి నవలలు వచ్చాయి. తెలంగాణ విమోచనోద్యమం నవలపై వరవరరావు చేసిన పరిశోధన ప్రామాణికమైనది. అలాగే కథా సాహిత్యంలో అట్లూరి పిచ్చే శ్వరరావు రచించిన విముక్తి కథలోని సుబ్బమ్మ పాత్రకు ఐలమ్మ స్పూర్తినిచ్చిందంటారు. గేయ కవిత్వంలో తిరునగరి రామాంజనేయులు, సుద్దాల హనుమంతు, తుమ్మల వెంకట్రామయ్య, బండి యాదగిరి రాసిన గేయాలు ప్రబోధాత్మకమైనవి. సుంకర వాసిరెడ్డిలు రచించిన మాభూమి నాటకం ప్రభావశీలమైనది కావడం వల్ల నాటి ప్రభుత్వం దాన్ని నిషేధించింది. ప్రపంచీకరణ ప్రభావం దేశభాషలపై ఎలా పడిందో కెంగారు మోహన్ రాసిన గ్లోబల్ శారద కవితలో మరణశయ్యపై పడిన మాతృభాష - తులసి తీర్థానికి పరితపిస్తోంది-అచ్చులు, హల్లులు, ఒత్తులు, దీర్ఘాలు అనంత వాయువుల్లో కలిసే సమయం వచ్చింది అంటూ వస్తు వ్యామోహం లో పడిన మనిషి వేళ్ళు లేని మొక్క అయ్యాడని అతని దైన్యాన్ని వివరించారు. రాచపాలెం సాహిత్య విమర్శను గురించి చెప్పిన మొత్తం సమాజం వెంట రచయితలు పరిగెత్తలేనట్లే మొత్తం సాహిత్యం వెంట విమర్శకులు పరిగెత్తలేరు అన్న మాటలు అక్షర వాస్తవాలు. ఆచార్య ఎస్వీని గూర్చి రాస్తూ పెనుగొండ అతన్ని సామాజిక సాహిత్య ఉద్యమ జీవిగా పేర్కొంటూ అరసంతో మమేకమైన తమ అనుబంధాన్ని ఆత్మీయంగా పంచుకున్నారు. కథానికల గురించి, కథా సంకలనాల గురించి ప్రత్యేకంగా చర్చించిన పెనుగొండ వాటి ప్రయోజనాన్ని గురించి చెబుతూ మంచి రచనలు చదివే అవకాశాలు మంచి రచయితల్ని గుర్తించే అవకాశం సంకలన ద్వారా సాధ్యమవుతుంది. తెలుగులో వేలల్లో సంపుటాలు వస్తే వందల్లోనే సంకలనాలు వచ్చాయి. తెలుగులో సురవరం వారి గోలకొండ కవుల సంచిక నుంచి సంగెవేనీ రవీంద్ర సంపాదకత్వం వహించిన మరో అడుగు వరకు పేర్కొన్నారు. అలాగే తెలుగు కవితలకు వచ్చిన హిందీ అనువాదాలను, ఇంగ్లీష్ అనువాదాలను కూడా ఇందులో పేర్కొన్నారు. ప్రజాతంత్ర లౌకిక శక్తులపై సైదాంతిక దాడి జరుగుతున్న నేపథ్యంలో నూతన సాంస్కృతిక విధానాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇంతటి విలువైన ఈ సాహిత్య వ్యాస సంపుటిని ప్రముఖ విద్యావేత్తలు, సంఘ సేవకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి గారికి అంకితమించారు. పాఠకులకు, సాహిత్య విద్యార్థులకు దీపిక ఒక చక్కని కరదీపిక అని చెప్పవచ్చు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# అంతిమ యుద్ధం ఆదివాసులను అంతం చేస్తుంది



1 జనవరి 2024 నుండి ప్రారంభమైన ఆపరేషన్ కగార్ (అంతిమ యుద్ధం) హత్యా కాండ 3 సెప్టెంబర్ 2024న జరిగిన బైరం గూడ, బస్తర్ ఎన్ కౌంటర్లో 9 మందిని హత్య చేసింది. అందులో వరంగల్ జిల్లా కాజీపేట దగ్గరలో ఉన్న టేకుల గూడ గ్రామానికి చెందిన యేసోబు (రణధీర్)ను కూడా హత్యచేశారు. అతనికి ముగ్గురు ఆడపిల్లలు ఒక మగ పిల్లవాడు ఉన్నారు. సుమారు 35 ఏళ్ళ సుదీర్ఘ విప్లవ జీవితంలో కుటుంబం వైపు చూడకుండా ప్రజల కోసం నిరంతరంగా పోరాడుతున్నవాన్ని ఈ ఎన్ కౌంటర్లో వాత్య చేశారు. అతని అంత్యక్రియలు విన్న టేకులగూడలో వేలాదిమంది ప్రజల మధ్యన చాలా విజయవంతంగా జరిగింది. అతని అంత్యక్రియలకు వెళదామనుకుంటున్న సమయంలోనే బద్రాచలం బార్డర్, కరకగూడంలో మరొక ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో ఆరుగురు మావోయిస్టులు మరణి ంచారు. ఒకవైపు అంత్యక్రియలు జరుగుతుండగానే మరొక ఆరుగురిని అతికిరాతకంగా ఎన్ కౌంటర్ పేరుతో చంపడాన్ని పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తుంది. అధికారం ఉన్నదని ఆయుధా లు ఉన్నాయని చట్టాన్ని గుప్పిట్లో పెట్టుకొని ఎంతటి మారణహోమాన్నైనా సృష్టించగలనని ధైర్యంతో ప్రభుత్వాలు కగార్ హత్యాకాండని కొనసాగిస్తు న్నాయి. ఇటువంటి హత్యాకాండలు ప్రజాస్వామ్యంలో ఎక్కువ కాలం ఉండవు. ఎందుకంటే ప్రజలు ప్రజాస్వామ్య బద్దంగా పరి పాలించబడాలను కుంటు న్నారు. ప్రజాస్వామ్యం నాలుగు కాలాల పాటు ఉండాలనుకుంటు న్నారు. కానీ ప్రభుత్వాలు తాము ప్రజాస్వామికంగా పరిపా లన చేయని స్థితిలో పూర్తిగా సైన్యంపై, పోలీసులపై, మాఫియాలపై, ప్రైవేటు సాయుధ గ్యాంగులపై ఆధారపడి ప్రశ్నిస్తున్నా. పోరాడుతున్న ప్రజలపై కాని ఉద్యమకారులపై కాని తీవ్ర అణచివేతను కొనసాగిస్తున్నది. అది 2005 సాల్వాజుడుంతో ప్రారంభమై నేడు 2024 కగార్ ఇంకా కొనసాగుతుంది. చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభం నుండి ఒక వైపు శాంతి చర్చలు అంటూనే మరొక వైపు ఆదివాసీ లను శవాలుగా మారుస్తూ గుర్తించడానికి వీలుకాని విధంగా చిత్రహింసలతో హత్య చేసిన వైనాన్ని చూస్తూ ఉండగలమా? ఆ శవాలను చూసినవారెవ్వరు అవి మావో యిస్టులవైనా, ఆదివాసీలవైనా అవి ఎన్‌కౌంటర్ విశ్వాసంలోకి తీసుకో లేరు. ఆ శవాలపై పాశవిక చిత్రహింసలు ప్రయోగించబడి ఉంటు న్నాయి. మరణించిన కమి కన్న తల్లి కూడా తన బిడ్డ శవాన్ని గుర్తించలేక పోతే, అదే గ్రామం నుండి డిఆర్ జె పోలీస్‌గా ఉండి అరెస్ట్ చేసిన అతనే ఆ శవం ఆ తల్లి బిడ్డదే అని నిర్ధారణగా చెప్పాడు. తల్లిదండ్రులే గుర్తుపట్టలేని విధంగా మనసులను హింసించి శవాలుగా మార్చిన పోలీసులకే ఆ శవాలెవరివో తెలుస్తున్నాయి. ఎంతటి అమానవీయ స్థితిలోకి ఆదివాసి జీవితాలను నెట్టివేసిందో కదా ప్రభుత్వం... ఆదివాసీలను శవాలుగా మార్చి వారి పోరాటాన్ని నిశ్శబ్దం చేసి సంపదను కార్పొరేట్లకు అందించడమే ఆపరేషన్ కగార్ లక్ష్యం. కార్పొరేట్ల కోసం కాశ్మీర్ జీలం నది, గడ్చిరోలి ఇంద్రావతి. చత్తీస్ఘడ్ శబరి నదులను శవాలతో నింపే ప్రయత్నాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. సామ్రాజ్య వాదుల కార్పొరేట్ల పెట్టుబడుల కోసమే ఆదివాసీ ప్రాంతాలను సాయుధ సరిహద్దు భద్రతా దళాలతో నింపేసి సరిహద్దు సైనిక ప్రాంతాలుగా మార్చేస్తున్నారు.

**ఎన్ కౌంటర్ వివరాలు:**

1) 1 జనవరి 2024, బీజాపూర్ జిల్లా గంగులూరు ముద్దం గ్రామం 6 నెలల పాపను కాల్చి చంపారు. మంగ్లీ సోడి అనే ఆరు నెలల ఆదివాసీ బాలిక గుడిసె పై పోలీసు బలగాలు విచక్షణారహితంగా కాల్పులు జరిపా యి. ఆమె తల్లి ఆమెకు ఆహారం పెడుతోంది. బుల్లెట్లు తగలడంతో పాప మరణించింది. ఆమె తల్లికి తీవ్ర గాయాలయ్యాయి.

2) 7 ఫిబ్రవరి 2024 న గోందోడు గ్రామంలో ఎన్కౌంటర్ ఒకరి మృతి, మావోయిస్టు పార్టీ సీనియర్ కార్యకర్త (జగర్ గుండా ఏసిఎం) చంద్రన్నను గోందోడ్ గ్రామంలో ప్రజల ముందే పట్టుకొని తీవ్ర చిత్రహింసల అనంతరం చెట్టుకు కట్టి కాల్చి చంపి ఎదురు కాల్పులు నాటకమాడారు.

3) 24 ఫిబ్రవరి 2024 సుక్మ జిల్లా బూర్గులంకలో ఎన్కౌంటర్ ఒకరి మృతి, సుకుమ జిల్లా బూర్గులంక గ్రామానికి చెందిన కర్షం భీమా అనే యువకున్ని రాత్రి తన ఇంటి దగ్గర పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురి చేసి చంపేసి, ఉదయం ఎప్పటి లాగే ఎదురు కాల్పుల కథ అల్లారు.

4) 19 మార్చి 2024 కోళ్ళమార్కలో జరిగిన ఎన్కౌంటర్లో నలుగురి హత్య గడ్చిరోలి జిల్లా బరి తాలుకా కోళ్ళమార్క్ అడవిలో మంగు (డివిసిఎం) వర్గీష్ (డివిసిఎం), రాజు (పిఎం), బుద్రామ్ (పిఎం)లను పోలీసులు ప్రాణాలతో పట్టుకొని విషం పెట్టి క్రూరంగా హింసించి ఉదయం 6 గంటలకు కాల్చి చంపి ఎప్పటిలాగే ఎదురుకాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటించి శవాలను కూడా మాయం చేశారని అనుకుంటున్నారు.

5) 27 మార్చి 2024న బీజాపూర్ జిల్లా చీపురుబట్టి ఎన్ కౌంటర్లో ఆరుగు రు మరణించారు, అందులో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు, బీజాపూర్ జిల్లా దీపురుబట్టి గ్రామ సమీపంలో కొందరు నిరాయుధంగా అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఒక ఆదివాసీని బలగాలు అదుపులోకి తీసుకున్న దృశ్యాలు బయటికి వచ్చాయి. ఆ తరువాత ఇతనిని కూడా కాల్చి చంపారు.

6) 2 ఏప్రిల్ 2024 బీజాపూర్ కోర్చిల్ ఎన్ కౌంటర్ 13 మంది. లీజాపూర్ జిల్లా కోర్చిల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులు చుట్టుముట్టి 13 మందిని కాల్చి చంపారు..

7) 16 ఏప్రిల్ 2024 కాంకేరి జిల్లా చోటా బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలో కల్పర్ అపటోలా అడవిలో జరిగిన ఎదురు కాల్పులు జరిగాయి. అందులో 29 మంది మరణించారు. అందులో 15 మంది మహిళలు, 14 మంది పురుషులు మరణించారు. ఈ మరణాలపై ఆ ప్రాంత విప్లవ పార్టీ ప్రతినిధి మంగ్లీ విడుదల చేసిన ప్రకటనలో తెలియజేసిన వివరాలు.. పోలీస్ ఎదురు కాల్పులలో 12 మంది విప్లవకారులు మరణించారు. గాయాలతో దొరికిన ఆరుగురిని పోలీసులు పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. అంతేకాక మరో 11 మందిని వెంటాడ్ పట్టుకొని ఊళ్ళో ఉన్న అమరుల స్తూపం వద్దకు. తీసుకెళ్ళి ఒక్కొక్కరిని కాల్చి దంపారని మీడియాకు విడుదల చేసారు. అయితే ఇక్కడే బతికి ఉన్న వారితోనే మరణించిన వారి శవాలను తమ వాహనాల వరకు మోయించి అక్కడే వారిని చంపి కారుతున్న రక్తంతోనే వాహనంలో తీసుకెళ్తుండే దారంతా నెత్తురు దారిగా మారింది.

దేశాన్ని ప్రేమించడమంటే దేశ ప్రజలను ప్రేమించడమే. కాని దేశ ప్రజలను హత్యలకు గురిచేస్తూ, దేశాన్ని ప్రేమిస్తామంటున్న ద్రోహులు మాటలను ప్రజలు విశ్వసించవచ్చు, రాజ్యాంగ పరిరక్షణే మన భాధ్యతగా ప్రధానంగా 1/70 పేసా చట్టం గ్రామ సభ తీర్మాణాలు ప్రధానంగా అమలయ్యేలా మన ఆచరణ, ఆందోళన, ఉద్యమాలు కొనసాగాలని అవే రేపొద్దున అందరి జీవించే హక్కుకు భద్రత కల్పిస్తుందని విశ్వసిస్తున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ను నిలిపివేయాలని దండకారుణ్య వ్యాప్తంగా 250కి పైగా ఉన్న సాయుధ మిలిట్రీ బలగాల క్యాంపులను ఎత్తివేయాలని రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని పౌరహక్కుల సంఘంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# కోల్ ఇండియా సీఎండీ కోసం అన్వేషణ!







కోల్ ఇండియా లిమిటెడ్ కొత్త ఛైర్మన్, మేనేజింగ్ కోసం అన్వేషణ ప్రారంభమైంది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ ఈ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత సిఐఎల్ చైర్మన్ పిఎం ప్రసాద్ అక్టోబర్ 30న పదవీ విరమణ చేస్తున్నారు. ప్రసాద్ మన పక్కా తెలుగు వాడు! గత తెలంగాణ ప్రభుత్వంలో సీఎంఓగా పని చేసిన ఐఎఎస్ అధికారి, సింగరేణి మాజీ సీఎండీ ఎస్. నర్సింగరావ్ కూడా కోల్ ఇండియా సీఎండీగా పని చేశారు. ప్రస్తుత సీఎండీ ప్రసాద్ నెత్రుత్వంలో కోల్ ఇండియా గ్రోత్ అద్భుతంగా పెరిగింది. సంస్థ మంచి లాభాలను గడిస్తున్నది. నర్సింగరావు హయాంలో కోల్ ఇండియా క్యాష్ రిచ్ కంపనిగా మారింది. సింగరేణిలో సీఎండీ గా పని చేసిన ఐఎఎస్ అధికారి సుతీర్త భట్టచార్య కూడ కోల్ ఇండియా సీఎండీ గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సీఎంకు ప్రధాన సలహాదారుగా ప్రధాన భాధ్యతలు చూస్తున్నారు. కోల్ ఇండియా కొత్త ఛైర్మన్ నవంబర్ 1, 2025న నియమితులవుతారు. కోల్ ఇండియా ఛైర్మన్‌ను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ఎంపిక చేస్తుంది. బోర్డు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఫిబ్రవరి 25, 2025 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చు.





**సామర్థ్యం**

దరఖాస్తుదారు ఒక ప్రముఖ సంస్థ నుండి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్/చార్టర్డ్ అకౌంటెంట్/ కాస్ట్ అకౌంటెంట్/ఎంబీఏ/పిజిడిఐఎం తో పోస్ట్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలి.

**అనుభవం**

దరఖాస్తుదారుడు ఒక ప్రఖ్యాత పెద్ద సంస్థలో ఫైనాన్స్/బిజినెస్ డెవలప్‌మెంట్/ ప్రొడక్షన్/ ఆపరేషన్స్/ మార్కెటింగ్/ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ లో గత 10 సంవత్సరాలలో కనీసం 5 సంవత్స రాల సంచిత అనుభవం/ఎక్స్‌పోజర్ కలిగి ఉండాలి. బొగ్గు, మైనింగ్, విద్యుత్, ఉక్కు, రైల్వేలలో అనుభవం ఉన్నవారికి అదనపు ప్రయోజనం లభిస్తుంది.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు బోర్డులో పూర్తి-కాల ఫంక్షనల్ డైరెక్టర్లతో సహా) సాయుధ దళాలు మరియు కేంద్ర అఖిల భారత సర్వీసులతో సహా కేంద్ర ప్రభుత్వ గ్రూప్ 'ఎ' అధికారులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు/ఆర్థిక సంస్థలు/ స్వయం ప్రతిపత్తి సంస్థలు మొదలైన వాటి అధికారులు. వార్షిక టర్నోవర్ 'రూ. 10,000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ' ఉన్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు

వార్షిక టర్నోవర్ రూ. 10,000 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న ప్రైవేట్ రంగ కంపెనీ. లిస్టెడ్ కంపెనీల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

గతంలో ఈ పదవికోసం సింగరేణి మాజీ సీఎండీ, ఐఎఎస్ అధికారి నడిమెట్ల శ్రీధర్ ప్రయత్నాలు చేశారు.విఫలం అయ్యారు. సింగరేణికి బలరాముడి నాయకత్వం!

సింగరేణికి ప్రస్తుతం నిఖార్సయిన తెలంగాణ బిడ్డ,ఎన్నో అటుపోట్లు ఎదురుకుని నిలబడ్డ, ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరాం సీఎండీగా ఉన్నారు. ఏడాదికాలంగా సీఎండీగా బలరాం ఎన్నో సంస్థలో మార్పులు తెచ్చారు. సీఎండీ అంటే ఇలా ఉండాలి అనే పేరుంది ఆయనకు! బలరాం నాయకత్వంలో సంస్థ లాభాల్లో,బొగ్గు గనుల విస్తరణ, కార్మికుల సంక్షేమ కార్యక్రమా ల విస్తరణ దిశన పయనిస్తున్నది... మన తెలుగోళ్ళ నెత్రుత్వంలో ప్రస్తుతం బొగ్గు సంస్థలు ఉన్నాయి. మరింత వృద్ధి జరిగాలని, ఉపాదికి కోల్ ఇండియా, సింగరేణి కేంద్రాలుగా మారాలని కోరుకుందాము!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# మగ్దుమ్ యాదిలో తెలంగాణ నేల!



***మగ్దుం యాదిలో తెలంగాణ నేల నిరంతరం కనిపిస్తుంది.ఆయన అడుగు జాడలు ఉంటాయి.ప్రధానంగా నల్ల నేల జ్ఞాపకాల్లో మగ్దూమ్ ఇంకా బతికే ఉన్నారు అంటే అతిషయోక్తి కాదు. సింగరేణిలో ఆయన చాలా కాలం ఏఐటీయూసీ బాద్యుడు,యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. నల్ల నేల కవులు కళాకారులు కార్మిక నాయకులు ఆ యనను గుర్తు చేసుకుంటారు.అయన కుమారుడు కూడ ఉద్యోగం చేసేవాడు. సింగరేణి తో అయన అనుబంధం విడరానిది,బొగ్గు బావుల్లో దిగి కార్మికుల సమస్యలను అయన తెలుసు కునే వారు.ఆయన కవితలు ఇక్కడ ఇప్పటికీ పలు కార్యక్రమం లలో వినిపిస్తుంటాయి.***

ప్రముఖ కార్మిక నాయకుడు, ఉర్దూ కవి, హైదరాబాదు సంస్థానం లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకడైన మగ్దూం మొహియు ద్దీన్ తెలంగాణ లోని మెదక్ జిల్లా ఆందోల్లో 1908, ఫిబ్రవరి 4 న జన్మించాడు. ఆయన పూర్తిపేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి (మహ్మద్ మగ్దూం మొహియుద్దీన్ హుద్రీ). వీరి పూర్వీకులు ఉత్తర ప్రదేశ్ లోని ఆజంగఢ్‌లో ఉండేవాడు. ఆయన తాత (తల్లితండ్రి) రషీదుద్దీన్ ఔరంగజేబు సైన్యాలతో పాటు దక్కన్ పీఠభూమికి వచ్చాడు. అలాగే, మరో తాత (తంవూడికి తండ్రి) సయ్యద్ జాఫర్ అలీ కూడా ఉత్తరవూపదేశ్ షాజహానాబాద్ నుండి 1857లోనే దక్షిణానికి వచ్చాడు.

ఆ రకంగా ఆ కుంటుంబమంతా హైద్రాబాద్ దక్కన్ పరిసరాలకు చేరింది. ఆయన తండ్రి గౌస్ మొహియొద్దీన్ నిజాము ప్రభుత్వంలో సూపరింటెండెంటుగా పనిచేసేవాడు. మగ్దూం చిన్నతనంలోనే నాలుగేళ్ళయినా రాకముందే తండ్రి చనిపోయాడు. తల్లి మరో పెళ్ళి చేసుకోవడంతో మగ్దూం తన బాబాయి బషీరుద్దీన్ వద్ద పెరిగాడు. ప్రాథమిక విద్య హైదరాబాదు లోని ధర్మవంత హైస్కూల్లోను, మెట్రిక్యులేషను సంగారెడ్డిలోను చదివాడు. మఖ్దూం తండ్రి పరమ భక్తుడు- మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్. తల్లి- ఉమ్దా బేగం. భర్త మరణానంతరం ఆమె వేరే వివాహం చేసుకుంది. పినతండ్రి బషీరుద్దీన్ పెంచాడు. 1929లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరాడు. పిన తండ్రి కొడుకు నిజాముద్దీన్ మఖ్దూమ్‌ను వెన్నంటి ఉన్నాడు. పినతండ్రి బషీరుద్దీన్ పెంపకంలో మఖ్దూమ్ సూఫీ మత సాంప్రదాయంలో క్రమశిక్షణతో పెరిగాడు.

బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చేసింది. (ఆ పత్రిక సంపాదకుడు అబ్దుల్ ఖాదరీ సర్వరీ తర్వాతి కాలంలో కాశ్మీర్ వెళ్ళిపోయి అక్కడ ఉర్దూ ప్రొఫెసర్‌గా పనిచేశాడు).

ఉస్మానియా యూనివర్సిటీలో మఖ్దూమ్ (1934-37) హాస్టల్‌లో ఉండేవాడు. అక్కడ తన తొలి కవిత 'టూర్' 1934లో రచించాడు. మఖ్దూమ్, కవిగా, నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యా డు. 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హొూష్ కె నా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ రాసి హైద్రాబాద్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించాడు.

గురుదేవులు ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక, నాటక ప్రదర్శన అయిపోగానే స్టేజిపైకి వెళ్ళి మఖ్దూమ్‌ని అభినందించి, తన శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవాల్సిందిగా ఆహ్వానించాడు.

మఖ్దూమ్ 'మర్షదే కామిల్' అనే మరో నాటకం రాశాడు. 1937లో మఖ్దూమ్ తన 29వ యేట ఎం.ఎ. డిగ్రీ తీసుకున్నాడు. 'ఉర్దూ నాటకం'పై ఒక పరిశోధన పత్రం కూడా రాశాడు. హైకోర్టు పక్కన గల సిటీ కాలేజీలో అధ్యాపకుడిగా ఉద్యోగం దొరికింది. కమ్యూనిస్టు రహస్య పత్రిక 'నేషనల్ ఫ్రంట్' సంపాదించి చదివేవాడు.

నాగపూర్ కామ్రేడ్ల సహాయంతో 1930-40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచ రులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వరరావు, గులాం హైదర్, రాజ బహుదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి పనిచేస్తుండేవాడు."రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని!" అనే ఇక్బాల్ కవితను నినదించేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌ల తో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు.

సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్ డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావులతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండేవాడు. చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, అల్విన్, షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ, సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడ య్యాడు. అహెూ రాత్రులు వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడి నా ఆయన వాగ్ధాటికి ఎదురుండేది కాదు. విషయం సూటిగా, స్పష్టంగా, దృఢంగా, బలంగా చెప్పేవాడు. నల్లగొండ జిల్లా హుజూ ర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. శాసనమండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు.

తన జూనియర్, హాస్టల్ మేట్ ఒకతను ఎప్పుడూ పచ్చ శాలువా కప్పుకుని తిరుగుతూ ఉండేవాడు. ఓ రోజు అతని శాలువాను ఎవ రో దొంగిలించాడు. అది తెలిసి అతణ్ణి ఆట పట్టించడానికి మఖ్దూ మ్ 'పిలా దుశాల' అనే పాట రాశాడు. హాస్యోక్తులు చిందిస్తూ, లయబద్ధంగా సాగే ఆ పాట హైద్రాబాద్ విద్యార్థిలోకంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా, మంచి స్నేహితుడిలా ఉండే మఖ్దూమ్ విద్యార్థులందరికీ ఆత్మీయుడిగా ఉండేవాడు. హైద్రాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫూల్‌చంద్ గాంధీ ఆరోగ్యశాఖ మంత్రి. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన మఖ్దూమ్ ఆ శాఖలోని అవకతవకలు ఎత్తి చూపుతూ "ఫూల్ చన్ద్ - కాంటే బహుత్" (పువ్వులు కొంచెం - ముళ్ళేమో ఎక్కువ) అని చలోక్తి విసిరాడు.ఎంతటి గాఢమైన విషయాన్నైనా సున్నితమైన హాస్యాన్ని జోడించి, టూకీగా చెప్పేవాడు.

మఖ్దూం బాల్యమంతా మతవిశ్వాసాలకు అనుగుణంగానూ, కష్టాల కడలిగానూ సాగింది. మజీద్‌ను శుభ్రంచేయడం, నీళ్ళు పట్టడం, క్రమం తప్పకుండా ఐదుసార్లు నమాజు చేయడం. మఖ్దూం ప్రతీ ఉదయం ఒక్కపైసాతో తాందూరీ రొట్టె తిని సాయంత్రంవరకు గడిపేవాడు.

ఈయన చదివే ఉర్దూకవితలను దాశరధి తెలుగులో అనువదిస్తూ గానం చేసేవాడు. బెర్నార్డ్ షా నాటకానికి ఉర్దూ అనువాదాన్ని టాగోర్ సమక్షంలో ప్రదర్శించగా రవీంద్రుడు వేదికపైకివచ్చి మఖ్దూంను అభినందించాడు. సొంత ఇల్లులేని మఖ్దూం మజీదు లోనే జీవించాడు మఖ్దూం "సారా సంసార్ హమారాహై/ పూరబ్, పశ్చిమ్, ఉత్తర్, దక్కన్/ హం అమెరికీం/ హం ఆఫ్రింగీ/ హం చీనీ/ జాం బజాన్ వతన్" అంటూ అంతర్జాతీయ వాదాన్ని ప్రకటించాడు. మఖ్దూం మతాన్నీ, మత విశ్వాసాలనూ గౌరవించాడు. మత దురహంకారాన్ని నిరసించాడు. తన చిన్ననాటి కష్టాలను గుర్తుంచు కొని ఆబాధలు మరెవరికీ రాకూడదనీ, శ్రమజీవుల రాజ్యంతోనే అది సఫలమౌతుందనీ భావించాడు. మఖ్దూం కార్మిక నాయకుడు, శాసన మండలి సభ్యుడు. ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు.

అందరూ కలిసి భోజనం చేసే దస్తర్‌ఖాన్ల గురించి కల గన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేసి అమరుడైనాడు. కమ్యూనిస్టు అయిన మఖ్దూం. మతాన్ని దూషించలేదు అనుసరించలేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం.హైద్రాబాద్ రాష్ట్ర శాసనసభ్యుడు (1952) శాసనమండలి సభ్యుడు, ప్రతిపక్ష నేత (1956-1969), భారత కార్మిక వర్గ విప్లవ చరిత్ర పుటల్లో ఆయన పాత్ర గొప్పది. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. నిజాము కు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా కొంత కాలం ఢిల్లీలో ఉన్నాడు.

1952-55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953-54) పనిచేశాడు. 1969, ఆగష్టు 25 తేదీన గుండెపోటుతో ఢిల్లీలో మరణించినాడు. హైద్రాబాద్ లోని హిమాయత్‌నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ అయన పేరిట నే ఉంది. సింగరేణిలో ఏఐటీయూసీ అనుబందంగా యూనియన్ నిర్మించడం లో మగ్దూమ్ కీలకంగా వ్యవహారించారు. మరో యోధుడు దేవూరి శేషగిరి,రాజ్ బహద్దూర్ గౌర్,తదితరులతో కలిసి ఎర్రజెండా యూనియన్ నిర్మించా రు. మగ్దూమ్ సేవలు చిరస్మరణీయం..



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# ప్రయాణికులకు నిలువ నీడ కరువు..!

- మండుతున్న ఎండలో ప్రయాణికులు ఇబ్బందులు
- సంగారెడ్డి చౌరస్తాలో వందల సంఖ్యలో నిరీక్షణ
- రోడ్లపైనే నిలబడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు







**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఎండధాటికి ప్రయాణికులకు నిలువ నీడ కరవైంది. ఎండాకాలం ప్రారంభంలోనే ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గం టల వరకు ఎండ తీవ్రతతో పెరగడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడి బస్సు ఎక్కాలి. కర్ణాటక, మహారాష్ట్ర లకు సంగారెడ్డి చౌరస్తా (పోతిరెడ్డిపల్లి) నుండి వెళ్లడానికి అధిక సంఖ్యలో బస్సులకోసం వేచి ఉంటారు. అన్ని రాష్ట్రాలకు చెందిన బస్సులను సంగారెడ్డి చౌరస్తాలో నిలుపుతుంటారు. బస్సులు రాకపోతే ప్రయాణి కులు నీడకోసం వెదుక్కోవాల్సి వస్తోంది. చౌరస్తా కావడంతో వ్యాపార సముదాయాలు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు నిల్చడానికి ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతం నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ప్రయాణిస్తుంటారు. వీరికి నిలబడడానికి కూడా నీడ లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఎండలో మగ్గాల్సిందే..

సుదూర ప్రాంతాలకు ఎక్కువగా రాకపోకలు సాగించేవారు. సంగారెడ్డి చౌరస్తా నుంచి ప్రయాణం చేస్తుంటారు. వారికి బస్ సేల్టర్ సరిపోను లేకపోవడంతో ఎండలోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగరీత్యా ప్రయాణికులు ఉదయం ఆరు గంటల నుంచి సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ , పటాన్చెరు, మియాపూర్, కూకట్ పల్లి, హైదరాబాద్ వరకు అలాగే సంగారెడ్డి నుండి సదాశివపేట, బుదేరా, కోహిర్ చౌరస్తా, గద్వాల్, జహీరాబాద్, న్యాల్కల్, రాయి కోడు తదితర మండలాలకు ఉద్యోగరీత్యా వెళుతుంటారు. ఉదయం 6 గంటలకు బస్సు కోసం చౌరస్తాలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఇటు హైదరాబాద్ వెళ్లే వైపు, జహీరాబాద్ వెళ్లేవైపు బస్సు షెల్టర్లు సరిపోను లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రతి గంటలకు కనీసం పది బస్సులైనా ఇక్కడి నుంచి బయలుదేరుతాయి. అదే స్థాయిలో ప్రయాణికులు కూడా ఉంటారు. ఒక్కోసారి వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. అయితే కనీసం షెల్టర్ కూడా లేకపోవడం తో వర్షం పడినా, ఎండలు మండినా ఆరుబయటే వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాఫిక్ నియంత్రించడంలో విఫలం..

సంగారెడ్డి చౌరస్తా నుండి నిత్యం ఉదయం నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు ఉద్యోగరీత్యా, పాఠశాల, కళాశాల వెళుతుంటారు. రోడ్డుపైనే ఆర్టీసీ బస్సులు నిలబడడంతో ప్రయాణికులు కూడా రోడ్డుపైనే నిల్చుని బస్సు కోసం నిరీక్షిస్తారు. ప్రైవేటు వాహనాలైన ఆటోలు, ఇతర వాహనాలు రోడ్డుపైనే నిలబెట్టడంతో ఆర్టీసీ బస్సులు నిలబెట్టడానికి ఇబ్బందిగా మారింది. సంగారెడ్డి చౌరస్తాలో ఆర్టీసీ కి సంబంధించిన వారు, ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ ప్రైవేటు వాహనాలను, ప్రయాణికులను కంట్రోల్ చేయడంలో విఫలమవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రించకుండా ప్రయాణికులుగా నిల్చుంటున్నారే తప్ప ట్రాఫిక్ నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. చౌరస్తాలో జాతీయ రహదారి పక్కనే బస్ స్టాప్, పెట్రోల్ పంపు ఉండడంతో వాహనాలు అటు నుంచి ఇటు నుంచి తిరుగుతూనే ఉంటాయి. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనతో బస్సు కోసం వేచి ఉంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంగారెడ్డి చౌరస్తాలో మినీ బస్టాండ్ కానీ ప్రయాణికులకు సరిపడా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## విద్యార్థులకు నాణ్యత గల విద్యను అందించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ఖిల్లా ఘనపురం, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలోని స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల యందు వంటగదులను భోజనశాలను పరిశీలించారు, నాణ్యత గల భోజనాలను విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెను ప్రకారం అందించాలని పాఠశాల ఉపాధ్యాయుల సిబ్బందికి సూచించారు అనంతరం రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచిస్తూ రాబోవు పదవ తరగతి పరీక్షలో విద్యార్థులకు నాణ్యతగాలా బోధన అందించాలని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తరగతి, హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచాలని కోలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు.కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ సుగుణ,ఎం పి డి ఓ వెంకటాచారీ,మండల విద్యాధికారి జయశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిలాల్,శ్రీనివాసులు,ఎం పి ఓ రాజు కుమార్, కార్యదర్శి రవి తేజ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రవి నాయక్,తిరుపతయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో శ్రీజ ఉత్తమ ప్రతిభ

- సత్తాచాటిన శ్రీవిద్య పాఠశాల




**పాపన్నపేట, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో పాపన్నపేట శ్రీ విద్య పాఠశాల విద్యార్థిని శ్రీజ ప్రథమ ర్యాంక్ సాధించింది.ఆదివారం హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు.కాగా 600 పాఠశాలకు చెందిన 780 మంది విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొన్నారు.స్టార్ జూనియర్ కేటగిరి లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 71 పాఠశాలలు 142 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శ్రీజ మొదటి ర్యాంక్ సాధించింది.జూనియర్ లెవెల్ పరీక్షలో షిజ తనహి,సీనియర్ లెవెల్లో అష్ప, రాష్ట్ర స్థాయి పరీక్షలో పాల్గొని కన్సోలేషన్ బహుమతి సాధించారు.ఈసందర్భంగా శ్రీజను పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా,కరస్పాండెంట్ నిటలాక్షప్ప,సుమన్,ఉపాధ్యాయురాలు స్రవంతి,ప్రియాంక,దుర్గ అభినందించారు.

## రిపబ్లికన్ పార్టీ సభ్యుల నియామకం




**మెదక్ ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఆదివారం మంచిర్యాల జిల్లాలో స్థానిక సార్వాక హాస్పిటల్ పైన హాలులో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఐ) ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు సతీష్ గైక్వాడ్ హాజరు అయ్యారు. ఆయన ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ వారి సిద్ధాంతానికి రాజకీయ వారసత్వానికి వారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రమేష్ చంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కమిటీ, జిల్లా కమిటీ సభ్యుల నియామకం జరిగింది.

## అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

- తల్లి, బిడ్డ క్షేమం
- 108 సిబ్బందికి కృతజ్ఞతలు, తెలిపిన కుటుంబసభ్యులు



**కృష్ణ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** 108 అంబులెన్స్ లోనే మహిళ ప్రసవించిన సంఘటన కృష్ణ మండలం ఆదివారం చోటుచేసుకుంది, గుడేబల్లూరు గ్రామానికి చెందిన వాకిటి తాయమ్మ, తన మూడో కాన్పు ఇంటిదగ్గర, పురిటినొప్పులు ఎక్కువ అవ్వడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు, కృష్ణ 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని వెంటనే సందర్శించి, ప్రథమ చికిత్స చేస్తూ ఆ గర్భిణీ స్త్రీని ఉమ్మడి మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న తరుణంలో మార్గమధ్యలోనే నల్ల గట్టు మారెమ్మ దగ్గర నొప్పులు ఎక్కువ అవ్వడంతో అంబులెన్స్ లో సిబ్బంది ఈఅర్ సిపి వినయ్ వైద్యుల సలహాల ప్రకారం, ఆమెకు ఈఎంటి రాకేష్ సుఖ ప్రసవం చేశారు, అంబులెన్స్ లోనే ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది, తల్లి, శిశువు క్షేమంగా ఉండడంతో అంత ఊపిరి.. పీల్చుకున్నారు, అనంతరం వారిని మాగనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఆస్పత్రి వైద్యులు పరిశీలించి తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు, సమయస్ఫూర్తితో అత్యవసర సమయంలో స్పందించిన 108 సిబ్బంది, ఈఅర్, సిపి వినయ్ వైద్యులు, (టెక్నీషియన్) ఈఎంటి రాకేష్, పైలెట్ అనిల్, ఆస్పత్రి వైద్య సిబ్బందిలకు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు.

## ఉగాది వరకు రెండు పడక గదుల ఇళ్లను పనులను పూర్తి చేయండి

- కలెక్టర్ ఆదర్శ సురభీ



**ఖిల్లా ఘనపురం, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని సొల్కెలాపూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రెండుపడకల గదుల ఇళ్లను ఉగాది కల్ల పూర్తి చెయ్యాలని శనివారం సంబంధిత అధికారులను ఆదేశించారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో గ్రామానికి 24 రెండు పడకల గదుల గృహాలు మంజూరు అయ్యాయి. కాంట్రాక్టర్ పిల్లర్స్ స్లాబ్ వరకు పని చేశారు బిల్స్ పెండింగ్ ఉండటం వల్ల పూర్తి కాలేదని అధికారులు కలెక్టర్ వివరించారు ,స్పందించిన కలెక్టర్ పెండింగ్ బిల్స్ ఇస్తామని ఉగాది వరకు రెండు పడకల గదుల ఇళ్లను ప్రారంభానికి సిద్ధాం చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి,తహశీల్దార్ సుగుణ,ఏ ఈ రామాష్ నాయుడు, ఎంపిడిఓ,వెంకట చారీ, రవి నాయక్,మండల విద్యాది కారి జయశంకర్,రాజు,ఆర్, ఐ,తిరుపతయ్య,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి గోల్డ్ మోడల్ సాధించిన చేర్యాల విద్యార్థులు



**చేర్యాల, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** జాతీయస్థాయి హ్యాండ్ బాల్ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, గోల్డ్ మెడల్ అందుకున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి పాశికంటి హేమచంద్ర, ప్రజెంటేషన్ హై స్కూల్ విద్యార్థిని చుంచు ప్రీతి లను ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఏ, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించి, వారికి నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగం రెడ్డి, చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి, చేర్యాల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ప్రస్తుత సిద్దిపేట జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రెటరీ రఫత్ ఉమార్, ట్రెజరర్ రాజు గౌడ్, కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్త్యాల యాదగిరి, సుదర్శన్ రెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు స్వామి, బిక్షపతి పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- లక్ష డప్పులు, వేయి గొంతుకలు గోడపత్రిక ఆవిష్కరణ



**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతుకలు ప్రదర్శన,ర్యాలీకి,ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి మాదిగ,మాదిగ ఉపకులాలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ,ఎంఎస్పి నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ లు పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి7న నిర్వహించనున్న లక్ష డప్పులు వేల గొంతుకలు ప్రదర్శన, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఉమ్మడి నల్గొండ జిల్లాలలో ప్రతి గ్రామము నుండి పెద్ద యెత్తున మాదిగ జాతి తరలి రావాలన్నారు.మాదిగల గుండె చప్పుడే ఫిబ్రవరి7 హైదరాబాద్లో "వేల గొంతులు-లక్ష డప్పుల"సంస్కృతిక మహా ప్రదర్శన,ఎస్సి వర్గీకరణ అమలు కోసం ప్రతి వ్యక్తి డప్పుతో వచ్చి రాజధాని గడ్డ మీద రణభేరిని మోగించాలని పిలుపునిచ్చారు. ఎస్సి వర్గీకరణ ద్వారానే మాదిగ, మాదిగ ఉప కులాలకు భవిష్యత్తు, ఇప్పటికే నష్టపోయాం..ఇంకా ఆలస్యం చెసుదు మానీ సుప్రీం తీర్పుకు అనుగుణంగా,అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే ఎస్సి వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేసారు.కొంత మంది స్వార్థపరులైన మాలల ఒత్తిడికి తలొగ్గే రేవంత్ ప్రభుత్వం మాదిగ,మాదిగ ఉప కులాలకు అన్యాయం చేస్తుందని,కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన అన్నారు.ఈ కార్యక్రమలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ,ఎం.జె.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ మాదిగ,ఎం.ఇ.ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లెపాక వెంకన్న మాదిగ,రాష్ట్ర నాయకులు లంకపల్లి నగేష్ మాదిగ,బొజ్జ దేవయ్య,మచ్చ ఏడుకొండలు,మేడి శంకర్,మాచర్ల సుదర్శన్, బొజ్జ చిన్న,కందుల మోహన్,శంబయ్య మధు,రమణ భార్గవ్,గట్టు మల్లయ్య, తరి ఏడుకొండలు, విహెచ్పిఎస్ నాయకులు కొత్త వెంకన్న,పెరిక శ్రీనివాసులు, జలంధర్,జిల్లా తిరుమలేష్, నరేష్,మాసారం వెంకన్న,నాగరాజు,దుబ్బ సత్యనారాయణ, ఎర్రసాని గోపాల్, రమేష్,ఊదరి నవీన్, ఏసు,చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ రంగంలో రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా క్రికెట్ రంగంలో ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్రం, దేశ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో షేర్ అలీ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో ప్రతిరోజూ శిక్షణ తీసుకోవాలని సూచించారు. గద్వాల జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు షేర్ అలీ ప్రీమియర్ లీగ్ పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. ఫిబ్రవరి 2 నుండి 9 వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పోటీ పడుతున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు శాంతి ప్రతీకలైన పావురాలను ఆకాశంలోకి వదిలి, స్వయంగా బ్యాటింగ్ చేసి తొలి బంతి ఆడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, జిల్లా యువజన, క్రీడల అధికారి జితేందర్, న్యాయవాది భీమ్సేన్ రావు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి



**మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో మాజీ ఐఏఎస్ కీ.శే మారేపల్లి రంగారెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు మారేపల్లి చంద్రశేఖర్ రెడ్డి కోడలు డాక్టర్ మారేపల్లి మనోరమ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గతవారం రోజులుగా నిర్వహిస్తున్న ఉచితకంటివైద్య శిబిరంలో ఆదివారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. గ్రామానికి చెందిన సుమారుగా 150 మందికి కంటిపరీక్షలు నిర్వహించడం కోసం గ్రామంలో పెద్ద అంబులెన్స్, బస్సును ఏర్పాటు చేసి కంటి స్క్రీనింగ్, కంటి క్యాటాక్ ఆపరేషన్ చేసి, సుమారు 100 మందిని చెన్నై ఆసుపత్రికి తరలించారు. కన్నెకల్ నుంచి చెన్నై వెళ్లేందుకు అవసరమైన రవాణా ఖర్చులను ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి అందించారు.ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి-మనోరమ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతమైన కన్నెకల్ లో మెగాకంటి వైద్య శిబిరంనిర్వహించడం అభినందనీయం అన్నారు. వీరి స్ఫూర్తితో గ్రామంలో మరేన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సామాజిక దృక్పథంతో గ్రామాలలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కొండేటిమల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఐటి సెల్ కార్యదర్శి మల్లే లింగారెడ్డి, చింతరెడ్డి భాస్కర్ రెడ్డి, తాజామాజీ ఎంపీటీసీ కొత్త దశరథ,నాయకులు సైదిరెడ్డి,బోడయాదయ్య, గనిపల్లి మోహన్, సాయిలు, కొండేటి శంకర్, మారపల్లి.లక్ష్మి, కార్తీక్ తోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ కాపాడాలి



- **పర్యావరణ ప్రేమికుడు అవిరేండ్ల సందీప్ కుమార్**

**మిర్యాలగూడ. ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కాల్వపల్లి గ్రామనికి చెందిన ఇస్లావత్ కిషన్ నాయక్, నర్సరీ ఏర్పాటు చేసుకున్నాడు. 3 లక్షల విత్తనాలు సేకరణ కార్యక్రమం తెలుసుకొని వారికి విత్తనాలు కావాలని తెలియచేయగానే మేము స్వచ్ఛందంగా వెళ్లి,చింతా,పొగడ, ఉసిరి,సీతాఫలం విత్తనాలు సుమారు 5000 వేల విత్తనాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు అవిరేండ్ల. సందీప్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కాపాడాలని, ప్రతి ఒక్కరు ఇంటి సమీపంలో ఒక మొక్కను నాటాలని, వచ్చే వేసవిలో, స్లాబ్ ఇల్లు ఉన్నవాళ్లు, మిద్దె తోటలు, మొక్కల ను పెంచాలని అలాగే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఇస్లావత్ కిషన్ నాయక్ తన రెండు చేతులు లేనప్పటికీ, నర్సరీ ఏర్పాటు చేసుకోవడం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని, గత నాలుగు సంవత్సరాల నుంచి కూడా అతనికి పెన్షన్ రావడం లేదని ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ రూహిద్,కనక. శ్రీను, కందికంటి రాజశేఖర్, దైద పవన్, ఉబ్బపల్లి పవన్,కనక శ్రీను, ఇస్లావత్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- **కేంద్ర బడ్జెట్ ను ప్రశ్నించిన ఎమ్మెల్యే వీర్లపల్లి**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కేంద్ర బడ్జెట్ 2025-26లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందనీ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయని తాగునీటి సాగునీటి ప్రాజెక్టుల ఊసే లేదనీ పెట్రోల్ సుంఖలను పెంచేలా బడ్జెట్ ఉందనీ షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా కేంద్రంపై విమర్శలు గుప్పించరు నిరు పేదల వద్ద అత్యధికంగా వసూలు చేసిన జీఎస్టీ బిల్లును దోచి కార్పొరేట్ శక్తులకు అప్పచెప్తున్నారని నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించేలా బడ్జెట్ లేదని ధరలు నియంత్రించే విధంగా లేదని ధనవంతులు తీసుకున్న లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నారని ద్రవ్యోల్బనం పెరుగుతున్న తరుణంలో పేదలపై పన్నులు వేయడం సరైంది కాదనీ సామాజిక అంశంపై బడ్జెట్ కుదించారనీ పారిశ్రామిక రంగానికి బడ్జెట్ చాలా వరకు తగ్గించారు ఇది పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంది బడ్జెట్ లో తెలంగాణ పేరు ఎక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించలేదు కొత్త కార్యక్రమాల పథకాలకు విద్యాసంస్థలకు నిధులు కేటాయించలేదు ముఖ్యమంత్రి చేసిన వినతులను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని కొత్తగా ప్రతిపాదించిన వాటికి నిధులు ఇవ్వాలని కేంద్రాని కోరింది ఇందులో మెట్రో రెండోదశకు నిధులు కేటాయింపు ప్రధానమైనది మెట్రో నిధుల విషయంలో కేంద్రంపై రాష్ట్రం ఎన్నో ఆశలు పెట్టుకుంది ఈ నిధుల ద్వారా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది దీనిలో భాగంగా ప్రైవేట్ సంస్థలు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మెట్రో రెండో దశను చేపట్టాలని సీఎం ఆలోచన చేశారు ఈ మేరకు ప్రధానికి వినతి పత్రం కూడా అందజేశారు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ కు వినతిపత్రం సమర్పించారు డిపిఆర్‌ను రూపొందించి కేంద్రానికి పంపించారు కానీ ఆశించిన ఫలితం మాత్రం రాలేదు బడ్జెట్‌లో కేటాయించకుండా నిధులు విడుదల చేయడం అనేది కష్టతరమైన విషయమని నిపుణులు చెబుతున్న పరిస్థితుల్లో కూడా పన్నుల వాటాలో పెంపు లేదు విభజన చట్టం హామి మేరకు బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉన్నది కానీ దీనిపై ఎలాంటి కదలిక లేదు దీంతో పాటు పిఎం ఆవాజ్ యోజన ఇళ్లలో రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం కేంద్రాన్ని కోరారు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు కేటాయించాలని కోరారు నగరపాలక సంస్థలు ఇతర మున్సిపాలిటీలు అభివృద్ధికి పునర్జీవనానికి స్కిల్ యూనివర్సిటీ ట్రైబల్ యూనివర్సిటీ దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఐఐఎం ఏర్పాటు సైనిక్ స్కూల్ నవోదయ విద్యాలయాలు



ఇలా కేంద్రాన్ని తెలంగాణ అడిగిన కనీసం స్పందించలేదు పన్నుల వాటా కేటాయింపులు పెంచలేదు జాతీయ రహదారులు, రైల్వేలైన్ లు నూతన పారిశ్రామిక కారిడార్ లు డ్రై పోర్టు కు నిధులపై నీటి ప్రాజెక్టుల ప్రస్తావన రాలేదనీ అన్నారు ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ బోర్డు సభ్యులు మన్నె జీవన్ రెడ్డి షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ రఘు చెందితిరుపతి రెడ్డి ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి బాల్ రాజ్ గౌడ్ చంద్ర శేఖర్ కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రత

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** చెరువుగట్టు పార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలియజేశారు.ఈ నెల 9 వరకు జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల ఇబ్బందులు కలగకుండా 5 గురు డీఎస్పీలు,25 మంది సిఐలు,93 మంది యస్.ఐలు186 మహిళా సిబ్బందితో కలిపి మొత్తం 900 మందితో పటిష్ఠ భద్రతా పరమైన ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు గుట్ట పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ రెగ్యులరైజేషన్ చేస్తూ ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని,అలాగే వాహనదారులు రోడ్డు పక్కన వాహనాలు ఆపి భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని, వాహనదారులకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలకు మాత్రమే పార్క్ చేసుకోవాలని కోరారు.స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల కొరకు క్యూ లైన్ లో వెళ్ళుటకు బారికెట్లు ఏర్పాట్లు చేసి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ గాని డయల్ 100 కి సమాచారం అందించాలని అన్నారు.




## కార్మికులకు అండగా ఎర్రజెండా




**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కార్మికుల హక్కులకోసం పోరాడుతూ నిత్యం కార్మికులకు అండగా ఉండే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి అన్నారు.ఆదివారం నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల విస్తృతస్తాయి సమావేశంలో మాట్లాడితుతూ.. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రకటించిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి దక్కింది గుండు సున్నా అని తెలంగాణ రాష్ట్రం నుండి బిజెపి ప్రభుత్వంలో ఇద్దరు మంత్రులు, 8 మంది ఎంపీలు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి వీరారెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ,సి.ఐ.టి.యు జిల్లా నాయకులు బషీర్,నాగార్జున(చిరు) మరియు కార్యకర్తలు, నందికొండ మున్సిపాలిటీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

- **చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్**

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** రాష్ట్రంలో 40లక్షల మంది జనాభా ఉన్న పద్మశాలిలకు ప్రభుత్వ పథకాలు అందించి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలంగాణ చేనేత ఐక్య వేదిక ఏర్పడిందని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో ఏర్పాటు చేసిన చేనేత ఐక్య వేదిక సూర్యాపేట జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో చేనేత ఆనవాళ్ళు లేకుండా పోతున్నాయని, నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. నేతన్నలకు భీమా, చేనేతకు చేయూతను అందరికి అందించాలని జియో ట్యాగింగ్ విధానాన్ని ఎత్తి వేయాలన్నారు.చేనేత వృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని అన్నారు.ఐక్యంగా ఉండి మన హక్కులను సాధించుకొని చేనేతల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు.అన్ని పోటీల్లో పాల్గొంటూ మనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకొని కులపరంగా, వృత్తి పరంగా ఎదుర్కోనే ప్రతి సమస్యపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.అనంతరం చేనేత ఐక్య వేదిక



సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చిలువేరు నరసింహరావు, ప్రదాన కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా యెల్లె లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులుగా జిల్లా సూర్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా ముశం రమేష్ తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు, మట్టపల్లి అన్నదానసత్రం అధ్యక్షులు చిన్నం వీరమల్లు, గుర్రం మార్కొండేయ, కడారి భిక్షం, మేడం రామకృష్ణ, పోచం సునీత, గుజ్జ తార, చెన్నూరి విజయలక్ష్మి, బెల్ల రఘు, రాపోలు వెంకటేశ్వర్లు, కొంగర నారాయణ, రావిరాల శ్రీనివాస్, చిలువేరు భిక్షం, జిల్లా లక్ష్మీనారాయణ, చిలువేరు అంజయ్య, సంగిశెట్టి గోపాల్, వనం వసంత, చలమల్ల నర్సింహ్మా, వేణు తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో



ఉన్నందున నేడు కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి విషయాన్ని ప్రజలందరూ గమనించి రావద్దని తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి బలం

**మాడ్గులపల్లి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తూ పార్టీ బలోపేతానికి అంకుటిత దీక్షతో పనిచేస్తున్న కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలంబలగంఅని కార్యకర్తలప్రయోజనాలను పరిరక్షించేందుకు కుందూరు జానారెడ్డి కుటుంబం చిత్తశుద్ధితో పనిచేస్తుందని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండలం ధర్మపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు.ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ శాసన మండలిస్టానంతోపాటుత్వరలోజరుగనున్న స్థానికసంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలుఐక్యంగా కలిసిమెలిసి కష్టపడి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలను గుర్తించి సర్పంచ్, ఎంపిటిసి, లుగా పోటీచేసేందుకు కలిసి కట్టుగా నిర్ణయం తీసుకోని నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికబద్దంగా



ముందుకుసాగాలనిఆయనకార్యకర్తలకుదిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి ,పిసిసికార్యదర్శి కొండేటి మల్లన్న జిల్లాఐటీ సెల్ కార్యదర్శి మల్లె లింగారెడ్డి , ధర్మపురం గ్రామశాఖ అధ్యక్షుడు గద్దల శేఖర్ , స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ కొత్త దశరథ , నాయకులు భాస్కర్ రెడ్డి ,చింతరెడ్డి సైదిరెడ్డి, వెంకట్ రెడ్డి,కొండేటి శంకర్, పగిళ్ల వెంకన్న , మారే పల్లిలక్ష్మి,కటకంచెన్నయ్య,లక్ష్మారెడ్డి సాయిలు,బిక్షంరెడ్డి ,యాదగిరి రెడ్డి, మోహన్,లింగారెడ్డి, నర్సిరెడ్డి, చిలకమర్రి నాగాచారి, సత్తిరెడ్డి, జాన్ రెడ్డి, సైదులు కార్తీక్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలి

- **కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలోని రామాయంపేట సి.హెచ్ .సీ, ను కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని మందులు అందించే గది, రక్త పరీక్షల చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూం ను, పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని,, ఆసుపత్రిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. , ఔషధ నిల్వలు స్టాక్ పెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు శుచికరమైన బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

- **రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు**

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటన చేస్తున్నారే తప్ప ఆచరణలో శూన్యమన్నారు. వ్యవసాయానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఈ బడ్జెట్లో తేలిపోయింది అన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్లో 10000 కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి తగ్గించారని ఎరువుల సబ్సిడీలో కూడా 11 వేల కోట్లు తగ్గించారని ఆరోపించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవడం విషయంలో బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. రైతన్నలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు సబ్సిడీలు ఇస్తూ అన్నదాతలను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. బడ్జెట్లో 25% వడ్డీ చెల్లింపుకే సరిపోతుందని ఆరోపించారు. రైతుల బ్యాంకు అప్పులను మాఫీ చేయడంలో శ్రద్ధ చూపని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల బ్యాంకు అప్పులను ఎగ్గొట్టేందుకు అవకాశం కల్పించే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. సన్న చిన్న మధ్యతరగతి రైతులకు ఉపయోగపడే విధంగా యాంత్రికరణలో సబ్సిడీలు అందించే విధంగా బడ్జెట్ లో నిధులు కేటాయించి వ్యవసాయం రంగాన్ని



# బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- **నామినేటెడ్ పదవులలో బీసీలకు తీవ్ర అన్యాయం**
- **సింగిల్ విండో ఎన్నికల్లోనూ రిజర్వేషన్లలో కల్పించాలి**
- **బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

**దేవరకొండ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో బీసీ పొలిటికల్ జెఎసి యువజన విభాగం ఆధ్వర్యంలో క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి రాచాల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగణన చేపట్టిందని, దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇచ్చిన మాట ప్రకారం 42




శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటదని ఆశిస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో కూడా బీసీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఈ విషయంపై బీసీ ఎమ్మెల్యేలు కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. త్వరలో భర్తీ చేయనున్న ప్రభుత్వ పదవులలోనైనా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వాలు అధ్యక్షులకు మాత్రం కల్పించలేదని, దీంతో రాష్ట్రమంతటా ఒకే సామాజిక వర్గం వారు ఆధిపత్యం చెలాయిస్తూ ఎస్సీ,ఎస్టి, బీసీలను రాజకీయంగా అణచివేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో నైనా సింగిల్ విండో ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగడంతో పాటు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.బీసీలను ఐక్యం చేసేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి మల్లేష్, నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కొండ సాయిరాం కురుమ, బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సత్యం, నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టపల్లి అనిల్, దేవరకొండ మండల అధ్యక్షులు పోతురాజు ధనరాజ్ యాదవ్, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కలగోని రమేష్, చింతపల్లి మండల అధ్యక్షులు గజ్జ నాగరాజ గౌడ్, చందంపేట మండల అధ్యక్షులు జిల్లా శివప్రసాద్, నేరేడుగొమ్ము అధ్యక్షుడు హరీష్ యాదవ్, శ్రీరాములు, సిద్దు, మహేష్, ఆంజనేయులు, శివ పాల్గొన్నారు.

## తుంకీమెట్ల నుండి నాందార్‌పూర్‌కు బీటీ రోడ్డు



- **జనంసాక్షి కథనానికి స్పందన**

**బొంరాస్‌పేట, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** మండల పరిధిలోని హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి తుంకిమెట్ల గ్రామం నుండి నాందార్ పూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డుపై దుమ్ము ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గత నెల 13న జనం సాక్షి కథనాన్ని ప్రచురించింది.స్పందించిన సదరు కాంట్రాక్టర్ ,అధికారులు ఎట్టకేలకు బీటి రోడ్డు పనులను ప్రారంభించారు.దుద్యాల మండల పరిధిలోని హకీంపేట గ్రామం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరించనుంది.రెండు రోజుల్లో నాందర్పూర్ వరకు బీటీ రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. మరోవైపు మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి నుండి కొత్తూరు గ్రామం వరకు రెండు వరుసల రహదారి పనులు పూర్తయ్యాయి.సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్ పేట మండలంలో గ్రామీణ రహదారుల బీటీ రోడ్లుగా మారేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పూర్తయ్యాయి. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి నుండి మండల కేంద్రానికి ఇప్పటికే ఉన్న రెండు వరుసల రహదారి నాలుగు వరుసల రహదారిగా మారనుంది.

# కేంద్రం విధానాలతో వ్యవసాయరంగం కుదేలు

### ఆహార సబ్సిడీ తగ్గింపుతో పేదలపై భారం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి02 (జనంసాక్షి)**

:కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై కక్ష గట్టిందని అందుకే బడ్జెట్ లో క్రమంగా వ్యవసాయ రంగంపై కోతలు విధిస్తున్నారని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు ఆదివారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై పలు అంశాలు ప్రస్తావించారు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల దేశవ్యాప్తంగా వ్యవసాయం కుదేలు కావడం ఖాయమని దుయ్యబట్టారు.

గతేడాది బడ్జెట్ లో ఫర్టిలైజర్ రివైజ్డ్ ఎస్టిమేట్ రూ.1,71,299 కోట్లు ఉంటే, ఈ ఏడాది బడ్జెట్ ఎస్టిమేట్ రూ.1,67,887 కోట్లు మాత్రమే ఉందని, ఎరువులపై 3,412 కోట్ల సబ్సిడీని తగ్గించారని,ఇది వ్యవసాయ రంగం, రైతుల మీద తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. 2023-24 బడ్జెట్ రూ.2,11,814 కోట్లు ఉంటే, గత బడ్జెట్ లో రూ.2,05,250 కోట్లకు ,ఇప్పుడు దాన్ని 2,03,420 కోట్లకు తగ్గించారని విమర్శించారు.అంటే ప్రతి సంవత్సరం ఆహార సబ్సిడీని తగ్గిస్తూ పోవడమే కేంద్రం పనిగా పెట్టుకున్నదని, దీని ప్రభావం పేద ప్రజల జీవితాల మీద తీవ్ర ప్రభావం చూపుతుం దని ఎద్దేవా చేశారు.2025 - 26 బడ్జెట్లో కేంద్రం రాజకీయ అవసరాలనే ఉపయోగిం చుకున్నది తప్ప దేశ సమ్మిళిత అభివృద్ధి మీద దృష్టి సారించలేదని,ఇలాంటి బడ్జెట్ తో కేంద్రం పదే పదే చెప్పే వికసిత్ భారత్ సాధ్యం అవుతుందఎలా సాధ్యం అవుతుందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.దేశమంటే మట్టి కాదోయ్,దేశమంటే మనుషులోయ్ అన్న నిర్మలా సీతారామన్ దేశమంటే కొన్ని రాష్ట్రాలు మాత్రమే అన్నట్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరం అన్నారు. 2025 ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారని,2026 యూపీ, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడతారా అంటూ ప్రశ్నించారు.బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేక పోవడాన్ని చూస్తే,ఇద్దరు కేంద్రమంత్రులు సహా 8 మంది ఎంపీలు ఉండి ఏం ప్రయోజనం లేదన్నారు.కేంద్ర జీడీపీకి 5.1 శాతం కంట్రిబ్యూషన్ ఇస్తున్న తెలంగాణ మరోసారి మోసపోయిందని, నిధులు రాబట్టడం లో రేవంత్ సర్కార్ విఫలమైందని, 40 వేల కోట్లు కావాలని తూతూ మంత్రంగా లేఖలు రాసి చేతులు దులుపుకున్నారని దెప్పి పొడిచారు.

ఏడాదిలో 30 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి ఏం సాధించారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు మొత్తం 16 మంది 8 రూపాయలు తేలేకపోవడం వారి అసమర్థతకు నిదర్శనం అన్నారు.తెలంగాణ ప్రయోజనాలు కాపాడటంలో కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాన్ని ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినపుడు కర్రు కాల్చి వాత పెడుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.



# జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



**వనపర్తి క్రైమ్ ఫిబ్రవరి02( జనంసాక్షి)**

### వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

### అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగసభలు నిషేధం

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల, ఫిబ్రవరి 01 నుండి 28 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు,సమావేశాలు,ఊరేగింపులు, ధర్నాలు,ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు.

**నూతన చట్టాల ద్వారా సత్వర న్యాయం**

తెలంగాణ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వజర్ ఈపూరి రాములు చే పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా అమలు లోకీ వచ్చిన నూతన చట్టాల అమలులో వనపర్తి జిల్లా పోలీసుశాఖ సమర్ధవంతంగా నూతన చట్టాలను అమలు పరచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నూతన నేరన్యాయ చట్టాలు2023 ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వచ్చాయని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం నూతన చట్టాలలో కల్పించబడిందని అన్నారు. అనంతరం తెలంగాణ పోలీస్ లీగల్ అడ్వైసర్ ఈపూరి రాములు కొత్త చట్టాలలో వచ్చిన మార్పులను అధికారులకు,సిబ్బందికి వివరించడంతో పాటు వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, బిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వ రరావు, వనపర్తి సీఐ, కృష్ణ, కొత్తకోట సిఐ, రాంబాబు ఆత్మకూరు సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు, స్టేషన్ రైటర్ లు , రైటర్స్ లు, కోర్టు డ్యూటీ అధికారులు, రిసెప్షన్ సిబ్బంది మరియు పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పదవీ విరమణ వయసు పెంచితే లాభమెవరికి ?

### పదవీ విరమణ వయసు పెంపు పట్ల భగ్గుమంటున్న యువత

**వనపర్తి, ఫిబ్రవరి 01 (జనంసాక్షి)**



: ప్రభుత్వాలు మారితే తమ తలరాతలు మారుతాయన్న ఆశలు భ్రమలుగానే మిగిలాయన్న చర్చ అన్నివర్గాల ప్రజల్లో ప్రారంభమైంది. పదేళ్ళ పాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ ప్రభుత్వం తగినన్ని ఉద్యోగాలివ్వలేదన్న ఆగ్రహంతో గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి అధికారంలోకి రావడానికి దోహదపడితే ఉద్యోగుల వయస్సు పెంచడానికి సర్కార్ కసరత్తు చేస్తున్నదని నిరుద్యోగులు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. పాలకులు చేస్తున్న నిరుద్యోగ వ్యతిరేక నిర్ణయాలు తమకు ఓ వైపు రోకలి పోటు,మరో వైపు రోలు పోటులా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆర్థిక ఇబ్బందులను అధిగమించడం కోసమే రిటైర్డు కావలసిన ఉద్యోగుల వయసును పెంచుతున్నారని అంటున్నారు. అదే కనుక జరిగితే తాము ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమైనట్లేనని నిరుద్యోగులు అసహనం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చెప్పినటువంటి మాటలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే, గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ల మేరకు ఎంపికైన వారికి ఉద్యోగ నియాయక పత్రాలనిచ్చి మేమే ఇచ్చామని చెప్పుకోవడం తప్ప నిజంగా రేవంత్ రెడ్డి సర్కార్ చేసిందేమి లేదని నిరుద్యోగులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

**శాఖల వారీగా ఖాళీల లెక్కలే తేల్చడంలే..**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి14 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ, ఉద్యోగాలను భర్తీ చేసే దిశగా అడుగులు పడడం లేదు. కొత్త ఉద్యోగాల మాటేమో గాని ప్రస్తుతం పని చేస్తూ రిటైర్ అయిన ఉద్యోగుల వివరాలను వారీగా శాఖల పబ్లిక్ డొమైన్ లో పెట్టకపోవడం ప్రభుత్వ చిత్తశుద్దిని శంకింప జేస్తున్నదన్న విమర్శలు సర్వత్రా కొనసాగు తున్నాయి.నెల నెలా ఏర్పడుతున్న ఖాళీల విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వము తెలపడం లేదని, ఎటువంటి నోటిఫికేషన్లు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే ఉద్యోగం వస్తే తప్ప మా బతుకులు బాగుపడవని గమనించినటువంటి యువత ఉద్యోగం కోసం కొన్ని ఏళ్ల నుండి కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశ నెరవేరడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వము అత్యధిక నోటిఫికేషన్లు జారీ చేసి,,ఎక్కువ మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారిపై ఆధారపడిన కుటుంబాల సభ్యులు కోరుతున్నారు. .

**వయసు పెంచితే నిరుద్యోగుల పొట్టగొట్టినట్లే**

ఉద్యోగాల నుంచి విరమణ తీసుకుంటే వారికి సమకూర్చాల్సిన ఆర్థిక వెసులుబాటుకు కోట్లాది రూపాయలను చెల్లించే స్తోమత లేనందుకే ప్రభుత్వం పదవీ విరమణ వయసును పెంచడానికి సిద్ధమైందని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 63 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదు.దీని వల్ల ప్రభుత్వానికి తీరని నష్టం వాటిల్లె ప్రమాదం వుంది.ఉద్యోగ విరమణ వయసును పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినట్టడమే. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ,ఎన్ని డిమాండ్లు వచ్చినప్పటికీ ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.గత ప్రభుత్వం చేసిన తప్పును ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నిరుద్యోగులే కీలకపాత్ర పోషించారు.జాబ్ క్యాలెండర్ కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఇప్పటికే ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించకపోతే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఏకమై మరొక ఉద్యమానికి సిద్ధపడుతున్నారు.

**వయసు పెంపు ఎవరికి లాభం ?**

వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 58 ఏళ్లుగా ఉండేది. కానీ, కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు 60 ఏళ్లకు,ఏపీ, తెలంగాణలోనూ 62 ఏళ్లకు పెంచారు. దీనిపై తీవ్ర విమర్శలు కూడా వస్తున్నాయి.నిరుద్యోగులకు అన్యాయం చేయడమేమిటని నని మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలు,టి ఎ లు,పిఆర్సి వంటివి ఇవ్వనవసరం లేకుండా వయస్సు పెంచడం ద్వారా వీటన్నింటి ద్వారా లబ్ధి పొందవచ్చని ప్రభుత్వం యోచిస్తుంది.గత ప్రభుత్వం ఉద్యోగుల పదవి విరమణ వయస్సు 58 నుంచి 61 ఎండ్లకు పెంచడం ద్వారానే అనేకమంది నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు వచ్చే అవకాశాలు ఆగిపోయాయి. వయసు రిత్యా ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని ఉద్యోగులే చెబుతున్నటువంటి పరిస్థితి. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వవలసిన వివిధ చెల్లింపుల భారం తగ్గించుకోవడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వెంటనే ఇప్పటికే రిటైర్డ్ అయినటువంటి వారికి చెల్లించాల్సినటువంటి వాటిని చెల్లించాలని కోరుతున్నారు. రిటైర్డ్ అయినటువంటి ఉద్యోగులకు వచ్చేటువంటి పెన్షన్ కూడా సరైన సమయానికి అందడం లేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దళిత రైతులను టార్గెట్ చేసి సర్వే పునరాలోచన చేయాలి



### కల్వకుర్తి నంద్యాల జాతీయ రహదారి తాడూరు బైపాస్ 167కె డిజైన్ మార్చాలి

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 2(జనంసాక్షి):**

శనివారం జరిగిన తాడూరు మండల కేంద్రం కేంద్రంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న పరామర్శించిన మాల మహానాడు బాధితులకు అండగా ఉంటామని ప్రభుత్వం భూసేకరణ రైతులను ఒప్పించే చేయాలి కానీ రైతులకు ఎలాంటి ఇన్ఫర్మేషన్ లేకుండా భూముల పైకి వెళ్లి భయభ్రాంతుల గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే అంతవరకు అధికారులు తీసుకురావద్దని వారికి ఏమన్న జరిగితే వారి కుటుంబాలకు బాధ్యత ఎవరు వహిస్తారని. నిరుపేద దళిత ఎకరా

ఒక ఎకరా రెండు ఎకరాలు కోల్పోతున్నారు. కాబట్టి భూమికి భూమి పదులన్న ఇవ్వాలి లేదా అంటే వాళ్ళను నచ్చ చెప్పాలి తప్ప ఇలా ఆత్మహత్యలు వరకు తీసుకురావడం అధికారులది

సరైన నిర్ణయం కాదని వారు కుటుంబాలకు అండగా ఉంటామని మాల మహానాడు ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కునా నిరంజన్, శంకర్, ఆలూరి కర్ణ, మూర్తి మధు, బిజ్జ భాస్కర్, శ్రీను, మైబు, కాసిం, మధు, బాలరాజు, ప్రసాద్, వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ విజయవంతం



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 2(జనంసాక్షి):**

నాగర్ కర్నూల్ ఆదివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్లో తైక్వాండో విద్యార్థులకు కలర్ బెల్ట్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ బెల్ టెస్ట్ లో విద్యార్థులకు పంచెస్, బ్లాక్స్, కిక్స్, పుంసే, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన బెల్ట్ సర్టిఫికెట్లు సాధించడం జరిగింది. ఎల్లో బెల్టు సాధించిన విద్యార్థులు టి. అనన్యశ్రీ , టి. నిత్ శౌర్య, నేహా, నమ్రుత్, ఎల్లో వన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు ఎస్. దివిజ, పి. అర్జున్, పి. సాయి మనస్విని, పి. సాయిమనోజ్ఞ, సి. సుమేధ, సి. సాయిమోక్ష , గ్రీన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు సి. ప్రణీత్, డి.వెంకటలక్ష్మి , గ్రీన్ వన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు కె. రితికవిద్యార్థులకు సర్టిఫికెట్స్ లను నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ తెప్ప శ్రీను నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో జర్నల్ సెక్రటరీ రవికుమార్, నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో ట్రెజరర్ మాస్టర్ స్వాతి వారి చేతుల మీదుగా విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది.

# ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పెబ్బేరుకు పెద్దపీట

**పెబ్బేరు ఫిబ్రవరి 2 (జనం సాక్షి)**



వనపర్తి శాసనసభ్యులు తూడి మెగారెడ్డి ప్రతిపాదనలతో పెబ్బేరు మండలానికి పెద్దపీటవేసి ఒక కోటి 30 లక్షలు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను నిర్మించుకోవడానికి రూపు దాల్చింది. కొత్త సూగూర్ గ్రామంలోని దళిత కాలనీలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పార్లమెంటు సభ్యులు మల్లు రవి స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డిచిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

నిధుల మంజూరుకు ముందడుగు పడటంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్,సీనియర్ నాయకులు, ఆవుల కురుమూర్తి ,గంధం రాజశేఖర్,రాములు యాదవ్, శివకుమార్, డైరెక్టర్ రామన్ గౌడ్,ఆంజనేయులు, మోతి రాములు, శివసాయి, వెంకటేష్, శివ, మండల యూత్ అధ్యక్షులు రాజేష్,గోవింద్,శివ, వినయ్, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు తీవ్ర అన్యాయం

**మంథని, (జనంసాక్షి)**



### కేటాయింపులన్నీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు, ఎన్ డి ఏ భాగస్వామ్య రాష్ట్రాలకు దక్కాయి

### మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణాకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. కేటాయింపులన్నీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు, ఎన్ డి ఏ భాగస్వామ్య రాష్ట్రాలకు దక్కయని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర బడ్జెట్ పై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. కేంద్ర జిడిపిలో తెలంగాణ రాష్ట్రం వాటా 5 శాతంగా ఉన్నా ఆమేరకు నిధులు విదల్చలేదన్నారు. రాష్ట్రం నుంచి పన్నులు రూపంలో రూ.26 వేల కోట్లు కేంద్రానికి వెళ్లాయి.. గతంలో కంటే 12 శాతం పెరిగినా రాష్ట్రంపై చిన్నచూపు చూడటానికి రాజకీయ కారణాలే కారణాలని ఆరోపించారు. బిజెపికి 8 మంది ఎంపీలను ఇచ్చినా కూడా తెలంగాణా ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. బీహార్, దిల్లీ, ఏపీ, గుజరాత్ లకు మాత్రమే ప్రాధాన్యతనివ్వడం కక్ష సాధింపు కాదా..? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు పలుసార్లు ప్రధానితో సహా కేంద్ర మంత్రులను కలిసి రూ.1.63 వేల కోట్ల సహాయం కోసం అర్థించారు.. మెట్రో-2 ప్రాజెక్టు 76.4 కిలోమీటర్ల విస్తరణకు కేంద్రం వాటాగా రూ.17.212 కోట్లు కేటాయించాలని కోరగా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, శివారు మున్సిపాలిటీలకు సిఎస్ఎంపి కింద భూగర్భ డ్రైనేజీకి నిధులు కేటాయించాలని విన్నవించుకున్నా అ న్యా య ం చేశారన్నారు. మూసీ నది హైదరాబాద్ లో 55కిమీ ప్రవహిస్తోంది.. మురుగు కూపం గా మారిన ఈ నది పునరుజ్జీవం కోసం రూ.4 వేల కోట్లు అడిగితే కేంద్రం నిరాశపరిచిందన్నారు. రాష్ట్రానికి ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ, సైనిక్ స్కూల్స్ ను కేటాయించాలని కోరినా పట్టించు కోలేదన్నారు. కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరినా రూపాయి ఇవ్వలేదని, గోదావరి-మూసీ అనుసంధానం ప్రస్తావనే లేదన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో వెసులు ఇవ్వాలని కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కీలక రిక్వెస్ట్..!

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత టిష్ఠపరిచేందుకు పీసీసీ ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అందులో భాగంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తాజాగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ చేశారు. తరచూ గాంధీ భవన్‌కు వచ్చి నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

తెలంగాణలో మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించగా.. అందుకు సంబంధించిన నివేదికను నేడు మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్మెంట్ కేబినెట్ సబ్ కమిటీకి అందజేయనుంది. నివేదికపై కేబినెట్ సబ్‌కమిటీ చర్చించి ఆమోదించిన తర్వాత ఈ నెల 5న ఉదయం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. ఆ తర్వాత ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి చర్చించనున్నారు. ఈనెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో లోకల్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు వ్యూహాలకు పదును పెడుతోంది. కాంగ్రెస్ ప్రతిష్ఠను పెంచేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గాంధీకి రావాలని సీనియర్లకు కబురు పంపింది. తాజాగా.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డికి ఫోన్ చేశారు. పార్టీ కార్యకర్తలు, నేతలకు దిశానిర్దేశం చేసేందుకు అప్పుడప్పుడు గాంధీభవన్‌కు రావాలని స్పెషల్‌గా రిక్వెస్ట్ చేశారు. గాంధీభవన్‌కు వారానికొకసారైన వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు తెలిసింది.ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలపై విమర్శలు కురిపిస్తున్నాయి. ప్రజలతో పాటుగా ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి ఉందని ప్రచారం చేస్తున్నాయి. రెండ్రోజుల క్రితం ఓ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే అలర్ట్ అయిన పీసీసీ.. జానారెడ్డితో సహా సీనియర్లను రంగంలోకి దింపుతోన్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారన్న వార్తలపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాము ఎటువంటి రహస్య భేటీలో పాల్గొనలేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తాజాగా స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై కుట్ర జరుగుతోందని రాజేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌కు లేఖ రాశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానన్నారు.

# కార్పొరేట్ అనుకూల బడ్జెట్

- సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- యాచారంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**యాచారం, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ యాచారం మండల కేంద్రంలో సీపీఎం యాచారం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంనికి సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది కార్పొరేట్ల అనుకూల బడ్జెట్ - తెలంగాణ ఊసే లేని బడ్జెట్ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. బడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడే బడ్జెట్గా వున్నది. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ది కల్పించేందుకు ఎటువంటి ప్రసంగమూ, పథకం లేదు. వేతన జీవులను పెద్దఎత్తున సంతృప్తి పరుస్తామని చెప్పి ముష్టి వేసినట్లు ఊరట కల్పించారు. దేశ ప్రజల (కార్పొరేట్ల) బడ్జెట్ అని ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా వున్నది. ప్రజా వ్యతిరేకంగా వున్న బడ్జెట్ను నిరసిస్తూ నిరసనలు తెలపడం జరిగింది యాచారం మండల కమిటీ రాష్ట్రంలో ఇద్దరు బిజెపి మంత్రులు, 8మంది పార్లమెంట్ సభ్యులు వున్నప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారు. రాష్ట్ర విభజన హామీలు గాలికొదిలేశారు. ఆదిలాబాద్లో సిసిఐ ఫ్యాక్టరీలు, రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఎఫ్ఎం, హైస్పీడ్ రైల్వే ట్రాక్లకు నిధుల ఊసే లేదు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారు. రు.50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో రు.12,76,338 కోట్లు, అనగా 25.2 శాతం వడ్డీల చెల్లింపుకే కేటాయించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రు.10వేల కోట్లు తగ్గించారు. ఎరువుల సబ్సిడీకి రు.11వేల కోట్లు తగ్గించారు. ప్రధాని మోడీ దేశంలో 25 కోట్ల మందిని దారిద్రరేఖకు ఎగువకు తెచ్చామని చెబుతూనే, 2029 వరకు 80 కోట్ల మందికి 5 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి హామి పథకానికి 2023-24లో 89,154 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత బడ్జెట్లో రు.86వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దళిత, గిరిజనులకు బడ్జెట్, సబ్ ప్లాన్ క్రింద చేసినకేటాయింపులు ఆ వర్గాల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఈ వర్గాలకు కేటాయించిన నిధులను నోడల్ ఆఫీసర్ ద్వారా ఆవాసాలు, రహదారులు, త్రాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించినచో ఆ వర్గాల్లో కొంతమేరకైనా అభివృద్ధి జరుగుతుంది. దళితులకు 16శాతం కేటాయించాల్సి వుండగా, 5శాతం నిధులు మాత్రమే కేటాయించారు. గిరిజనులకు 7శాతం నిధులు కేటాయింపునకు బదులు 2శాతం కేటాయించారు. విద్య, వైద్య రంగాలకు చాలా స్వల్పంగా కేటాయింపులు 3శాతానికి లోపే కేటాయింపులు వున్నాయి. పారిశ్రామిక రంగం ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. కార్పొరేట్లకు పన్ను రాయితీలు, బ్యాంకుల అప్పుల ఎగవేతకు అవకాశం కల్పిస్తూ తయారు చేసిన ఈ బడ్జెట్ను పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దాలి. బడ్జెట్ ని ఉపసంహరించుకొని మళ్లీ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆల్లంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు బ్రహ్మయ్య,జంగయ్య,చందు నాయక్ , మండల కమిటీ సభ్యులు, కావలి జగన్, ఎం జె వినోద్, జంగయ్య, లాజర్, విప్లవ్ కుమార్, బాలరాజ్, మౌనిక, మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఉమా, మస్కు అరుణ సిపిఎం పార్టీ వివిధ గ్రామ శాఖ కార్యదర్శిలు కార్యకర్తలు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక



- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పలువురు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం యాలాల్ మండలంలోని పగిడ్యాల్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు, పాలనకు ఆకర్షితులై బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని వెల్లడించారు. పార్టీ లో చేరిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు యమున చంద్రయ్య, మంగళి లోకేష్,నేత్తి బసప్ప,కుమ్మరి బల్లప్పతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ చేరిక కార్యక్రమంలో యాలాల్ మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, పగిడ్యాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కిషన్ రెడ్డి,బండి సంజయ్,డీకే అరుణ సమాధానం చెప్పాలి
- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తులు చేసినప్పటికీ వాటిని తుంగలో తొక్కి బడ్జెట్లో తీరని అన్యాయం చేశారని టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం ఆమనగల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...చిన్న రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచి వారిపై ఆధిపత్యం చెలాయించడమే లక్ష్యంగా బిజెపి పార్టీ ముందుకు సాగుతుందని ఆరోపించారు.కేంద్రం ప్రభుత్వం బడ్జెట్,లో గత పదేళ్లుగా విభజన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న తెలంగాణకు ఈసారి కూడా కేంద్ర బడ్జెట్లో నిరాశ మిగిలిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే పెద్దపీట వేసి దేశ ప్రజల సమానత్వాన్ని మరిచిన కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో..ఉద్యోగాల కల్పన విషయంలో బడ్జెట్లో ప్రతిపాదనలు ఏవీ కనిపించలేదు.ఉపాధి కల్పన పరిశ్రమల ఏర్పాటు పై దృష్టి సారించలేదు.మరీ ముఖ్యంగా తెలంగాణకు ప్రత్యేకంగా ఎక్కడా బడ్జెట్ కేటాయింపులు లేవు.8 మంది బీజేపీ ఎంపీలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ.. తెలంగాణ అభివృద్ధిపై పైసా అదనంగా తీసుకురాకపోవడం దురదృష్టకరం అన్నారు.విభజన హామీలు ఊసేలేదు,సూదిని జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇవ్వకపోవడంతో పాటు,రాష్ట్ర అభివృద్ధికి న్యాయ పైసా చెల్లించకపోవడం దారణమన్నారు.కేంద్రం ప్రకటించిన 50.65 లక్షల కోట్ల బడ్జెట్లో తెలంగాణ వాటా ఎంత? రాష్ట్ర బీజేపీ ఎంపీలు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని అన్నారు.తన ప్రభుత్వం కూలిపోకుండా కాపాడుకునేందుకు మిత్రులని మచ్చిక చేసుకునేందుకే బీహార్,ఏపీ లాంటి రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తున్నారు.అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే.. దేశం అభివృద్ధి చెందినట్లు అనేది మోడీ ప్రభుత్వం గుర్తుఎరుగకపోవడం బాధాకరం. అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్లమల్ల జగన్,బ్లాక్ ఉపాధ్యక్షుడు ఖలీల్,జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఖాదర్, కరీం,అలిమ్,జిల్లా కార్యదర్శీ ఫరీద్,సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్,మహేష్, శేఖర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ వనంగా మారిన జన్వాడ

- బీజేపీకి బిగ్ షాక్
- భారీ అనుచరగణంతో బీఆర్ఎస్ లోకి గౌడిచర్ల వెంకటేష్
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో చేరికలు



**శంకర్పల్లి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** మండలంలోని జన్వాడ గ్రామం నుండి ఆదివారం నాడు బిజెపి నుండి భారీగా అనుచరులతో బీఆర్ఎస్ లోకి గౌడిచర్ల వెంకటేష్ చేరారు. కోలాటాలు, డప్పుల దరువులు, బాణసంచా మోతలతో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి కి గౌడిచర్ల వెంకటేష్ ఘన స్వాగతం పలికారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి భారీ క్రేన్ తో స్వర్గీయ ఇంద్రన్న విగ్రహానికి భారీ పూలమాల వేశారు. గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ లోకి వెంకటేష్ ను సబితా ఇంద్రారెడ్డి, కార్తిక్ రెడ్డి కలిసి ఆహ్వానించారు. వెంకటేష్ తో పాటు సుమారు వేయి మంది అనుచరులతో బీఆర్ఎస్లో చేరినారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామం నుండి ఏకంగా జిహెచ్ఎంసి లో కలపటం ద్వారా జన్వాడ గ్రామ ప్రజల బాధలు వర్ణనాతీతం.. గ్రామ పంచాయతీగా కొనసాగించాలని ప్రజల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.కనీసం మునిసిపాలిటీగా అయిన మార్చిన ఒప్పుకుంటాం కానీ గ్రేటర్ మునిసిపాలిటీ కార్పొరేషన్ లో మార్చవద్దని మొరపెట్టుకున్నామన్నారు. గ్రామమే ముద్దు మునిసిపాలిటీ వద్దు అంటూ ఏకగ్రీవంగా జన్వాడ గ్రామస్తులంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష.అన్నారు. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే...ఎగిరేది గులాబీ జెండానే ప్రజలకు వివరించారు. చేవెళ్ల నియోజకవర్గముతో మా కుటుంబానికి విడదీయరాని అనుబంధం అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేశాము.. కేటీఆర్ పాదయాత్ర చేసిన రోడ్డును నిర్మించుకున్నామని తెలిపారు.అబద్ధాల హామీలతో గద్దెనెక్కి,అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. జన్వాడ గ్రామాన్ని ప్రజల కోరిక మేరకు మునిసిపల్ లో కలపవద్దని డిమాండ్ చేశారు.చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని ఎప్పుడు ఎన్నికలు వచ్చిన తప్పక గెలుపు సాధిస్తాం అన్నారు. జన్వాడ గ్రామంలో మహాలక్ష్మి పేరుతో ఆడబిడ్డ పుడితే 16 వేలు ఇస్తున్న వెంకటేష్ అభినందనీయుడని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యువ నేత,జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పి కార్తీక్ రెడ్డి,మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు,శంకర్ పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కె నారాయణ,మాజీ మార్కెట్ చైర్మన్ మానిక్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కురుమ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు గౌడిచర్ల నరసింహ, నాగేందర్,కేశం గోపాల్, అశోక్,గౌడిచర్ల రాములు,సుధాకర్ రెడ్డి,శ్రీనివాస్,లింగం, ఎజాస్, పి సురేష్,కె శ్రీను,సి హెచ్ వీరయ్య,జాఫర్,ఏ రాములు, నరసింహ రెడ్డి,ఇంద్రసేనా రెడ్డి,ఫరిద్,తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ స్టాక్ యార్డ్లో అగ్ని ప్రమాదం

- 30 లక్షల హెచ్ డిపి పైపులు దగ్ధం



**మునిపల్లి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా మిషన్ భగీరథ స్టాక్ యార్డ్లో ఆదివారం నాడు అగ్ని ప్రమాదం జరిగింది. శనివారం నాడు వెంకటేశ్వర గుట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిలో వేసిన నిప్పు రవ్వ గుట్ట చుట్టూ గల పొదలు, గడ్డి తగలబడుతుంది 24 గంటలు మంటలు ప్రాకుతూ మిషన్ భగీరథలోని స్టాక్ యార్డ్లో గల పైపులకు నిప్పు అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. వాటి విలువ సుమారు 30 లక్షలు ఉంటుందని అంచనా. కాలుతున్న పైపుల దట్టమైన పొగలు 65 వ నెంబర్ జాతీయ రహదారిపై ఆలముకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

## గుత్తా సుఖేందర్ రెడ్డికి జన్మదిన శభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**దేవరకొండ, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారివెంట నల్గొండ పార్లమెంట్ కోర్డినేటర్ ఎంఎ సిరాజ్ ఖాన్ ఉన్నారు.

## పేదోన్ని మరింత పేదోన్ని చేసే బడ్జెట్

- పసలేని పనికిమాలిన నిర్మలా బడ్జెట్
- దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం
- బీజేపీ బడ్జెట్ లో తెలంగాణకు మొండి చెయ్యి
- ఆరోపణలు చేసిన పినపాక కాంగ్రెస్ అధ్యక్షులు రామానాదం



**పినపాక, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని మొదలుపెట్టినటువంటి బడ్జెట్ ఈ దేశ ప్రజల నోళ్లలో మట్టి కొట్టిన బడ్జెట్ అని పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం విమర్శించారు. 12 లక్షల ఆదాయము ఉన్నవాళ్లకు పన్ను మినహాయింపులో కూడా కోరీలు పెట్టారన్నారు. దేశంలో రెండున్నర మూడు కోట్ల జనాభా పన్ను కట్టే వారికి తప్ప బీదవానికి ఈ బడ్జెట్ వల్ల ఉపయోగం ఏమీ లేదన్నారు. దేశంలో 100 రూపాయల నుంచి 150 ఆదాయం సంపాదించుకొని దాంట్లోనే జీవనం సాగించే పేదవానికి ఒరిగిందేంటని ప్రశ్నించారు. పేద వాడి గురించి ఆలోచించని బడ్జెట్ అవసరమా..? ఈ దేశానికి మంచినీళ్ల లాగా రోజు ఖర్చు చేసే డీజిల్ పెట్రోల్ మీద ధర తగ్గించడం చేతకాని చెత్త బడ్జెట్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి ఒట్టి చేతులు చూపించిన పరిస్థితి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ కూడా తెలంగాణకు నిధులు తీసుకు రాలేని అసమర్థులన్నారు. ముమ్మాటికీ బడ్జెట్ చెత్తకుండీలో చెత్తలాంటిదని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రలకు మొండిచెయ్యు చూపిన బీజేపీకి భవిష్యత్లో ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు.

# పట్టణం నుండి పల్లె చెరువులోకి మురుగు నీరు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు..



**షాద్నగర్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటిలోని వివిధ కాలనీల నుండి బయటికి వెళ్లే మురుగు నీటినీ గతం నుండి పట్టణానికి ఆనుకొని ఉన్న జానమ్మ చెరువులోకి వదిలేవారు పెద్ద ఎత్తున వర్షలు పడినప్పుడు చెరువు నిండి అలుగు ద్వారా వర్షం నీరుతో పాటు మురుగు నిరు బయటకు వెళ్లిపోయేది కానీ ప్రస్తుతం షాద్ నగర్ పట్టణంలోనీ వివిధ కాలనీల ద్వారా సిఎస్కె వెంచర్ నుండి నందిగామ మండలం అప్పారెడ్డిగూడా గ్రామ శివారులో ఉన్న చెరువులోకి పోయే విధంగా దారి మళ్లించారు దాంతో చెరువులోకి మురుగు నీరు వెళ్లడంతో చెరువు నీరు పూర్తిగా కలుషితమై గ్రామంలో దుర్వాసన వెదజల్లడంతో పాటు చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వారికి చర్మ సంబధిత వ్యాధులు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు వెంటనే అధికారులు స్పందించి మురుగు నీటినీ చెరువులోకి రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

### మురుగు నీటినీ చెరువులోకి రాకుండా కట్టడి చెయ్యాలి



షాద్నగర్ పట్టణంలోని వివిధ కాలనీల నుండి వచ్చే మురుగు నీటినీ మా గ్రామ చెరువులోకి వదులుతున్నారు దాని వల్ల గ్రామంలో దుర్వాసన వస్తుంది గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వెంటనే సంబధిత అధికారులు స్పందించి మురుగు నీటిని చెరువులోకి రాకుండా కట్టడి చేయాలి.

**సీతారాం, అప్పారెడ్డిగూడ గ్రామ మాజీ డిప్యూటీ సర్పంచ్**

### మురుగు నీటిని మా గ్రామ చెరువులోకి రాకుండా చెయ్యాలి..



షాద్నగర్ పట్టణంలోని పలు కాలనీల నుండి వచ్చే మురుగు నీటిని మాగ్రామ చెరువులోకి వదులుతుండడంతో విపరీతమైన దుర్వాసన వస్తుంది గ్రామంలో ఉండలేకపోతున్నం అధికారులు స్పందించి మురుగు నీటిని మాగ్రామ చెరువులోకి రాకుండా చెయ్యాలి..

**గణపురం చిన్న మల్లయ్య, అప్పారెడ్డి గూడ గ్రామస్థుడు..**

### చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయి..



షాద్ నగర్ పట్టణం నుండి మురుగు నీటిని మాగ్రామ చెరువులోకి వదులుతుండడంతో చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లిన మాకు చర్మ సంబందిత వ్యాధులు వస్తున్నాయి కాబట్టి అధికారులు స్పందించి మురుగునీటిని చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**లింగన్న గారి మల్లయ్య**

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



**శివ్వంపేట, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని శివ్వంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్ రాం రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన యువకులు తమకు క్రికెట్ కిట్ కావాలని అడగగానే స్పందించిన స్థానిక సొసైటీ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి తన సొంత డబ్బులు వ్యాచించి 15వేల రూపాయల గల క్రికెట్ కిట్టు ను ఆదివారం పోతులబోగూడ యువకులకు తన చేతుల మీదుగా అందజేశారు. తాము కోరిన వెంటనే కాదనకుండా తమకు క్రికెట్ కిట్టు ఇప్పించిన వెంకట్రాంరెడ్డికి, యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మంద ప్రవీణ్, కుమారి నర్సింలు, బండి బిక్షపతి, గద్దే వెంకటేష్, గద్దె నెల్లూరు, గద్దె గణేష్, పత్రాల శ్రీను, పత్రాల అశోక్, సత్యనారాయణ, మంద అశోక్, అలె సంజీవ లతో పాటు సీవీఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరోజే 20 శాతం పెరిగిన స్టాక్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సెషన్లో తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. లాభాల్లోనే ఉన్నప్పటికీ.. ఒక్కసారిగా పెరిగి మళ్లీ వెంటనే పడిపోతున్నాయి. సెన్సెక్స్ ప్రస్తుతం ఉదయం 11.30 గంటల సమయంలో. 250 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్ల లాభంలో కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని స్టాక్స్ భారీగా దూసుకెళ్తున్నాయి. ఒక స్టాక్ %ు%3 ఫలితాల నేపథ్యంలో 20 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది.

హిటాచి ఎనర్జీ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొడుతోంది. ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తోంది. 5 శాతం, 10 శాతం కాదు.. ఒక్కరోజే ఏకంగా 20 శాతం దూసుకెళ్లింది. అప్పర్ సర్క్యూట్లో లాకైంది. మళ్లీ మామూలుగా పెరగలేదు. 20 శాతం అంటే ఒక్కో షేరుపై %చీూజు% లో ఏకంగా రూ. 2046.25 పెరగడం విశేషం. కిందటి సెషన్లో రూ. 10,231.25 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలోనే 10 శాతానికిపైగా లాభంతో రూ. 11,444 వద్ద ఓపెన్ అయింది. అక్కడితో ఆగకుండా మళ్లీ దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే కిందటి సెషన్ క్లోజింగ్ నుంచి 20 శాతం పెరిగి చివరకు రూ. 12,277.50 వద్ద అప్పర్ సర్క్యూట్లో లాకైంది. కిందటి రోజు కూడా ఈ స్టాక్ పెరిగింది. 2 రోజుల వ్యవధిలోనే స్టాక్ ధర ఏకంగా 27 శాతానికిపైగా ఎగబాకింది. దీంతో ఇందులో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురిసింది. భారీగా లాభాలు ఆర్జించారు.

2024-25 ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి ఈ కంపెనీ ఫలితాల్ని బుధవారం రోజు ప్రకటించింది. ఇక్కడ ఇది దలాల్ స్ట్రీట్ అంచనాల్ని అధిగమించి పెర్ఫామెన్స్ చేయడం విశేషం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే కంపెనీ నికర లాభం క్యూ3లో 498 శాతం మేర పెరిగి రూ. 137.4 కోట్లుగా నమోదైంది. ఇదే సమయంలో కిందటి త్రైమాసికంతో (జులై-సెప్టెంబర్) పోలిస్తే 162.7 శాతం పెరిగింది. క్యూ2లో కంపెనీ లాభం రూ. 52.3 కోట్లుగా ఉంది. ఇక ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 31 శాతం మేర పెరిగి రూ. 1672.4 కోట్లకు చేరుకుంది. మూడో త్రైమాసికంలో ఎబిటా రూ. 168.9 కోట్లుగా ఉంది. రికార్డు స్థాయిలో తొలిసారి ఒక త్రైమాసికంలో అత్యధిక విలువతో ఆర్డర్లను అందుకుంది. క్యూ3లో ఈ కంపెనీ ఆర్డర్స్ వాల్యూ రూ. 11,594.3 కోట్లుగా ఉంది. ఖవ్డా (గుజరాత్) నుంచి నాగ్‌పూర్ (మహారాష్ట్ర) వరకు ట్రాన్స్‌మిట్టింగ్ రెనివబుల్ ఎనర్జీ కోసం లార్జ్ హై వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ ఆర్డర్ విలువ పరంగా అతిపెద్దది కావడం ప్రధాన కారణం.

ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ విలువ రూ. 16,549.95 గా ఉండగా.. కనిష్ఠ ధర రూ. 5590 గా ఉంది. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 52.03 వేల కోట్లు. గత 5 రోజుల్లో చూస్తే ఈ స్టాక్ 4 శాతానికిపైగా పెరగ్గా.. నెల రోజుల్లో 14 శాతం పతనమైంది. 6 నెలల్లో 3 శాతం పుంజుకోగా.. ఇదే సమయంలో ఏడాది వ్యవధిలో 118 శాతం పుంజుకుంది. గత ఐదేళ్లలో ఇది 81 వేల శాతానికిపైగా పెరిగింది. బడ్జెట్‌కు ముందు దేశీయ స్టా మార్కెట్ సూచీలు గురువారం రోజు ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్నాయి. వార్త రాసే సమయంలో సెన్సెక్స్ 250 పాయింట్ల లాభంతో 76,780 లెవెల్స్‌లో ఉంది. నిఫ్టీ 100 పాయింట్లు పుంజుకొని 23,260 లెవెల్స్‌లో కొనసాగుతోంది.

# ఒక్కరోజే 20 శాతం కుప్పకూలిన స్టాక్..



భారత స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం సెషన్లో లాభాల్లోనే ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ 400 పాయింట్లు, నిఫ్టీ 70 పాయింట్లకుపైగా పెరిగినప్పటికీ.. చాలా వరకు స్టాక్స్ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమం లోనే ఒక ప్రముఖ కంపెనీ స్టాక్ ఏకంగా 20 శాతం పడిపోయింది. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి భారీగా నష్టాలు వస్తున్నాయని చెప్పొచ్చు.

గత కొద్ది సెషన్లుగా తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడయిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ఇవాళ (మంగళవారం) కోలుకున్నాయని చెప్పొచ్చు. ఎట్టకేలకు ఇవాళ లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ వార్త రాసే సమయంలో (ఉదయం 11 గంటలకు) బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 400 పాయింట్ల లాభంతో 75,760 మార్కు వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ విషయానికి వస్తే.. 70 పాయింట్ల లాభంతో 22,900 మార్కు వద్ద ఉంది. స్టాక్ మార్కెట్లు కిందటి సెషన్‌తో పోలిస్తే కోలుకున్నప్పటికీ.. చాలా స్టాక్స్ ఇంకా భారీగా ఇన్వెస్టర్లకు నష్టాల్ని ఇస్తూనే ఉన్నాయి. వీటిల్లో కొన్ని స్టాక్స్.. ఒక్కరోజులో 5 శాతం, 10 శాతం, 20 శాతం ఇలా చాలా లోయర్ సర్క్యూట్లు కొట్టాయి.

ఇప్పుడు మనం ఒక్కరోజులోనే 20 శాతం పడిపోయిన స్టాక్ గురించి తెలుసుకుందాం. అదే కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ స్టాక్. కిందటి సెషన్లో ఇది రూ. 5268.05 వద్ద ముగియగా.. ఇవాళ భారీ నష్టాల్లోనే ప్రారంభమైంది. క్రమక్రమంగా పడుతూ వస్తూ.. ఇంట్రాడేలో ఏకంగా 20 శాతం నష్టంతో రూ. 4214.45 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం 19.70 శాతం నష్టంతో (ఒక్కో షేరుపై రూ. 1038 తగ్గి) రూ. 4230 వద్ద ట్రేడవుతోంది. ఈ క్రమంలోనే ఈ స్టాక్‌లో ఇన్వెస్ట్ చేసిన వారిని తీవ్ర నష్టాలు వెంటాడుతున్నాయి. కిందటి రోజు కూడా ఈ స్టాక్ పడిపోగా.. 2 రోజుల వ్యవధిలోనే 25 శాతం వరకు పతనం కావడం గమనార్హం.

ఈ కంపెనీ తాజాగా అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికం ఫలితాల సందర్భంగా.. ఆదాయ వృద్ధి అంచనాల్ని తగ్గించడమే దెబ్బతీసింది. అంతకుముందు ఆదాయం రూ. 3 వేల కోట్లుగా అంచనా వేయగా.. ఇప్పుడు దానిని తగ్గించి రూ. 2800 కోట్లకు చేర్చింది. డిసెంబర్ క్వార్టర్‌లో ఈ కంపెనీ చాలా వరకు ఆర్డర్లను పూర్తి చేయలేకపోయిందని.. వీటి విలువ సుమారు రూ. 100 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. అది ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో పూర్తి చేయొచ్చని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినగా.. అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో స్టాక్ పతనం అవుతోంది.

మూడో త్రైమాసికంలో ఈ కంపెనీ నికర లాభం.. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 47 శాతం పెరిగి రూ. 66.5 కోట్లుగా నమోదైంది. ఇక ఆదాయం కూడా 30 శాతం మేర పెరిగి రూ. 661.2 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఇది రూ. 509.3 కోట్లుగానే ఉండేది. లాభాదాయాలు పెరిగినప్పటికీ.. ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడంతో పెద్ద దెబ్బ పడ్డట్లయింది. ఇక ఈ కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 27.17 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 7822 కాగా.. కనిష్ఠ ధర రూ. 2424గా ఉంది.

# ఒకేసారి చేతికి రూ. 5.80 కోట్లు.. నెలకు రూ. 10 వేల పొదుపుతో సాధ్యం..

మ్యూచువల్ ఫండ్స్‌లో అప్పుడప్పుడు అద్భుతాలు జరుగుతుంటాయి. ఇక్కడ కాంపౌండింగ్ ఎఫెక్ట్‌తో దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ సాధించొచ్చని నిపుణులు చెబుతుంటారు. ఇంకొన్ని సార్లు మాత్రం ఊహించని రీతిలో భారీగా సంపాదించొచ్చు. ఇప్పుడు ఒక స్కీమ్ అదే విధంగా మ్యాజిక్ చేసింది. రూ. 10 వేల సిప్‌ను కొన్నేళ్లలోనే ఏకంగా కోట్లుగా మలిచింది.

దిగ్గజ మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో ఒకటైన కెనరా రాబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ స్కీమ్ 32 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇది ఓపెన్ ఎండెడ్ హైబ్రిడ్ స్కీమ్ అని చెప్పొచ్చు. ఇది ఎక్కువగా ఈక్విటీ అండ్ ఈక్విటీ రిలేటెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ, డెట్ ఇన్వెస్ట్‌మెంట్లను బ్యాలెన్స్ చేసుకుంటూ పెట్టుబడులు పెడితే.. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందుకునే విధంగా ఈ ఫండ్ తీసుకొచ్చింది. ఈ కారణంతోనే ఇన్వెస్టర్లకు కచ్చితత్వంతో కూడిన లాభాలు అందించడమే లక్ష్యంగా, ఈక్విటీ, డెట్ ఇలా వైవిధ్యతతో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని.. తద్వారా రిస్క్ తక్కువగా ఉంటుందని తాజాగా ఫండ్.. ప్రెస్ రిలీజ్‌లో వివరాల్ని వెల్లడించింది.

కెనరా రాబెకో ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ అనేది అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్. ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా లాంగ్ రన్‌లో మంచి రాబడి అందించేందుకు ఉద్దేశించింది. 1993, ఫిబ్రవరి 1న ఈ స్కీమ్ లాంఛ్ అయింది. ఇక్కడ పథకానికి కొలమానంగా ఉంది. ఈ ఫండ్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ అంటే నికర ఆస్తుల విలువ 2024, డిసెంబర్ 31 వరకు చూస్తే రూ. 10,747.36 కోట్లుగా ఉంది.

ఇక రిటర్న్స్ విషయానికి వస్తే ఈ ఫండ్ గత ఏడాది, మూడేళ్లు, ఐదేళ్ల వ్యవధిలో చూసినట్లయితే సగటున వరుసగా 15.23 శాతం, 11.91 శాతం, 15.53 శాతం చొప్పున ప్రతిఫలం వచ్చింది. ఇదే సమయంలో ఇక్కడ బెంచ్‌మార్క్ క్రిసిల్ హైబ్రిడ్ 35o65- అగ్రెసివ్ ఇండెక్స్ రిటర్న్స్ వరుసగా 12.69, 11.85, 14.59 శాతంగా ఉంది.



స్కీమ్ లాంఛింగ్ నుంచి చూస్తే ఈ కెనరా రాబెకో ఫండ్ సగటున 11.74 శాతం మేర రిటర్న్స్ అందించింది. అంటే పథకం ప్రారంభించిన సమయంలో ఇందులో ఎవరైనా ఇన్వెస్టర్ రూ .10 వేలు ఇన్వెస్ట్ చేసినట్లయితే ఇప్పుడు అది రూ. 3.46 లక్షలకు చేరేది. అదే సమయంలో ప్రారంభం నుంచి ప్రతి నెలా రూ. 10 వేల చొప్పున సిప్ విధానంలో పెట్టుబడి పెట్టినట్లయితే మొత్తం పెట్టుబడి 2024, డిసెంబర్ 31 వరకు రూ. 38.30 లక్షలు కాగా.. ఇది 13.90 శాతం సగటు రాబడి కింద ఏకంగా రూ. 5.80 కోట్లకు చేరేది. అంటే 10 వేల చొప్పున సిప్ చేస్తే.. కోట్లల్లో రాబడి వచ్చిందన్నమాట. 1993లో ప్రారంభిస్తే అంటే 32 ఏళ్లలో ఇలా జరిగింది. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులతో దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ వస్తాయనడానికి ఇదే సాక్ష్యం. ఓపిక ఉంటేనే మంచి ఫలితాలు అందుకోవచ్చు. ఈ స్కీమ్ ఈక్విటీ పోర్షన్ మేనేజర్లుగా శ్రీదత్తా భండ్వాల్దర్, ఎన్నెట్టే ఫెర్నాండెస్ ఉండగా.. డెట్ పోర్షన్‌కు సంబంధించి అవ్నిశ్ జైన్ ఉన్నారు.

# ఈ పేమెంట్స్ చేయలేరు..

ఇకపై ట్రాన్సాక్షన్ ఐడీలో స్పెషల్ క్యారెక్టర్స్ ఉంటే ఆ యూపీఐ ట్రాన్సాక్షన్ ఐడీలను యూపీఐ సెంట్రల్ సిస్టమ్ అనుమతించదని స్పష్టం చేసింది ఎన్‌పీసీఐ. 2025, ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వివరించింది.

ఈ విషయం దృష్టిలో పెట్టుకోవాలని తాజాగా.. యూపీఐ వ్యవస్థలో భాగస్వామ్యం అయిన అన్ని డిజిటల్ పేమెంట్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలకు తెలిపింది. ఇకపై కేవలం ఆల్ఫాన్యూమరిక్ ట్రాన్సాక్షన్ ఐడీలను మాత్రమే తాము అనుమతిస్తామని.. అదే సమయంలో స్పెషల్ క్యారెక్టర్స్ కలిగి ఉంటే ఆ ట్రాన్సాక్షన్స్ డిక్లైన్ (తిరస్కరణ) అవుతాయని వెల్లడించింది. యూపీఐ పేమెంట్స్ చేసేందుకు ప్రస్తుతం ఎక్కువగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వాడుతున్నప్పటికీ.. ఇంకా చాలానే యాప్స్ ఉంటాయి. క్రెడ్, ఫ్రీఛార్జ్, నవీ, వన్‌కార్డ్, బజాజ్ ఫిన్‌సర్వ్, ధని, బిగ్‌క్యాష్ వీటితో పాటుగా పలు బ్యాంకులు ప్రత్యేకంగా పేమెంట్ యాప్స్ తీసుకొచ్చాయి. వీటన్నింటిలోనూ ఇదే రూల్ వర్తిస్తుంది. ఇదే సమయంలో కొద్ది మంది మినహా దాదాపు అందరు భాగస్వాములు కొత్త నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేసినట్లు పేర్కొంది. ఈ మార్పుతో యూపీఐ యూజర్లకు భద్రత పెరుగుతుందని.. వ్యవస్థ మరింత మెరుగ్గా తయారవుతుందని తెలిపింది. యూపీఐ ట్రాన్సాక్షన్స్ విలువ ప్రతి నెలా పెరుగుతూ పోతున్న సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్ నెలలో యూపీఐ ట్రాన్సాక్షన్స్ సంఖ్య ఏకంగా 16.73 బిలియన్లకు చేరుకుంది. దానికి ముందటి నెల కంటే ఇది 8 శాతం ఎక్కువ. విలువ పరంగా రూ. 23.25 లక్షల కోట్లకుపైనే ఉంటుంది.

# భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసి.. డబ్బు తీసుకుని ప్రియుడితో పారిపోయిన భార్య

భార్యాభర్తలు అంటే పెళ్లి అయిన క్షణం నుంచి ప్రాణం పోయే వరకు కలిసి ఉండే బంధం. కానీ కొందరు చేస్తున్న పనులు.. ఆ బంధానికే కళంకం తెచ్చేలా ఉంటున్నాయి. భర్త కిడ్నీని అమ్మేసిన ఓ భార్య.. వచ్చిన డబ్బుతో తన ప్రియుడితో కలిసి పారిపోయిన సంఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు కారణం అవుతోంది. కుమార్తె పై చదువుల కోసం కిడ్నీ అమ్మేద్దామని భర్తను నమ్మించిన భార్య.. రూ.10 లక్షలకు విక్రయించింది. వచ్చిన డబ్బును తీసుకుని.. తన లవర్‌తో వెళ్లిపోయింది. వారిద్దరినీ దొరకబట్టినా.. ఆమె మనసు కరగలేదు.

భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసి.. డబ్బు తీసుకుని ప్రియుడితో పారిపోయిన భార్య

పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటన ఒకటి చోటు చేసుకుంది. తాళి కట్టిన భర్త ప్రాణాలనే ఫణంగా పెట్టిన ఓ భార్య.. అతడి కిడ్నీని విక్రయించి.. వచ్చిన డబ్బుతో లవర్‌తో వెళ్లిపోయింది.

భర్తను బలవంతపెట్టి కిడ్నీని అమ్మేలా ఒత్తిడి తీసుకువచ్చిన ఆ భార్య.. వచ్చిన డబ్బుతో తన కుమార్తెను మంచి చదువులు చదివించుకుందామని చెప్పింది. అయితే తన భార్య చెప్పిన విషయాలన్నీ గుడ్డిగా నమ్మిన ఆ అమాయక భర్త.. కిడ్నీని ఇచ్చేశాడు. ఆ కిడ్నీ అమ్మగా.. రూ.10 లక్షలు వచ్చాయి. ఆ డబ్బు తీసుకువచ్చిన తర్వాత రాత్రి ఎవరికీ తెలియకుండా ఆ రూ.10 లక్షలు తీసుకుని.. ప్రియుడితో కలిసి పారిపోయింది. అయితే అసలు విషయం బయటపడిన తర్వాత ఆ భర్త.. వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారికి 10 ఏళ్ల కుమార్తె ఉంది. ఇక భార్య, ఆమె లవర్ ఆచూకీ తెలిసి అక్కడికి వెళ్లగా.. వారి ముందే గడియపెట్టేసుకుని వెళ్లగొట్టింది.

హౌరా జిల్లాలోని సంక్రైల్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. బాధితుడికి 10 ఏళ్ల కుమార్తె ఉండగా.. అతడు సంపాదించే ఆదాయం ఆమె చదువుకు అయ్యే ఖర్చులకు సరిపోలేదు. దీంతో అతడి కిడ్నీ అమ్మేస్తే.. కుమార్తె చదువుతోపాటు కుటుంబ ఆర్థిక సమస్యలు కూడా తీరుతాయని భార్య నమ్మించింది. కుమార్తె భవిష్యత్ నాశనం అయితే అందుకు బాధ్యత అతడిదే అని ఆ భార్య నిత్యం ఘర్షణ పడుతూనే ఉండేది.

అయితే ఆమె అంత ఒత్తిడి ఎందుకు చేస్తుందో ఆ భర్త కనిపెట్టలేకపోయాడు. చివరికి తన కూతురి భవిష్యత్తును ఆలోచించి కిడ్నీ అమ్మేసేందుకు అంగీకరించాడు. దీంతో నెలరోజుల పాటు కిడ్నీని అమ్మేందుకు భార్యాభర్తలు వెతికారు.

చివరికి ఆ భర్త కిడ్నీ.. రూ. 10 లక్షలకు అమ్ముడుపోయింది. ఇద్దరూ కలిసి కిడ్నీ కొనే వ్యక్తి వద్దకు వెళ్లి డబ్బు తీసుకుని వచ్చారు. ఆ డబ్బును తన వద్దే పెట్టుకున్న భార్య.. ఉదయాన్నే బ్యాంకులో డిపాజిట్ చేద్దామని నమ్మించింది. కానీ అదేరోజు రాత్రి.. ఇంటి నుంచి ఆమె పారిపోయింది. కొన్ని రోజుల తర్వాత శుక్రవారం తన భార్య బరాక్‌పూర్‌లోని సుభాష్ కాలనీలో రవిదాస్ అనే వ్యక్తితో నివసిస్తున్నట్లు భర్తకు తెలిసింది. ఈ క్రమంలోనే తన కుమార్తెతో కలిసి అక్కడికి చేరుకున్న భర్తను చూసిన ఆ భార్య షాక్ అయింది.

వారిని చూసి ఇంట్లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుంది. డబ్బులు ఇవ్వను.. ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించింది. అంతేకాకుండా విడాకులు పంపిస్తానని బ్లాక్ మెయిల్ చేసింది. కనీసం తన 10 ఏళ్ల కుమార్తెను చూసి కూడా ఆమెపై జాలి చూపించలేకపోయింది. దీంతో తన భార్య, ఆమెతో కలిసి ఉంటున్న పెయింటర్ రవిదాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశాడు.



# అయోధ్య సమీపంలో దళిత యువతి హత్యాచారంపై ఎంపీ కన్నీరు

దళిత యువతిని దారుణంగా అత్యాచారం చేసి.. హత్య చేసిన ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దళిత యువతిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో సీతారాములు ఎక్కడ ఉన్నారని.. మీరు ఎక్కడ ఉన్నారంటూ మీడియా సమావేశంలోనే కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇక ఈ ఘటనలో దళిత యువతి కుటుంబానికి న్యాయం జరగకపోతే.. తాను ఎంపీ పదవికి రాజీనామా చేస్తారని తెలిపారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికైన అవధేష్ ప్రసాద్ మీడియా సమావేశంలోనే కన్నీరు పెట్టుకున్నారు. 22 ఏళ్ల దళిత యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి.. దారుణంగా చంపిన ఘటనపై ఆయన తీవ్ర భావోద్వేగం అయ్యారు. ఆ యువతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆమెకు న్యాయం జరగకపోతే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని మీడియా సమావేశంలోనే పేర్కొన్నారు. ఇక అవధేష్ ప్రసాద్ మీడియా సమావేశంలోనే ఏడ్చిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.

అయోధ్య జిల్లాలో జరిగిన ఈ ఘటన నేపథ్యంలో ఆడ పిల్లలను కాపాడుకోవడంలో మనం విఫలం అవుతున్నామని ఈ సందర్భంగా అవధేష్ ప్రసాద్ వెల్లడించారు. ఈ క్రమంలోనే "మర్యాద పురుషోత్తమ రామా, సీతా మాత మీరు ఎక్కడ ఉన్నారు..?" అంటూ మీడియా ముందే రోదించారు. అయోధ్యలోని మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరగడానికి కొన్ని రోజుల ముందు ఈ ఘటన చోటు చేసుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందు ఈ అంశాన్ని లేవనెత్తుతానని అవధేష్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ ఘటనలో న్యాయం జరగకపోతే తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. ఇటీవల అయోధ్య జిల్లాలోని ఒక కాలువలో 22 ఏళ్ల యువతి మృతదేహం కనిపించింది. గురువారం రాత్రి ఒక మతపరమైన కార్యక్రమానికి వెళ్లిన ఆ యువతి ఇంటికి తిరిగి రాలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ తమ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఆ తర్వాత కాలువలో దొరికిన మృతదేహం దుస్తులు లేకుండా, శరీరంపై గాయాలు కనిపించాయని గుర్తించారు. ఆమెను తాళ్లతో కట్టేశారని ఆమె కుటుంబ సభ్యులు

> అయోధ్య జిల్లాలోని కాలువలో 22 ఏళ్ల యువతి మృతదేహం కనిపించింది. గురువారం రాత్రి ఒక మతపరమైన కార్యక్రమానికి వెళ్లిన ఆ యువతి ఇంటికి తిరిగి రాలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ తర్వాత కాలువలో దొరికిన మృతదేహం దుస్తులు లేకుండా, శరీరంపై గాయాలు కనిపించాయని గుర్తించారు.

ఆరోపించారు. ఆ యువతిపై అత్యాచారం, హత్య జరిగిందని నిర్ధారించారు. మిల్కీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గతంలో గెలిచిన అవధేష్ ప్రసాద్.. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అనంతరం మిల్కిపూర్ ఎమ్మెల్యే పదవికి అవధేష్ ప్రసాద్ రాజీనామా చేశారు. ఈనెల 5వ తేదీన మిల్కీపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రసిద్ధ అయోధ్య రామమందిరం నిర్మించిన తర్వాత కూడా ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓటమిపాలైంది.



# మరోసారి అంబానీ కుటుంబం గొప్పమనసు..

దేశంలో అనేక సేవా కార్యక్రమాలు, దాతృత్వ సేవలు అందిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్.. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలోనూ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళాకు వచ్చే లక్షల మంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తోంది. ఇందుకోసం రిలయన్స్ సంస్థకు చెందిన వాలంటీర్లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. "వి కేర్" ఫిలాసఫీ కింద రిలయన్స్ సంస్థ ఈ కార్యక్రమాలు మొదలుపెట్టింది. ఇలాంటి ఆధ్యాత్మిక సమ్మేళనానికి వచ్చే భక్తులకు సేవ చేస్తే దేవుడి అనుగ్రహం లభిస్తుందని విశ్వసిస్తారు.

మహా కుంభమేళాకు వచ్చే లక్షలాది భక్తుల కోసం రిలయన్స్ సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టింది. భక్తుల కోసం ఆహారం, వాహనాలు, విశ్రాంతి ప్రాంతాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా కుంభమేళాకు వచ్చే భక్తుల కోసం ఆహారం అందిస్తోంది. కుంభమేళాలో భక్తులు తప్పిపోకుండా ఏర్పాట్లు చేసింది. ఇక వైద్య సేవలను కూడా నిర్వహిస్తోంది. సెల్ సిగ్నల్స్‌లో అంతరాయం లేకుండా రిలయన్స్ సంస్థ అన్ని చర్యలు చేపట్టింది.

మహా కుంభమేళాకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం భోజనం, వాహనాలు, రెస్ట్ తీసుకోవడానికి గుడారాలను రిలయన్స్ సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. మహా కుంభమేళాకు వచ్చే యాత్రికులకు తమ సేవలు ఉంటాయని.. రిలయన్స్ సంస్థ డైరెక్టర్ అనంత్ అంబానీ పేర్కొన్నారు. మహా కుంభమేళా అనేది జీవిత కాల అవకాశం అని.. ఇక్కడికి వచ్చే లక్షలాది మంది భక్తుల ఆరోగ్యం, సంక్షేమం, రక్షణకు సహాయపడే అవకాశం తమకు లభించిందని అనంత్ అంబానీ వెల్లడించారు. ఇప్పటికే అన్నసేవ పేరుతో రిలయన్స్ కుంభమేళాలో భక్తులకు ఆహారం అందిస్తోంది.

ఇవే కాకుండా భక్తుల ఆరోగ్యం కోసం కూడా రిలయన్స్ సంస్థ పలు సేవలు చేస్తోంది. వైద్యసేవల కింద ఓపీడీ, డెంటల్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. మహిళలకు ప్రత్యేకంగా అవసరమైన చికిత్సలను సిద్ధంగా ఉంచింది. అంతేకాకుండా ప్రయాగ్‌రాజ్ నుంచి త్రివేణి సంగమం వద్దకు భక్తులు చేరుకునేందుకు వీలుగా వాహనాలను కూడా నడిపిస్తోంది. మరోవైపు.. ప్రయాగ్‌రాజ్ జిల్లా యంత్రాంగంతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపడుతోంది. త్రివేణి సంగమంలో ఎమర్జెన్సీ సమయంలో ఉపయోగించేందుకు లైఫ్ జాకెట్లు, బోట్లకు అవసరమైన ఏర్పాట్లను కూడా రిలయన్స్ చేసింది. కంపా ఆశ్రమ్స్ పేరిట రిలయన్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రెస్ట్ జోన్లను మహా కుంభమేళాలో నిర్వహిస్తోంది. మరోవైపు.. మహా కుంభమేళాకు వచ్చిన భక్తులు తప్పిపోకుండా ఉండేందుకు ఎటు వైపు వెళ్తే ఏ మార్గం వస్తుందో తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేసింది.

ఇక సెల్‌ఫోన్ సిగ్నల్స్‌లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా బీటీఎస్‌లు, ట్రాన్స్‌పోర్ట్ టవర్లను కూడా రిలయన్స్ ఏర్పాటు చేసింది. కీలకమైన ప్రాంతాల్లో కొత్త ఆప్టికల్ ఫైబర్ లైన్లను కూడా వేసింది. మహా కుంభమేళాలో విధులు నిర్వహించే పోలీసులకు నీటి సౌకర్యాలు, వాచ్ టవర్లు, బారికేడ్లను సమకూర్చింది. ఈ మొత్తం సేవలను భక్తుల వరకు చేర్చేందుకు ద్వారకలోని శారదా పీఠం, శంకరాచార్య ఉత్సవ్ సేవాలయా ఫౌండేషన్, నిరంజని అఖాడా, ప్రభు ప్రేమ్ సంగ్ ఛారిటబుల్ ట్రస్ట్, పరమార్థ్ నికేతన్ ఆశ్రమంతో కలిసి రిలయన్స్ సంస్థలు పనిచేస్తోంది.

## పట్టభద్రుల, టీచర్ల సమస్యల కోసం గెలిచిన ఎమ్మెల్సీలు

# ఏనాడైనా కొట్లాడారా..?

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి ఒకసారి అవకాశం ఇవ్వండి**

**ఎమ్మెల్సీ ఎన్నికల స్టేట్ కోఆర్డినేటర్ రామచందర్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్**





**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 02 (జనం సాక్షి) :**

పట్టభద్రుల , టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లోగడ గెలిచిన కాంగ్రెస్ , బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఏనాడైనా పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కొట్లాడారా..? టీచర్స్ సమస్యల కోసం పోరాడారా.? గెలుపు కోసమే ఆ రెండు పార్టీలు ఎప్పుడు ఆరాటపడ్డాయే తప్ప, ఏనాడూ సమస్యల పరిష్కారం కోసం కొట్లాడింది, మాట్లాడింది ఏమీ లేదని, ఆ రెండు పార్టీలకు జరగబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బిజెపి అభ్యర్థులకు ఒకసారి అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ , ఎమ్మెల్సీ ఎన్నికల స్టేట్ కోఆర్డినేటర్ రామచందర్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం రోజున కరీంనగర్లోని విద్యానగర్ రోడ్ లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల కార్యాలయాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రామ చందర్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ లు మాట్లాడుతూ గత పది ఏళ్లు రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్ , నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్, కాంగ్రెస్ లకు పెద్ద తేడా ఏమీ లేదని , ఆ రెండు పార్టీలకు పట్టభద్రుల , టీచర్ల సమస్యలపై పట్టింపు లేదని , వాళ్లను గోస పెట్టిన చరిత్ర గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఉంటే నేడు కాంగ్రెస్ కూడా అదే బాటలో పయనిస్తుందన్నారు.. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని, పట్టభద్రులు, టీచర్లు జరగబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. అధికారంలో లేకపోయినా పట్టభద్రుల, టీచర్ల సమస్యల కోసం, జీవో 317 పై కొట్లాడింది బిజెపి యే ననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పట్టభద్రులకు, టీచర్లకు బిజెపి ఎప్పుడు అండగా ఉంటుందని , శాసనమండలిలో ప్రభుత్వం మీద పోరాటం చేయాలంటే బిజెపి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని, టీచర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య లను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఈ సందర్భంగా కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొ%శీ%రయ్యలు మాట్లాడుతూ సమస్యలపై అవగాహన ఉందని, పరిష్కారం కోసం కొట్లాడే ధైర్యం ఉందని , జరగబోయే ఎమ్మెల్సీ

ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులుగా తమకు అవకాశం ఇవ్వాలని వారు ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో మాజీ శాసనసభ్యులు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఇంచార్జ్ , ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ , జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు , డి.శంకర్, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు , రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి , బత్తుల లక్ష్మీనారాయణ , కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**రాయికల్ ఫిబ్రవరి 2(జనం సాక్షి ):**

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.రాయికల్ పట్టణంలోని సాడే భీమ్ క్రీడా మైదానంలో రాయికల్ క్రికెట్ లీగ్ సీజన్ 3 ముగింపు కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది.ఫైనల్ మ్యాచ్ ఎద్దండి దివాకర్,కాటిపల్లి రాంరెడ్డి మధ్య ఉత్కంఠంగా జరిగిన పోటీలో కాటిపేల్లి రాంరెడ్డి టీం ఘనవిజయం సాధించింది.ఆర్పిఎల్ ఫ్రాంచెస్, ప్రెస్ క్లబ్ స్నేహపూర్వక మ్యాచ్లో ప్రెస్ క్లబ్ టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ యువతను చెడు అలవాట్లకు పోకుండా క్రీడలు పై ఆసక్తి పెంచేందుకు క్రీడా పోటీలను నిర్వహించిన ఫ్రాంచెస్ నిర్వాహకులను అభినందించారు.ఆర్ పి ఎల్ నిర్వాకులు మ్యాకల రమేష్,ఎద్దండి దివాకర్, కొయ్యడి మహిపాల్ రెడ్డి,ఎలిగేటి అనిల్,కాటిపెల్లి రామ్ రెడ్డి,కల్లెడ ధర్మపురి,బత్తిని నాగరాజు,మోర రామ్మూర్తి,వ్యాయామ ఉపాధ్యాయులు బత్తిని భూమయ్య, పాత్రికేయుల ఫ్రాంచెస్ ఇందూరి గంగాధర్,పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్,సింగిడి శంకరయ్య,బొంగోని శ్రీనివాస్,మచ్చ శేఖర్, రమణ,ముజాఫర్,గుర్రాల వేణు,వాసవి రవి,జగన్, ఎనుగంటి రవి,శ్యామ్,రషీద్,షాకీర్,శ్రీనివాస్, ఉరుమడ్ల సంజీవ్, జితేందర్,కృష్ణ,రాజు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

**వనదుర్గా క్షేత్రంలో ఐఏఎస్,ఐపిఎస్ అధికారులు**

**పాపన్నపేట,ఫిబ్రవరి 2(జనంసాక్షి):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం.ఆదివారం అమ్మవారిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి,మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్,ఐఏఎస్ అధికారి డా.శరత్ దుర్గమ్మ ను దర్శించుకున్నారు.అర్చకులు పార్థివ శర్మ మాతకు ప్రత్యేక పూజలు చేశారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.పలు మొక్కులు చెల్లించారు.ఆలయ ప్రాంగణం భక్తులతో సందడి నెలకొంది. దేవస్థాన ఈఓ చంద్రశేఖర్ తగు ఏర్పాట్లు చేశారు.సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి, తదితరులు ఉన్నారు.





## వైకల్యాన్ని జయించే దివ్య శక్తి దివ్యాంగులకే ఉంటుంది

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 02 (జనంసాక్షి) :**

**వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది.**

**రెట్టింపైన ఆత్మవిశ్వాసంతో బ్రతకడం కేవలం దివ్యాంగులకే సాధ్యం.**

**ప్రభుత్వం ఇవ్వబోయే ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పిస్తాం.**

**దివ్యాంగ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.**



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, దివ్యాంగులకు దైవం తరఫున దివ్య శక్తి ఉంటుందని, వైకల్యాన్ని జయించి రెట్టింపైన ఆత్మవిశ్వాసంతో బ్రతకడం కేవలం దివ్యాంగులకే సాధ్యమని సూడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని కళాభారతిలో ఆదివారం జరిగిన దివ్యాంగుల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొన్ని పరిస్థితుల్లో అంగవైకల్యం కలిగినప్పటికీ దానిని భర్తీ చేసేందుకు ఆత్మవిశ్వాసం తో పాటు ఏదో ఒక రంగంలో ప్రతిభను భగవంతుడు ప్రసాదిస్తాడన్నారు. పాటలైనా ఆటలైన ఎలాంటి నైపుణ్యాలను ప్రదర్శించిన ప్రకృతి ప్రసాదించిన వరం లాగా సకలాంగులను మైమరిపించే విధంగా అబ్బురపరిచే ప్రతిభ ఉంటుందన్నారు. అన్ని ఉండి కూడా ఆత్మవిశ్వాసం లేకుంటే శూన్యమన్నారు. ఆత్మవిశ్వాసంతో బ్రతికే వారిలో దివ్యాంగులు ముందంజలో ఉంటారని వైకల్యాన్ని జయించి సమాజంలో దివ్యాంగుల పాత్ర గొప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఇందులో దివ్యాంగులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడం ప్రభుత్వ పారదర్శకతకు సంకేతమన్నారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో ఆదుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యతనిస్తూ, సమాన హక్కులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని తల్లి వలె చూసుకుం టుందన్నారు. వికలాంగులకు రూ.4000 పెన్షన్ సౌకర్యంతో పాటు ఉచిత ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మాదిరిగా త్వరలో అమలు చేయబోతుందన్నారు. మీకు ఏఇబ్బంది వచ్చినా ఎలాంటి సమస్యలు ఉన్నా నేనున్నానం టూభరోసా కల్పించి, సుడా కార్యాలయానికి వచ్చి తన సేవలను వినియోగించుకోవాలని, చైర్మన్ నరేందర్ రెడ్డి చెప్పగానే దివ్యాంగులు కరతాల ధ్వనులతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ నిజమే..

**ఫిబ్రవరి 02 (జనంసాక్షి) :**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేల సమావేశం నిజమేనని అన్నారు. కాకపోతే తాము రహస్యంగా భేటీ కాలేదని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు ఓ చోట కలిసి మాట్లాడుకోవటం రహస్య భేటీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. త్వరలోనే సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీని కలిశాక అన్ని విషయాలు చెబుతానని అన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే.. హైదరాబాద్ శివారులోని ఓ ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం వార్తలు వస్తున్నాయి. ఓ మంత్రి వ్యవహార శైలిపై వీరు గుర్రుగా ఉన్నారని.. పనుల కోసం కలిసి ఒత్తిడి చేద్దామని భేటీలో చర్చించినట్లు గత రెండు, మూడ్రోజులుగా ప్రచారం జరుగుతోంది. శనివారం సాయంత్రం జరిగిన మంత్రుల భేటీలో ఈ వ్యవహారంపై చర్చ జరగ్గా.. గట్టిగానే వ్యవహరిద్దామని సీఎం, కొందరు మంత్రులు పేర్కొన్నట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య సమావేశంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు సమావేశమైన మాట నిజమేనని స్పష్టం చేసారు. కానీ తాము రహస్యంగా భేటీ కాలేదని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకోవద్దా? అని ప్రశ్నించారు. తాను ఏ ఫైల్ కూడా రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదన్నారు. సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీని కలిశాక పూర్తి వివరాలు చెబుతానని అన్నారు.ఎమ్మెల్యేలు భేటీ అయిన మాట నిజమే. నేను ఏ ఫైల్‌ను రెవెన్యూ మంత్రి దగ్గర పెట్టలేదు. అసలు అది ఏ ఫైల్ అనేది ఎంపీ మల్లు రవి గారు చెప్పాలి. మేమేం రహస్యంగా సమావేశం కాలేదు. అధిష్టానికి చెప్పాల్సింది చాలానే ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశాక అన్ని విషయాలు మాట్లాడుతా.. అన్ని వివరాలు చెబుతా. నా క్యారెక్టర్‌ను తప్పుగా చూపిస్తే ఊరుకునేదే లేదు. ఎవరి చరిత్ర ఏంటో అందరికీ తెలిసిందే. అన్ని ఆధారాలతో పెద్దలతో మాట్లాడుతా' అని అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీ వార్తలపై ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాము ఏ రహస్య సమావేశంలోనూ పాల్గొనలేదని వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా కొందరు కావాలనే ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# పూత, కాత లేని మిరప తోటలు..

# ఆందోళన చెందుతున్న రైతులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**





వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోతున్నారు... పంటలు సరిగా పండక తీవ్రంగా అప్పుల పాలవుతున్నారు... అందిన కాడల్లా అప్పులు తెచ్చి పెట్టుబడులను పెట్టి గంపెడాశతో పంటలను సాగు చేస్తే, చివరికి పూత, కాత లేకుండా తీవ్రంగా నష్టాన్ని మిగిలుస్తున్నా యి... దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు... పుట్టెడు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి కష్టపడి పంట సాగు చేస్తే చివరికి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాక దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు... పంట చేతికి రాగానే అప్పులు తీర్చవచ్చునే రైతుల ఆశలు అడియాశలు అవుతున్నాయి... పంటలు పూత, కాత లేక ఆవేదనను మిగుల్చుతున్నాయి... పూత, కాత లేకపోవడంతో నకిలీ విత్తనాలు అని భావించి లబోదిబోమంటున్నారు... ఈ విషయంపై సంబంధిత కంపెనీ యాజమాన్యం స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని లేనట్లయితే ఆత్మహత్యలే శరణ్యమని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు...

**- వరంగల్ పట్టణంలో విత్తనాల కొనుగోలు..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన రావుల సురేష్, దుబాసి నర్సయ్య, దూదిపాల బుచ్చిరెడ్డి, జయపాల్ రెడ్డి సహా సుమారు 15 మంది రైతులు వరంగల్ పట్టణంలోని ఓ షాపు వద్ద సింజెంట కంపెనీకి చెందిన మిరప విత్తనాలు కొనుగోలు చేశారు. ప్రతి ఏడాది లాగానే తెచ్చిన మిరప విత్తనాలను నార్లు పోసి పంట సాగు చేశారు. ఈ క్రమంలో పంటలో విపరీతంగా పెట్టుబడి పెట్టారు. మొక్కలు ఏపుగా పెరిగినా పూత, కాత లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**- నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు..**

అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. మిరప మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ ఎన్ని ఎరువులు వాడినా, ఎన్ని మందులు కొట్టినా పూత దశలో పూత రావడం లేదు, కాత దశ రావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా మనోవేదనకు గురవుతున్నారు. నకిలీ విత్తనాలతో నష్టపోయామని తెలుసుకుని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.1.50లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయిన తమను ఆదుకోవాలని కోరుతు న్నారు. విత్తనాలు అంటగట్టిన కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు.

**- తోటలను పరిశీలించిన అధికారులు..**

చల్లగరిగ గ్రామములో గల మిరప తోటలను ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవలె పరిశీలించారు. నకిలీ విత్తనాలతో పూత, కాత లేక నష్టపోయామని బాధిత రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు నష్టపో యిన సురేష్, బుచ్చిరెడ్డిల పంటలను పరిశీలించారు.మిరప తోటలో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని త్వరలోనే శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయిలో సందర్శిం చేటట్టు నివేదిక ఇస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు పరిహారం ఇప్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

**అప్పులు చేసి బోలెడు పెట్టుబడులు..**

**నకిలీ విత్తనాలతో నష్టపోయామంటున్న బాధితులు..**

**కంపెనీపై అధికారులకు ఫిర్యాదు..**

**పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకోలు..**

# ఆసిఫాబాద్ జిల్లాలో నిలిచి పోయిన "ఆధార్ సేవలు"

**16 కేంద్రాల్లో 6 సెంటర్లలో మాత్రమే సేవలు**

**ప్రామాణికంగా వివరాలు నమోదు చేయకపోవడంతో ఐడీల రద్దు**

**45 రోజులుగా ప్రజల ఇబ్బందులు**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 2 (జనం సాక్షి)**



ఆధార్ కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యం, అత్యుత్సాహం కారణంగా ప్రజలకు ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ఆధార్ కార్డుల నమోదు, సవరణ ప్రక్రియలో ప్రామాణికంగా ( ప్రాపర్ గా) చేయకుండా ,ఇష్టం వచ్చినట్లు డాటాను నమోదు చేయడంతో ఈ సమస్య తలెత్తినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా ఇష్టం వచ్చినట్లు వివరాలు నమోదు చేసి, చేతులు దులుపుకోవడం వల్ల చివరికి ఆధార్ కేంద్రాల నిర్వాహకుల ఐడీలు రద్దు అయ్యాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గల ప్రజలకు 45 రోజుల గా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. డిసెంబర్ 20 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఆధార్ సేవలు నిలిచిపోయాయి. కొత్తగా ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేయాలన్న, ఆధార్ కార్డుల అప్డేషన్ చేయించాలన్న ఈ ఆధార్ కేంద్రాలు పని చేయకపోవడంతో రోజుల తరబడి కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. కానీ ఆధార్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చెప్పకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. 45 రోజులుగా జిల్లాలో ఆధార్ సేవలు నిలిచిపోయినప్పటికీ సంబంధిత ఉన్నత శాఖ అధికారుల నుంచి ఇప్పటివరకు ఇలాంటి సమాచార రూపంలో ప్రకటనలు జారీ చేయకపోవడం, అధికారుల నిర్లక్ష్యం పట్ల ప్రజలు అభ్యంతరం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 46 ఆధార్ సేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో కాగజ్ నగర్ మండలం, కౌటాల, పెంచికల్పేట్, వాంకిడిలో తో పాటు మరో రెండు మండలాల్లో గల ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. అత్యవసరం ఉన్నవారు వేరే మండలాలకు వెళ్లి సేవలు పొందుతున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా. ఇలా అనేక రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డులు తప్పనిసరి అవుతున్నాయి. దీంతో కొంత మంది వేలిముద్రలు పనిచేయకపోవడం, గతంలో లభించిన ఆధార్ కార్డులకు అప్డేషన్ లేకపోవడంతో వారు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో
ఆధార్ కేంద్రాల సేవలు నిలిచిపోవడంపై జిల్లా ఈ.డి.యం గౌతమ్ రాజును వివరణ కోరగా ఆధార్ కేంద్రాల నిర్వహకులు యు .ఐ. డి లో ప్రాపర్ గా వివరాలు నమోదు చేయకపోవడంతో వారి యొక్క ఐడి రద్దు అయినట్లు తెలిపారు. జిల్లాలోని 16 ఆధార్ సేవా కేంద్రాల్లో 6 కేంద్రాలుమాత్రమే పని చేస్తున్నాయని అన్నారు. ఐడి రద్దయిన కేంద్రాలకు తిరిగి ఐడిని మళ్లీ ప్రభుత్వం పునరుద్ధరించే వరకు వేచి చూడాల్సిందే నని అన్నారు.

# ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమం రద్దు..

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి02 (జనంసాక్షి)**



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# పల్లకిలో ఊరేగిన శ్రీ వెంకటేశ్వర స్వామి

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 02 (జనం సాక్షి)**



శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయము లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రోజున స్వామి వారిని భక్తి శ్రద్ధలతో పల్లకిలో ఊరేగించారు. అంతకు ముందు ఉదయం 6.00 గం.లకు సుప్రభాత సేవ అనంతరం యాగశాల ప్రవేశంతో మూల మంత్ర హెూమము , ధ్వజారోహణము, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద, తదియారాధన (అన్న ప్రసాద)వితరణ కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం 6.00 శేష వాహన సేవలో స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించినారు. 8.00 గం.కు కుమారి దివిజ మరియు బృందము చే కూచి పూడి నృత్య ప్రదర్శన, నిత్య హవన పూర్ణా హుతి, తీర్థ ప్రసాద గోష్టి ఈనాటి కార్యక్రమాల్లో సేవాసమితుల సభ్యులు,ఆలయ మహిళా మండలి సభ్యులు,భక్తులు,ఆలయ ఈ.ఓ. ఎలపాటి రత్నాకర రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసా చార్యులు పాల్గొన్నారు.

# జుజూబీ మాటలు నేను చెప్పను

**జర్నలిస్టుల సాధకబాధకాలు తెలుసు**

**ఖమ్మం రోల్ మోడల్‌గా ఉండేలా చూస్తా..**

**ఎన్నికల కోడ్ ముగిశాక ప్రక్రియ ముందుకు**

**కొందరు జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు**



**ఖమ్మం, (జనం సాక్షి) :**

జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరంగా చిక్కులు లేకుండా... నిపుణుల సలహాతో ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ రోల్ మోడల్ గా ఉండేలా చేస్తామన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం తనను కలిసి వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులతో మంత్రి చర్చించారు. జుజూబి మాటలు చెప్పనని, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ పూర్తయ్యాక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి తప్పకుండా నిర్ణయం తీసుకుందామన్నారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు ఉన్నారు... వాళ్ల సాధక బాధకాలు నాకు తెలుసు కాబట్టి, ముందుగానే డబ్బులు కట్టించి.. కాలయాపన చేస్తూ మభ్యపెట్టే తీరు నాది కాదని స్పష్టం చేశారు. ఆకలితో అలమటించి, రూపాయి రూపాయి పోగేసుకునే ఏ ఒక్క జర్నలిస్టు డబ్బులు వృధా కావద్దని.. ఆ దిశగానే నా ప్రయత్నం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఎలా వీలైతే అలా... నిపుణుల సూచన మేరకు ముందుకెళ్దామన్నారు. ఏదో ఒక రకంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని స్పష్టం చేశారు. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటివాటిని పట్టించుకోను, కాని జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న చిత్తశుద్ధి తో వున్నానని స్పష్టం చేసారు కొంతమంది జర్నలిస్టు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేద్దాం అన్నారు.



మంత్రిని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు వి6 బ్యూరో సయ్యద్ ఖదీర్, నవ తెలంగాణ బ్యూరో కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, దిశ బ్యూరో సాగర్ దువ్వ, టీవీ 9 బ్యూరో నారాయణ, టీవీ 5 బ్యూరో నాగేశ్వర్ రావు, మహా టీవీ బ్యూరో రామకృష్ణ, జనం సాక్షి బ్యూరో కూరాకుల గోపి, ఇండియా టుడే బ్యూరో సంజీవరావు, మహా టీవీ బ్యూరో రామకృష్ణ, 6టీవీ బ్యూరో అయ్యప్ప, పీటీఐ నాగేశ్వర్ రావు, మహా టివి రామకృష్ణ, జనంసాక్షి స్టాఫర్ షేక్ సుభాన్, రాష్ట్రీయ సహారా మొహమ్మద్ ఇంతియాజ్, మున్సిఫ్ బ్యూరో రియాసతుల్లాహ్, అర్షిన్ , వీ5 కేవీ, నవతెలంగాణ రిపోర్టర్ గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దిశ రిపోర్టర్ మూర్తి, జీ న్యూస్ రవి, జనంసాక్షి కనకరాజు, సేన నరేష్, ఉప్పలయ్య, లక్ష్మణ్, కెమెరామెన్లు యాకూబ్ పాషా, షేక్ ఫయాజ్, అర్షద్, యూసుఫ్, జాకీర్, రంగా, సతీష్ పాల్గొన్నారు.

# నిర్మలమ్మ బడ్జెట్‌పై అసంతృప్తి

## కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శి సిరాజ్ హుసేన్

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 02 (జనం సాక్షి) :**



దేశంలో మైనార్టీలు దళితులు మహిళలు తమ భద్రతపై ఆందోళన చెందుతున్నారని, కానీ బడ్జెట్‌లో మహిళల భద్రత ఊసెత్తలేదని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శి సిరాజ్ హుసేన్ అన్నారు.
ఆంధ్ర, బీహార్ కు ప్రకటించిన దాంట్లో తెలంగాణకు 25 శాతం కూడా ప్రకటించలేదని వారికి ఎందుకిచ్చారు అని మేము అడగటం లేదు మాకు కూడా న్యాయం చేసి సమానంగా నిధులు ప్రకటించి వుంటే బాగుండేదన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణను మరోసారి విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్రానికి ఇండియన్ ఐఐఎం, ట్రిపుల్ ఐటీ సంస్థలను కేటయించాలని ఎప్పటినుంచో అడుగుతున్నా ఈ బడ్జెట్‌లో కూడా కేటాయించలేదన్నారు. జిల్లాకో నవోదయ విద్యాలయం కేటయించాలన్న మా వినతిని పెడచెవినపెట్టారని ఆరోపించారు. అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూల్స్ ఉన్నాయి.. తెలంగాణ ఈ బడ్జెట్‌లో కూడా సైనిక్ స్కూల్‌కు నోచుకోలేదన్నారు.
తెలంగాణలో బీజేపీ నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి దక్కిందేమీ లేదన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీయాలన్నారు. రాజ్యసభలో మా సభ్యులు తెలంగాణకు దక్కాల్సిన ప్రయోజనాలపై కేంద్రంపై పోరాడుతున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే బీహార్ రాష్ట్రానికి వరాలు ప్రకటించారని ఆరోపించారు. ఎన్నికలుంటేనే రాష్ట్రాలను పట్టించుకుంటామన్న వైఖరి సరికాదని, మోడీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంటారు. కానీ అన్ని రాష్ట్రాలను ఒకేలా చూడడం లేదని ఆరోపించారు. మధ్యతరగతి ప్రజలకు ఇన్‌కమ్ టాక్స్‌లో ఊరటనివ్వడాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయానికి గతంతో పోలిస్తే కొంత తోడ్పాటు లభించిందని, అయినా ఇది సరిపోదన్నారు. పదేళ్లుగా మోడీ పేద, మధ్యతరగతి ప్రజలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, కొంతమంది దగ్గరే సంపద కేంద్రీకృతమైన ధోరణి పెరుగుతోందని వెల్లడించారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమని అన్నారు.

# రిమ్స్‌లో యన్ సీడీ క్లినిక్ ప్రారంభించిన కలెక్టర్

**అదిలాబాద్ ప్రతినిధి ( జనంసాక్షి).2**



జిల్లా కేంద్రంలోని రిమ్స్ లో అసాంక్రమిక వ్యాధితో బాధపడు తున్న రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా రిమ్స్ ఆసుపత్రిలో యన్ సీడి క్లినిక్ ను ప్రారంభించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు సేవలు అందించే గదులను సందర్శించారు. అక్కడి సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ యన్ సీడి క్లీనిక్ లో అసాంక్రమిక వ్యాధులతో బి.పి, మధుమేహం, క్యాన్సర్ మొదలైనవి వాటితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిం చడం, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.
కార్యక్రమం లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, యన్ సీడి క్లినిక్ జిల్లా కార్యక్రమ అధికారి శ్రీధర్ ఆసుపత్రి సుపరెండెంట్ అశోక్, గజానన్, అదనపు డిఎంహెచ్ఓ డీటిసీఓ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పి.శంకర్ గౌడ్

**నస్పూర్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి)**




మంచిర్యాల జిల్లాలో టాస్క బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్క) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పి.శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్లో విలేకరులతో మాట్లాడారు. టాస్క అనేది కేవలం స్వచ్ఛంద సంస్థ మాత్రమే అని తెలిపారు. వయోవృద్ధుల కొరకు ప్రతి మండలంలో డే కేర్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, ఉచిత వైద్యం,రైల్వే, బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.2007 చట్టం సెక్షన్ 21 ప్రకారం వృద్ధులకు పోలీస్ శాఖ రక్షణ కల్పించాలని కోరారు.వయోవృద్ధుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనంతరం టాస్క మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా నస్పూర్ పట్టణానికి చెందిన చిలువేరు సదానందంని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టాస్క జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కనకయ్య,కలవేని
సమ్మయ్య,కె నరసింహారెడ్డి, గంద్ర రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల రక్షణ మనందరి బాధ్యత : మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి)**



సేవా భారత్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఉదయం జరిగిన రన్ ఫర్ గర్ల్ చైల్డ్ 5 కే, 10 కే 21కె రన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఆడ పిల్లల సంరక్షణ మన అందరి భాద్యతని అని అన్నారు. గత తొమ్మిది సంత్సరాలుగా సేవా భారతి వారు ఇటువంటి కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున సాఫ్ట్ వేర్ ఉద్యోగులు పాల్గొనడం పై మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

# మొహమ్మదియ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :**



ఖాదీమీన్ ఉమ్మత్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మొహమ్మదియ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతులు లభించాయి.ఆదివారం మహారాష్ట్ర లోని నాందేడ్ జిల్లాలో జరిగిన ఈ క్విజ్ పోటీల కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అందులో మదిహ, నూర్ షమ, శిఫా నాజ్, మొహమ్మద్ రాయన్ హుస్సేన్ లకు మొదటి స్థానం, జుబి, జాయిద్ విద్యార్థులకు రెండవ స్థానం వచ్చింది. అలాగే ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అయేషా సుల్తానా, ఉత్తమ ఉపాధ్యాయుడిగా సలీం ఖాన్ లకు స్థానం దక్కిందని పాఠశాల కరెస్పాండంట్ అజ్మత్ అలీ పేర్కొన్నారు.

# అబాకస్ స్టేట్ లెవెల్ లో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థికి ఉత్తమ ప్రతిభ బహుమతి

**గణపురం, జనవరి 02 (జనం సాక్షి ):**



ప్రఖ్యాత ఎన్జీవో సంస్థ విశ్వం ఎడ్యుటెక్ అబాకస్ అండ్ వేదిక్ మాథ్స్ వారు అంకగణిత సమస్యలను క్యాలిక్యులేటర్, కంప్యూటర్ వంటి పరికరాలు లేకుండా అవలీలగా సాధించడానికి అబాకస్ అనే పూసల చట్రం ద్వారా విద్యార్థులకు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపించడానికి ప్రతి ఏటా మండల, జోనల్, రాష్ట్రస్థాయిలో అబాకస్ పోటీలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ కూకట్ పల్లి లోని పిఎన్ఎం హైస్కూల్ యందు స్టేట్ లెవెల్ అబాకస్ సీనియర్ -2 కాంపిటీషన్లో గణపురం మండలం చెల్పూర్ ఎంజీఎం హైస్కూల్ విద్యార్థి మంద సాన్వి (ఐదవ తరగతి) పాల్గొని ఉత్తమ ప్రతిభ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్,ప్రిన్సిపల్ మధుకర్ తో పాటు మిగతా ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

# దామాషా వాటాను పొందడం తమ న్యాయమైన హక్కు :మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి)**



భారతదేశ జిడిపికి తెలంగాణ రాష్ట్రం గణనీయమైన సహకారం అందిస్తున్నందున, కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులలో దామాషా వాటాను పొందడం తమ న్యాయమైన హక్కు అని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పక్క రాష్ట్రాలకు, ఇతర రాష్ట్రాలకు ఒక విధంగా తమ తెలంగాణ రాష్ట్రానికి మరొక విధంగా బడ్జెట్ లో నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక పటిమను గుర్తించి అందుకు అనుగుణంగా నిధులు కేటాయించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ప్రజల అభివృద్ధి, శ్రేయస్సును కొనసాగించడానికి కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రం న్యాయమైన వాటాకు పొందడానికి అర్హమైందని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
3 ఫిబ్రవరి 2025

# వెనక్కి తగ్గం.. పోరుబాట వీడం





- అంతా ఏకమై ఇథనాల్‌పై పోరాటం
- ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా విద్యావంతులు ఆందోళన

**రాజోలి, ఫిబ్రవరి 02 (జనంసాక్షి) :** పచ్చని పంట పొలాలు పండే ప్రాంతంలో విషపూరితమైన ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించొద్దని 11వరోజు విద్యావంతులు రిలే నిరాహార దీక్షలో డిమాండ్ చేశారు. పచ్చని పల్లెల సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ భవిష్యత్ తరాలను నాశనం చేస్తాయని, అయినప్పటికీ అధికారులు, ఫ్యాక్టరీ కంపెనీ యాజమాన్యం కుమ్మక్కై అక్రమంగా అనుమతులు తెచ్చుకున్నారన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించకుండా ఫ్యాక్టరీ నిర్మిస్తే చూస్తూ ఊరుకోమని మండిపడ్డారు. తుంగభద్ర నది కలుషితమయ్యే అవకాశం ఉందని, ఫ్యాక్టరీని రద్దు చేసే వరకూ పోరాడుతామన్నారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థాలతో క్యాన్సర్‌తోపాటు శ్వాసకోశ సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. పచ్చని భూములు బీళ్లుగా మారడంతోపాటు సమీపంలోని తుంగభద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని, కానీ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో విద్యావంతులు మహేష్, లక్ష్మన్న, తిమ్మప్ప, లింగన్న, అంజి, నాగేష్, నర్సింహ్, రామన్ గౌడ్ వెంకటేష్ కిరణ్, రాజేంద్ర వీరికి మద్దత్తుగా మహిళలు శాంతమ్మ, నాగలక్ష్మి, నరసమ్మ, పావని, గీత, లక్ష్మీ, శంకరమ్మ, వెంకటేశ్వరమ్మ, సరస్వతి, ఇందు, నాగమ్మ, భారతమ్మ, రాధమ్మ, భాగ్యమ్మ,త చిన్న ధన్వాడ గ్రామ మున్నూరు కాపులు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పై వివక్ష చూపి నిధుల కేటాయింపులో అన్యాయం చేసినందుకు నిరసనగా సోమవారం జిల్లా కేంద్రాలలో భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఈ విషయమై ఆయన ఒక ప్రకటన చేస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో తెలంగాణ కు చేసిన అన్యాయం పైన గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమాలల జిల్లాలోని ఎంపీ లు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్ లు, పోటీ చేసిన అభ్యర్థులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రాణహిత (తుమ్మిడి హెట్టి) ప్రాజెక్టు నిర్మించాలి

- ప్రాజెక్ట్ నిర్మించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
- తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పశ్చిమాన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి తూర్పున ప్రాణహిత వరకు, పాలకులు ఏ పార్టీ వారైనా తీరని అన్యాయం తలపెట్టారని పేర్కొన్నారు. పాలకుల చిత్తశుద్ధి లోపం మూలంగా ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు ఆశించిన స్థాయిలో ఇరిగేషన్ అభివృద్ధి కాలేదని తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో రాజకీయ, వామపక్ష-ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెండింగు లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రామడుగు లక్ష్మణ్ (సిపిఐ జిల్లా కార్యదర్శి), ఏ.లాల్ కుమార్ సిపిఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఏ పున్నం (సిపిఎం పార్టీ జిల్లా నాయకులు), గోపీనాథ్ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్రన్న), జూపాక శ్రీనివాస్ సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్) అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ప్రధాన వక్తలుగా నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ...బిఆర్ఎస్ తుంగలో తొక్కిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత తుమ్మిడిహెట్టి, కుప్టి ప్రాజెక్టులు నిర్మించాలని పేర్కొన్నారు. అనంతరం టి .శ్రీనివాస్ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ.... కాళేశ్వరం రీ-డిజైనింగ్ రీ-ఇంజనీరింగ్ చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని పేర్కొన్నారు. వెయ్యి ఏనుగులు తిన్న కాళేశ్వరం అవినీతి కేసీఆర్ మళ్లీ ప్రజలను మోసగించడానికి ముందుకు వస్తున్నారు అన్నారు. అనంతరం కలవేణి శంకర్ (సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు) మాట్లాడుతూ... ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని ద్రోహం జరిగిందన్నారు. ప్రణాళికను మరిచి వారి వ్యక్తిగత ఎజెండాలకు భారీ ఎత్తున బడ్జెట్ కేటాయించు కుంటున్నారన్నారు. సదస్సులో సంకె రవి సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దశాబ్దాలుగా ఉన్న పాలక ప్రజా ప్రతినిధులు, ఎంఎల్ఏ, ఎంపీ లు ఈ జిల్లాలోని బీడు భూములకు నీరు సాధించడంలో విఫలమయ్యారన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంలో 23 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే కేవలం మూడున్నర లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. ఈ సదస్సులో కే విశ్వనాథ్ సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు, దేవరాజ్ సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి, జైపాల్ సింగ్ (తెలంగాణ ప్రజా ఫ్రంట్ టీపీఎఫ్ జిల్లా కార్యదర్శి), గోగర్ల శంకర్ సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు), సమ్మయ్య ( టీపీఎఫ్ నాయకులు), లక్ష్మీకాంతం (సిపిఐ ఎంఎల్ లిబరేషన్) ప్రసంగించారు. మల్లన్న, అందే మంగ, జ్యోతి, అరుణ, చంద్రశేఖర్, శేఖర్ తదితరులు రైతులపై, జలసాధనపై పాటలతో సదస్సులో ఉత్సాహం నింపారు.

# ఎమ్మెల్సీగా గెలిచి సోనియాగాంధీకి గిఫ్ట్ ఇస్తా

- అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 02 (జనం సాక్షి) :** రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తాను ఎమ్మెల్సీగా గెలిచి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గిఫ్ట్ గా ఇస్తానని పట్టభద్రులు ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందని తనకు సహకరించిన ఢిల్లీ పెద్దలకు రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో 25 రోజులే మిగిలి ఉన్నందున ప్రతి కాంగ్రెస్ కార్యకర్తతో మమేకమై ముందుకు సాగుతానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్తర తెలంగాణ చరిత్రను మార్చే విధంగా ఉండాలని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తన గెలుపులో పాలుపంచుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని ఉచితంగా తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గత 34 సంవత్సరాలుగా తాను విద్యారంగంలో తెలంగాణ అయితే రాణించానో.. ఏడాది కాలంలో సీఎం రేవంత్ రెడ్డి గారు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రభుత్వం మెడికల్ కళాశాల మంజూరు చేసిందని మౌలిక సదుపాయాలు మాత్రం మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. గత ఐదు నెలలుగా ఎమ్మెల్సీ పరిధిలోని 42 నియోజకవర్గాలు పర్యటించాలని సమస్యలు తన దృష్టికి వచ్చేయని పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ కారం లోకి వచ్చిన ఏడాదిలోనే 55000 ఇచ్చి యువతకు భరోసా కల్పించిందని గుర్తు చేశారు. కరీంనగర్ వాహన యూనివర్సిటీ పరిధిలో లా కాలేజ్ తోపాటు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేస్తానని ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకార భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, శ్రావణ్ నాయక్, మునిగంటి అనిల్, ఫహాద్ గండి రవీందర్, వెన్నం రజిత రెడ్డి, షబానా, శరణ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 10న హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా

- తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య తెలియజేశారు. రూ.50,65,345 కోట్లతో 2025-26 కేంద్ర బడ్జెట్‌ను 01-02-2025 న ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. గత బడ్జెట్ కంటే సుమారు రూ.3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జిడిపి లోటు 4.4%గా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 2025-26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10న సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగే మహాధర్నా కార్యక్రమంలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమని అన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 10 సంవత్సరాల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసమని, వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి మోసగించిందని, రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపును విస్మరించిందని, విద్యుత్‌రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనుందని తెలిపారు.

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుందర్ మాట్లాడుతూ...బీమా రంగంలో ఎఫ్‌డిఐలు 74 శాతం నుండి 100 శాతం పెంచడం జాతీయ బీమా సంస్థలను బలహీనం చేయడమే. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించి, ఖనిజ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బరితెగించిందని, కార్మికవర్గం సుదీర్ఘకాలం లేబర్ కోడ్‌ల రద్దుకు, కనీస వేతనం రూ.26,000ల డిమాండ్, స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం వంటి అంశాలను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, అధికస్థాయి నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం, అసమానతలు, ప్రైవేట్ పెట్టుబడుల పెంపు వంటి ఆర్థిక పరిస్థితుల నేపథ్యానికి అనుగుణంగా 2025-26 బడ్జెట్ రూపకల్పన చేయకపోవడం కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుందని, ఈ బడ్జెట్ సాధారణ ప్రజలు, కార్మికవర్గంపై రానున్న రోజుల్లో మరిన్ని భారాలు మోపి ఉపాధి కల్పన స్థాయిలను మరింత క్షీణింపజేస్తుందని, మధ్యతరగతికి రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపును బడ్జెట్‌లో ప్రకటించినా, పాత పద్ధతిలో ఎటువంటి మార్పులను ప్రస్తావించకపోవడం మధ్యతరగతి ప్రజలకు నష్టమని, అదే సమయంలో సంపద పన్ను 3 శాతానికి తగ్గించి మధ్యతరగతిపై ఆదాయపు పన్ను విధింపు ధనవంతులకు లబ్ధి చేకూర్చడమే. పెన్షన్ రంగానికి నిధులు పెంచకపోవడం. స్థూలంగా 10 సంవత్సరాల బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రం యావత్తూ తీవ్రంగా నిరసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా దేవాలయం అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వైరా, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) : నిర్ణీత గడువులోగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోని చారిత్రాత్మకమైన ఈ దేవాలయానికి వచ్చేటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించడానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో అభిషేక మండపం, కళ్యాణ మండపం, వేదిక, కాటేజీలు, టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ ప్రతి కట్టడాన్ని నిశితంగా పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు గురించి ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, డిసిసి అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# 5న కేబినెట్‌కు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదిక

- మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 2 (జనంసాక్షి) :** 5వ తేదీన సబ్‌కమిటీ ఇచ్చిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కుల సర్వే నివేదికను కేబినెట్‌లో చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన సభలో తీర్మానం చేసుకొని ప్రత్యేక కమిషన్ వేసుకొని ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రులు తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. దాని కార్యరూపం దాల్చడానికి సంబంధించి ఉదయం నుండి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులం కూర్చొని దానిపై చర్చించామని తెలిపారు. వర్గీకరణ పై సబ్ కమిటీ తీసుకున్న ప్రిగేసివ్ యాక్టివిటీస్ పై డిస్కస్ చేశామన్నారు. 5వ తేదీని నివేదిక చర్చ తరువాత సభలో చర్చకు పెట్టడం ద్వారా ట్రాన్స్‌పెరన్సీగా ప్రజాస్వామిక విధానాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. దేశంలోనే ఇదొక చారిత్రాత్మక మార్పు అని, మొదటి సారి ఈ రాష్ట్రంలో జరుగుతోందని, దేశం మొత్తానికి రోల్ మోడల్ కావాలని ఆకాంక్షించారు. అన్నిరకాల అంశాలు చర్చించామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370